



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

రేవంత్ పాలనపై ప్రజలు హర్షం
రాష్ట్రంలో కాంగ్రెస్‌కు మెరుగైన ఫలితాలు
4 నుంచి 8 కి పెరిగిన
బిజెపి ఎంపిల బలం
బిఆర్ఎస్‌కు ఘోర పరాభవం
లోపలి పేజీల్లో...

సంపుటి 26, సంచిక: 346 | బుధవారం | 05-06-2024 | హైదరాబాద్ | Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12 | ఖమ్మం : 8+8 | కరీంనగర్ : 8+8 | మహబూబ్‌నగర్ : 12 | వెల రూ. 5.00

# బిజెపికి దిమ్మతిరిగే తీర్పు

- లోక్‌సభలో 400 సీట్లకు అర్రులు చాచిన మోదీ పార్టీకి మెజారిటీ దక్కని స్థితి
- ప్రభుత్వం ఏర్పాటుకు మిత్రపక్షాలే దిక్కు
- కీలకంగా మారిన చంద్రబాబునాయుడు, నితీశ్‌కుమార్
- ఎపికి ప్రత్యేకహోదా ప్రకటిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చినట్లు జాతీయ మీడియా ప్రచారం
- బిజెపి వెన్నువిరిచిన ఉత్తరప్రదేశ్, బెంగాల్, రాజస్థాన్, హర్యానా, కర్నాటక, మహారాష్ట్ర ఓటర్లు





| | |
|---|---|
| మొత్తం సీట్లు | : 543 |
| బిజెపి | : 291 |
| కాంగ్రెస్ | : 234 |
| ఇతరులు | : 18 |

**న్యూఢిల్లీ:** సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు బిజెపికి దిమ్మతిరిగే తీర్పునిచ్చారు. 'అబ్‌కే బార్ 400 పార్' (ఈసారి 400 సీట్లకుపైగా) అంటూ ఎన్నికల బరిలోకి దిగిన మోదీ పార్టీకి చుక్కెదురైంది. ప్రభుత్వం ఏర్పాటు చేయాలంటే, మిత్ర పక్షాల మద్దతు అత్యవసరంగా మారింది. మొత్తం 543 స్థానాలకు ఎన్నికలు జరగ్గా, బిజెపి సొంతంగా 240 స్థానాల్లో గెలిచింది. ఎన్‌డిఎ లోని మిగతా మిత్రపక్షాలు కలిసి 52 స్థానాలను కైవసం చేసుకున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు, బీహార్‌లో జెడియు చీఫ్ నితీశ్ కుమార్ నిర్ణయం ఇప్పుడు కీలకంగా మారింది. వారు ఒకవేళ ఎన్‌డిఎకు కాకుండా, ప్రతిపక్ష 'ఇండియా' కూటమికి మద్దతునిస్తే, మోదీ ఆశలు గల్లంతయ్యే ప్రమాదం ఉంది. 'ఇండియా' కూటమికి 199 సీట్లు దక్కగా, వాటిలో కాంగ్రెస్ వాటా 99. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశాలు బిజెపికే ఎక్కువగా ఉన్నప్పటికీ, మిత్ర పక్షాలపై ఆధారపడాల్సిన పరిస్థితి. ఆయా పార్టీల డిమాండ్లను అంగీకరించక తప్పదు. కాగా, బుధవారం 'ఇండియా' కూటమి సమావేశమై చర్చిస్తుందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే ప్రకటించడం, ప్రభుత్వ ఏర్పాటుకు ప్రయత్నాలు జరపవచ్చన్న అభిప్రాయానికి ఊతమిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తామని ఇప్పటికే చంద్రబాబుకు కాంగ్రెస్ హామీ ఇచ్చిందనే వార్త జాతీయ మీడియాలో విస్తృతంగా ప్రచారమవుతున్నది. ఇదే నిజమైతే, ఎవరికి మద్దతునివ్వాలనే విషయంపై టిడిపి పునరాలోచన చేసే అవకాశాలు లేకపోలేదు. తిరుగులేని ఆధిక్యాన్ని అందిస్తాయనుకున్న ఉత్తర ప్రదేశ్ (యుపి), పశ్చిమ బెంగాల్, రాజస్థాన్, హర్యానా, కర్నాటక నుంచి బిజెపికి ఎదురుదెబ్బ తగిలింది. ఈ ఎన్నికల్లో ఎన్‌డిఎకు 292, 'ఇండియా'కు 199 స్థానాలను లభించగా, వివిధ పార్టీలకు చెందిన వారు, స్వతంత్రులు 52 మంది ఉన్నారు.

**మోదీ, రాహుల్ గెలుపు.. అమిత్ షా రికార్డు**

ఉత్తరప్రదేశ్‌లోని వారణాసి నుంచి మరోసారి పోటీ చేసిన ప్రధాని నరేంద్ర మోదీ గెలుపొందారు. ఆయనకు 6,12,970 ఓట్లు లభించగా, సమీప ప్రత్యర్థి, కాంగ్రెస్ అభ్యర్థి అజయ్ రాయ్ 4,50,457 ఓట్లు దక్కించుకొని, 1,52,513 ఓట్ల తేడాతో తరువాయి 2లో

## రాష్ట్రంలో కాంగ్రెస్‌తో ఢీ అంటే ఢీ అన్న బిజెపి

చెరో 8 లోక్‌సభ స్థానాలు కైవసం
బిఆర్ఎస్ అడ్రస్ గల్లంతు
2019తో పోల్చితే కాంగ్రెస్ 3 నుంచి 8కి పెంపు
బిజెపి 4 నుంచి 8కి

ప్రజాపక్షం / హైదరాబాద్





లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్, బిజెపి రెండు పార్టీలు ఢీ అంటే ఢీ అనే విధంగా పోటీపడ్డాయి. 2019 లోక్‌సభ ఎన్నికల్లో మూడు స్థానాలకు పరిమితమైన కాంగ్రెస్ ఈసారి ఎన్నికల్లో ఎనిమిది స్థానాలకు పెరిగింది. మరోవైపు గతంలో నాలుగు స్థానాలు ఉన్న బిజెపికి ఎనిమిది స్థానాలు వచ్చాయి. ఇక బిఆర్ఎస్ ఒక్క స్థానంలో తరువాయి 2లో

| | |
|---|---|
| మొత్తం సీట్లు | : 17 |
| కాంగ్రెస్ | : 8 |
| బిజెపి | : 8 |
| ఎంఐఎం | : 1 |

కంటోన్మెంట్‌లో కాంగ్రెస్ విజయం 03

## అదిరిందయ్యా చంద్రం!

జగన్ పార్టీని చిత్తుచిత్తుగా ఓడించిన ఆంధ్రా ఓటర్లు
ప్రతిపక్ష హోదాకూడా దక్కని వైఎస్సార్‌సిపి
వైనాట్ 160 అసెంబ్లీ సీట్ల లక్ష్యం సాధించిన కూటమి
పవన్‌కల్యాణ్ జనసేన నూరుశాతం సక్సెస్









ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తన మంత్రివర్గ రాజీనామాను గవర్నర్‌కు సమర్పించారు.

**అమరావతి:** ఏపీ ఎన్నికల ఫలితాల్లో టీడీపీ కూటమి సునామీ సృష్టించింది. వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనపై ప్రజలు తిరుగులేని తీర్పునిచ్చారు. గతంలో ఎన్నడూలేని విధంగా జిల్లాలకు జిల్లాలు తుడిచిపెట్టుకుపోయాయి. ఎనిమిది జిల్లాల్లో వైసీపీ కనీసం బోణీ కొట్టలేదు. జగన్ నియంతత్వ పాలనకు రాష్ట్ర ప్రజలు చరమగీతం పాడుతూ... తెలుగుదేశం పార్టీ నేతత్వంలోని కూటమికి ప్రజలు ఘన విజయం అందించారు. కౌంటింగ్ ప్రారంభం నుంచి ఏ దశలోనూ వైసీపీ కనీస స్థాయిలో కూటమికి పోటీ ఇవ్వలేకపోయింది. 'వార్ వన్ సైడ్' అన్నట్లుగా రాష్ట్రంలో దాదాపు అన్ని స్థానాల్లోనూ కూటమి దుమ్మురేపింది. కూటమి అభ్యర్థుల మెజారిటీ 20 వేల నుంచి 80 వేల ఓట్ల వరకు ఉందంటే ప్రజలు ఎలా తీర్పు ఇచ్చారో అర్థం చేసుకోవచ్చు. పోస్టల్ బ్యాలెట్ దగ్గర నుంచి అన్ని రౌండ్లలోనూ వైసీపీ చతికిలపడింది. ప్రజాతీర్పు స్పష్టం కావడంతో ఆరేడు రౌండ్లు తర్వాత వైసీపీ అభ్యర్థులు కౌంటింగ్ కేంద్రాల నుంచి ఇంటిముఖం పట్టారు. కనీసం ప్రతిపక్ష హోదాను కూడా వైసీపీ దక్కించుకోలేకపోయింది. రాష్ట్రంలో 175 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి పోటీ చేసిన వైసీపీ కేవలం పది స్థానాకే పరిమితమైంది. మొత్తం 13 ఉమ్మడి జిల్లాలకుగానూ 8 జిల్లాల్లో టీడీపీ కూటమి క్లీన్ స్వీప్ చేసింది. ఈ ఎనిమిది జిల్లాల్లో 110 సీట్లు ఉండగా టీడీపీ, జనసేన, తరువాయి 2లో

| పార్టీ | అసెంబ్లీ (175) | లోక్‌సభ (25) |
|---|---|---|
| టిడిపి | 135 | 16 |
| జనసేన | 21 | 2 |
| బిజెపి | 8 | 3 |
| వైసిపి | 11 | 4 |

## 'అయోధ్య'లో గెలిచిన సమాజ్‌వాదీ పార్టీ !

**అయోధ్య :** ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఫైజాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థి అవదేశ్ ప్రసాద్ 55వేల మెజారిటీతో గెలుపొందారు. ఈ నియోజకవర్గం పరిధిలోనే అయోధ్య నగరం ఉన్నది. బిజెపి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అయోధ్య రామాలయం నిర్మించిన నేపథ్యంలో ఇక్కడ ఎవరు గెలుస్తారని అందరిలో ఆసక్తి నెలకొంది. ఇక్కడ వరుసగా మూడవసారి గెలుపొందుదామని భావించిన బిజెపి సిట్టింగ్ ఎంపి లల్లూ సింగ్‌పై ఎస్‌పి ఎంఎల్‌ఎ అవదేశ్ సింగ్ గెలుపొందారు. ఈ స్థానం నుండి పోటీ చేసిన సిపిఐ అభ్యర్థిగా పోటీ చేసిన రిటైర్డ్ ఐపిఎస్ అధికారి అవదేశ్ సేన్‌కు 15,367 ఓట్లు లభించాయి.

## ఒడిశాలో బిజెపి పాగా

**భువనేశ్వర్:** ఒడిశా అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి విజయం సాధించి, ప్రభుత్వాన్ని ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నది. మొత్తం 147 స్థానాలకు ఎన్నికల ప్రక్రియ పూర్తికాగా, బిజెపి 78 సీట్లతో అతిపెద్ద పార్టీగా అవతరించింది. అధికారికంగా 37 స్థానాల్లో బిజెపి విజయాన్ని ప్రకటించగా, మరో 48 స్థానాల్లో ఆధిక్యంలో కొనసాగుతున్నది. దశాబ్దాల తరబడి తిరుగులేని ఆధిపత్యాన్ని చెలాయించిన నవీన్ పట్నాయక్ నేతృత్వంలోని బిజూ జనతా దళ్ (బిజెడి) 51 స్థానాలకు పరిమితమైంది. ఈ పార్టీ 29 విజయాలను నమోదు చేయగా, 22 నియోజకవర్గాల్లో ఆధిక్యాన్ని కొనసాగిస్తున్నది. గత అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే బిజెపి 27 స్థానాలను మెరుగుపరచుకోగా, బిజెడి 32 స్థానాలను కోల్పోయింది. కాంగ్రెస్ పార్టీ 14 సీట్లతో సరిపుచ్చుకోనుంది. 6 స్థానాల్లో విజయాన్ని అధికారికంగా ప్రకటించగా, 8 స్థానాల్లో ముందంజలో కొనసాగుతున్నది. గత ఎన్నికలతో పోలిస్తే కాంగ్రెస్ పరిస్థితి కూడా 3 సీట్ల మేర మెరుగుపడింది. సిపిఎం ఒక స్థానాన్ని దక్కించుకుంది. గత ఎన్నికల్లో ఇద్దరు స్వతంత్రులు ఎన్నికకాగా, ఈసారి ముగ్గురు స్వతంత్రులు ఉన్నారు. మొత్తం మీద ఒడిశాలో బిజెడి శకానికి తెరపడింది. అనూహ్యంగా బిజెపి అక్కడ పాగా వేసింది.

## ఇండియా కూటమిదే నైతిక విజయం

మోదీ హవా ఉందన్న వారికి గుణపాఠం
సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ నారాయణ

ప్రజాపక్షం/హైదరాబాద్



దేశం మొత్తం మోడీ హవా కొనసాగుతుందని, లోక్‌సభ ఎన్నికల్లో 400 లకుపైగా సీట్లు సాధిస్తామని ధీమాతో ఉన్నవారికి దేశ ప్రజలు గట్టి గుణపాఠాన్ని నేర్పించారని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ అన్నారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై మంగళవారం ఆయన స్పందిస్తూ ఎన్నికల్లో ఒక రకంగా ఇండియా కూటమి నైతిక విజయమని, ఎన్‌డిఎ కూటమి అపజయంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఒకవేళ పొరపాటున ఎన్‌డిఎ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినా, ఎన్‌డిఎ ప్రభుత్వం ఇష్టానుసారంగా వ్యవహరించేందుకు ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ కూ టమి కళ్లెం వేసేంత స్థాయిలో సీట్లు సాధించడం హర్షణీయమన్నారు.

**కాంగ్రెస్ అందరినీ కలుపుకుని వెళ్ళి ఉంటే మరిన్ని స్థానాల్లో విజయం సాధించి ఉండేది**

తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై డాక్టర్ నారాయణ స్పందిస్తూ కాంగ్రెస్ పార్టీ తమిళనాడు తరహాలో డిఎంకె పార్టీలా తరువాయి 2లో

## లోక్‌సభలో పెరగనున్న వామపక్ష గొంతుక

9 స్థానాలలో గెలిచిన 4 వామపక్షాలు
భారీ మెజారిటీతో 2 స్థానాలను తిరిగి దక్కించుకున్న సిపిఐ





కె.సుబ్బరాయన్ (సిపిఐ), వి.సెల్వరాజ్ (సిపిఐ)

**న్యూఢిల్లీ :** 18వ లోక్‌సభలో వామపక్షాల గొంతు పెరగనుంది. ఈ ఎన్నికల్లో తొమ్మిది స్థానాల్లో వామపక్షాలు గెలుపొందాయి. గత లోకసభ ఎన్నికల్లో వామపక్షాలు ఆరు స్థానాలు గెలుచుకోగా, ఈసారి నాలుగు వామపక్ష పార్టీలు తొమ్మిది స్థానాలు గెలుచుకున్నాయి. వాటిలో సిపిఐ 2, సిపిఐ(ఎం) 4, సిపిఐ(ఎంఎల్)లిబరేషన్ రెండు, ఆర్‌ఎస్‌పి ఒక స్థానంలో విజయం సాధించాయి. సిపిఐ గత ఎన్నికల్లో తమిళనాడులో గెలుచుకున్న రెండు సీట్లను తిరిగి నిలబెట్టుకుంది. లోక్‌సభలో సిపిఐ పక్ష నాయకుడుగా వ్యవహరించిన కె.సుబ్బరాయన్ వరుసగా రెండవసారి తిరుప్పూర్ నుండి ఘన విజయం సాధించారు. ఆయన తన సమీప ప్రత్యర్థి, ఎఐఎడిఎంకె అభ్యర్థి పి.అరుణాచలంపై 1,25,928 ఓట్ల భారీ మెజారిటీతో గెలుపొందారు. గత ఎన్నికల్లో ఆయనకు 93 వేల మెజారిటీ లభించింది. నాగపట్టిణం స్థానం నుండి సిపిఐ అభ్యర్థి వి.సెల్వరాజ్ తరువాయి 2లో

## బిజెపికి రాజకీయ ఓటమి

మల్లికార్జున ఖర్గే వ్యాఖ్య



**న్యూఢిల్లీ :** లోక్‌సభ ఎన్నికల్లో మంగళవారం దేశ ప్రజలు ఇచ్చిన తీర్పు ప్రధానమంత్రి నరేంద్రమోదీకి వ్యతిరేకంగా వచ్చిన ఎన్నికల ఫలితమనీ, ఈ ప్రజాతీర్పు బిజెపికి రాజకీయ, నైతి ఓటమి అనీ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. ఎన్నికల ఫలితాల ధోరణులన్నీ ఒక కొలిక్కి వచ్చిన తర్వాత న్యూఢిల్లీలోని ఎఐసిసి పప్రధాన కార్యాలయంలో జరిగిన పత్రికాగోష్టిలో ఆయనతోపాటు కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియాగాంధీ, ఎన్నికల ప్రచార సారథి రాముల్‌గాంధీ కూడా పాల్గొన్నారు. మల్లికార్జున ఖర్గే పత్రికాగోష్టిలో మాట్లాడుతూ, 18 వ లోక్‌సభ ఎన్నికల ఫలితాలు దేశ ప్రజల విజయమనీ, దేశ ప్రజాస్వామ్య విజయమని ప్రశంసించారు. బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఎ కూటమికి 290కి పైగా స్థానాలు లభించగా 'ఇండియా' కూటమి 232 కు పైగా స్థానాలలో ఆధిక్యంలో ఉంది. ''ఇది ప్రజలు ఇచ్చిన తీర్పు, ప్రజలు, ప్రజాస్వామ్యం సాధించిన విజయ. ఈ ఎన్నికల యుద్ధం దేశ ప్రజలకు, మోదీకి మధ్య యుద్ధమనిమే చెబుతూ వచ్చాం, ప్రజలు ఇచ్చిన తీర్పును ఎంతో వినయవిధేయతలతో మేం సమ్మతిస్తాం'' అని మల్లికార్జున ఖర్గే అన్నారు. ఏ ఒక్క రాజకీయ పార్టీకీ దేశ ప్రజలు పూర్తి మెజారిటీ ఇవ్వలేదనీ, ప్రత్యేకించి ''ఒకే వ్యక్తి, ఒకే ముఖం'' అనే ప్రాతిపదికపై ప్రజలలోకి వెళ్ళిన బిజెపికి ప్రజలు పూర్తి మెజారిటీని కట్టబెట్టలేదని అన్నారు. ''ఇదే బిజెపికి ఈ ఎన్నికల్లో రాజకీయ, నైతిక పరాజయం'' అని మల్లికార్జున ఖర్గే వివరించారు. అంతేకాకుండా ప్రభుత్వ యంత్రాంగం కూడా 'ఇండియా' కూటమి పార్టీలకు అడుగడుగునా ఆటంకాలు సృష్టించిందని ఖర్గే తరువాయి 8లో

## మెక్సికో అధ్యక్షురాలికి ప్రపంచనేతల అభినందనలు



**మెక్సికోసిటీ :** మెక్సికో దేశ తొలి మహిళా అధ్యక్షురాలుగా ఎన్నికల్లో విజయం సాధించి చరిత్ర సృష్టించిన అధికార వామపక్ష కూటమి అభ్యర్థి క్లాడియా షియిన్ బాయుమ్ (61)కు ప్రపంచ దేశాల నుండి అభినందనలు వెల్లువెత్తుతుండగా మరోవైపు మెక్సికో ప్రతిపక్షం మాత్రం ఆమె ఘన విజయాన్ని సవాలు చేసింది. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, క్యూబా దేశాక్షుడు మిగ్వేల్ దయాజ్ కేనల్ సహా పలు లాటిన్ అమెరికా దేశాల నాయకులు అభినందనలు తెలియజేశారు. పెరూ దేశ ప్రభుత్వం కకూడా క్లాడియా ఘనవిజయం సాధించిన తొలి మహిళగా రికార్డుల్లోకి చేరినందుకు అభినందనలు తెలియజేసింది. పెరూ–మెక్సికో దేశాలమధ్య రాబోయే కాలంలో మరిన్ని సహాయ సహకారాలు అభివృద్ధి చెందాలని ప్రభుత్వం ఆ సందేశంలో ఆకాంక్షించింది. క్యూబా అధ్యక్షుడు డయాజ్ కేనల్ తన సందేశంలో రెండు దేశాల మధ్య సోదరభావం, సంఘీభావం వెల్లివిరియయాలని ఆకాంక్షించారు. రెండు దేశాలమధ్య చారిత్రక అనుబంధం ఉందని ఆయన గుర్తుచేశారు. అక్టోబరు 1వ తేదీన ఆమె దేశాధ్యక్షురాలుగా పదవీ బాధ్యతలు తీసుకుంటారు. ఇప్పటివరకూ 10 లాటిన్ అమెరికా దేశాల్లో మహిళలే దేశానికి నాయకత్వ సారథ్యం వహిస్తుండగా ఇప్పుడు మెక్సికో దేశం తాజాగా 11వ దేశంగా ఆ జాబితాలో చేరింది.

## కీలక కేసులో ఇమ్రాన్‌ఖాన్‌కు విముక్తి




**ఇస్లామాబాద్ :** అధికార రహస్యాలను బహిర్గతం చేశారన్న ఆరోపణలపై కీలకమైన కేసు ఎదుర్కొంటున్న పాకిస్థాన్ మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్ ఖాన్, ఆయన సహచరుడు, మాజీ విదేశాంగమంత్రి మహమూద్ ఖురేషీలకు ఉపశమనం లభించింది. ఈ కేసు నుండి ఇస్లామాబాద్ హైకోర్టు వారిద్దరికీ విముక్తి కలిగించింది. గడచిన జనవరిలో కిందికోర్టు ఈ కేసులో వారిద్దరికీ పదేళ్ళు వంతున జైలు శిక్ష విధించింది. ఇప్పుడు హైకోర్టు వారికి ఈ శిక్ష నుండి విముక్తి కలిగించడానకి స్పష్టమైన కారణం తెలియదు. అవిధంగా గడచిన ఏప్రిల్ నెలలో కూడా ఇమ్రాన్‌ఖాన్, ఆయన భార్యకు అవినీతి కేసులో విదించిన 14 సంవత్సరాల జైలు శిక్షను కూడా పాకిస్థాన్ అప్పీల్స్ కోర్టు రద్దు చేసింది. ఐతే తోషాఖానా కేసుతోసహా ఇమ్రాన్‌ఖాన్‌పై దాదాపు 200 కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల్లో ఆయన నిందితుడుగా ఉన్నారు. ఈ కేసు నుండి విముక్తి చెందినప్పటికీ కూడా ఆయన జైలులో కొనసాగవలసిందే. గత ఏడాది ఆగస్టు నుండీ ఇమ్రాన్‌ఖాన్ జైలులోనే మగ్గుతున్నారు. 2022 ఏప్రిల్ నెలలో ఫిరాయింపులు ప్రోత్సహించి, పార్లమెంటులో అవిశ్వాస తీర్మానం ద్వారా ఇమ్రాన్‌ఖాన్ ప్రభుత్వాన్ని కూల్చివేశారు. తర్వాత సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడింది. ఈ లోపు ఇమ్రాన్‌ఖాన్ రాజకీయ మనుగడకోసం భీకరపోరాటం చేశారు. ఆయనపై అనేక కేసులు నమోదు కావడంతో జైలుపాలయ్యారు. ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో కూడా పోటీ చేసేందుకు ఆయన పార్టీకి ప్రత్యక్ష అర్హత లభించలేదు. ఆయన పార్టీ గుర్తును కూడా రద్దు చేశారు. దాంతో ఇమ్రాన్‌ఖాన్ అనుచరులు ఇండిపెండెంట్లుగా ఎన్నికల్లో పోటీ చేసి తమ సత్తా చాటుకున్నారు. ఒక బలమైన శక్తిగా అసెంబ్లీలో నిలబడ్డారు.

# కిమ్ 'చెత్త' ప్లాన్ : కొరియా సరిహద్దుల్లో ఉద్రిక్తత








**సియోల్ :** 'చెత్త, బురద నింపిన బెలూన్లు' ఉత్తర కొరియా నుంచి వందల సంఖ్యలో వాయుమార్గంలో ప్రవాహంలా వస్తూ ఉండటంతో దక్షిణ కొరియా తీవ్ర ఆగ్రహంతో ఉంది. ఉత్తర కొరియా ప్రతినిత్యం ఏదోఒక అలజడి సృష్టిస్తోందని, తమదేశాన్ని అశాంతికి గురిచేస్తోందనీ దక్షిణకొరియా ఆగ్రహించింది. 2018లో ఉత్తరకొరియాతో సంధిమార్గంలో జరిగిన శాంతి ఒప్పందాన్ని తక్షణం రద్దు చేస్తున్నట్లు దక్షిణ కొరియా మంగళవారం అధికారికంగా ప్రకటించింది. ఈ నిర్ణయంపై దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యెవోల్ సంతకం చేశారు. దీంతో ఉత్తర కొరియాతో ఉన్న సరిహద్దుల్లో దక్షిణ కొరియా తిరిగి తక్షణం సైనిక కార్యకలాపాలను పునరుద్ధరించింది. ఇప్పటికి నాలుగు రోజులుగా ఉత్తర కొరియా తమదేశంలోకి చెత్త చెదారం నింపిన బెలూన్లను గగనమార్గంలో పంపిస్తూ రెచ్చగొట్టే చర్యలకు పాల్పడుతోందని దక్షిణ కొరియా మండిపడింది. అదేవిధంగా సరిహద్దుల్లో ఉత్తరకొరియా దిశగా లౌడ్ స్పీకర్లు పెట్టి తీవ్రమైన దుష్ప్రచారచర్యలకు ఉత్తర కొరియా పాల్పడుతూ పొరుగు దేశాన్ని తీవ్ర అశాంతికి గురిచేస్తోందని విమర్శించింది. సరిహద్దుల్లో శాంతిని కాపాడేందుకు రెచ్చగొట్టే చర్యలు లేకుండా సరిహద్దులను కాపాడుకునేందుకు ఆరేళ్ళక్రితం దక్షిణ కొరియా నేషనల్ సెక్యూరిటీ ఏజన్సీ ఈ శాంతి ఒప్పందం చేసుకుంది. దీనిని తక్షణం రద్దు చేస్తున్నట్లు దక్షిణ కొరియా ప్రకటించింది. ఐతే విచిత్రం ఏమిటంటే తాము కూడా ఈ శాంతి ఒప్పందాన్ని గౌరవించడంలేదని ఉత్తర కొరియా అధినేత కిమ్ ప్రకటించారు. తమదేశంలోకి ప్రచార కరపత్రాలు పంపిస్తూ దక్షిణ కొరియా రెచ్చగొట్టే చర్యలకు పాల్పడిందనీ, ఇందుకు ప్రతీకారంగానే తాము చెత్త, చెదారం కలగలిపి బెనూన్లలో నింపి దక్షిణ కొరియాకు గగనమార్గంలో కానుకగా పంపించామని కిమ్ చెప్పారు. ఈ విధంగా సుమారు 1,000 బెనూన్లను తాము పంపించామనీ, ఇక ఈ ప్రతీకార చర్యను ఆపేస్తున్నామనీ కిమ్ ప్రకటించారు.

ప్రపంచం

## అమెరికా కాంగ్రెస్‌లో నేతన్యాహూ ప్రసంగం లేదు



**టెల్ అవీవ్ :** అమెరికా కాంగ్రెస్‌ను ఉద్దేశించి ఇజ్రాయిల్ ప్రధామంత్రి బెంజిమన్ నేతన్యాహూ ఈనెల 13వ తేదీన ప్రసంగిస్తారని చేసిన ప్రకటనను ఇజ్రాయిల్ ప్రభుత్వం మంగళవారంనాడు ఖండించింది. అలాంటిదేమీ లేదని స్పష్టం చేసింది. నేతన్యాహూ యూదులసెలవుదినం నాడు అమెరికా కాంగ్రెస్ సంయుక్త సభను ఉద్దేశించి ప్రసంగిస్తారని అమెరికా ప్రభుత్వం ప్రకటించడంతో సర్వత్రా నిరసనలు వ్యక్తమయ్యాయి. ఇది అమెరికా ద్వంద్వవైఖరికి తార్కాణమన్న విమర్శలు వచ్చాయి. ఐతే ఇజ్రాయిల్ ప్రభుత్వం ఈ వార్తను ఖండించింది. జో బైడెన్ ప్రతిపాదించిన మూడు దశల శాంతి సూత్రాన్ని అంగీకరించాలని అన్ని వైపులనుండీ ఇజ్రాయిల్‌పై ఒత్తిడి పెరుగుతున్న తరుణంలో ఈ ప్రకటన రెండు విధాలుగా ఆలోచనలు రేకెత్తించింది. శాంతి ప్రతిపాదన అంగీకరిస్తున్నట్లు నేతన్యాహూ ఆ సమావేశంలో ప్రకటిస్తారన్న భావన ఒకటికాగా, ఇజ్రాయిల్‌ను పెంచి పోషిస్తున్న అమెరికాయే ఈ నాటకం ఆడుతున్నదని ఈ ప్రసంగంతో తేటతెల్లం అవుతున్నదనీ, ఒకవైపు ఇజ్రాయిల్‌కు ఆయుధాలు ఇస్తూ, మరోవైపు ఇజ్రాయిల్ దాడిని సమర్థిస్తూ, గాజాకు సహాయం వెళ్ళకుండా అమెరికా అడ్డుకుంటున్నదన్న విమర్శలూ వచ్చాయి. ఈ విమర్శల నుండి తప్పించుకోవడంకోసమే నేతన్యాహూ ఈ ప్రసంగం చేయడానికి వాషింగ్టన్ వెళ్ళలేదన్న సమాచారమూ చక్కెర్లు కొడుతున్నది. కాగా బైడెన్ మరోవైపు ఖతార్ ఎమిరేట్స్‌కు ఒక కీలకమైన విజ్ఞప్తి చేశారు. హమాస్ ఎలాగైనా తమ శాంతి ఒప్పందానికి తలొగ్గేలా ఒప్పించాలని, అందుకు సర్వశక్తులూ ఉపయోగించాలని ఖతార్ ఎమిరేట్స్‌ను ఆయన కోరారు.

**ఆరు వారాలు ఆగుతారా?...** ఐతే బందీలను విడుదల చేయడం కోసం తాము ఆరువారాలు యుద్ధ విరమణకు అంగీకరిస్తామని నేతన్యాహూ చెప్పినట్లు వార్తలు వచ్చాయి. బైడెన్ ప్రతిపాదనలను ఆయన పూర్తిగా తిరస్కరించకపోయినా, ఆ ప్రతిపాదనల్లో సంపూర్ణత్వం లేదని విమర్శించారు. ఆరువారాలైతే ఆగుతామని, హమాస్‌ను అంతం చేయడం, బందీలను విడిపించుకోవడం, తిరిగి హమాస్ వల్ల ఎలాంటి ప్రమాదం రాకుండా ఆ ఉగ్రవాద సంస్థను అడ్డుకోవడమే తమ అంతిమ లక్ష్యమని నేతన్యాహూ చెప్పారు. ఇదిలా ఉండగా, మరో నలుగురు బందీల మృతదేహాలు తమకు లభ్యమైనట్లు ఇజ్రాయిల్ సైన్యం మంగళవారంనాడు ప్రకటించింది. మరోవైపు సెంట్రల్ గాజాలోని బురెయిడ్ శరణార్థ శిబిరంపై గగనతలదాడుల్లో మంగళవారం నలుగురు పాలస్తీనియన్లు మరణించారు.

అంతరిక్ష పరిశోధనల్లో మరో చరిత్ర

## విలువైన చంద్రుడి రాళ్ళతో తిరిగి వస్తున్న చైనా నౌక



**బీజింగ్ :** తన విశిష్ట పరిశోధనలతో అంతరిక్షాన్ని జల్లెడపడుతున్న మానవాళి చరిత్రలో మరో మైలురాయి ఘట్టం నమోదైంది. చంద్రుడికి ఆవలివైపున విజయవంతంగా కాలుమోపి, చంద్రగ్రహంపై ఉన్న విలువైన రాళ్ళు, మట్టిని సేకరించిన చైనా నౌక భూగ్రహానికి తిరుగు ప్రయాణం ప్రారంభించింది. చైనా ప్రయోగించిన 'ఛేంజ్ ఇ–6' అంతరిక్ష నౌక మంగళవారం ఉదయం ఎంతో విజయవంతంగా చంద్రగ్రహం నుండి పైకిలేచి తిరుగు ప్రయాణం చేయడంలో భాగంగా విజయవంతంగా తిరిగి చంద్రుడి కక్ష్యలోకి ప్రవేశించింది. మే 3వ తేదీన 'ఛేంజ్ ఇ–6' అంతరిక్ష నౌక చైనా నుండి బయలుదేరి మనకు కనిపించే చంద్రుడువైపు కాకుండా ఆవలివైపున ఉన్న ప్రాంతంలో జూన్ 2వ దీన కాలు మోపింది. రెండు రోజులపాటు చంద్రుడి ఉపరితంపై పరిశోధనలు చేసి భూమికి తీసుకువచ్చేవిధంగా తనకు కావాల్సిన మట్టిని, రాళ్ళను, ధూళిని సేకరించి తిరిగి భూమివైపు బయలుదేరడం ఒక చరిత్రాత్మక ఘట్టం అని చైనా జాతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ (సిఎన్ఎస్ఎ) ఒక ప్రకటనలో తెలియజేసింది. 3000 కిలోవాట్ల సామర్థ్యంగల న్యూటన్ ఇంజన్‌గల ఛేంజ్ ఇ–6 నౌక ఆరునిమిషాలపాటు ఇంజన్‌ను సిద్ధం చేసుకుని మంగళవారం ఉదయం 7.38 గంటలకు తిరిగి చంద్రుడికక్ష్యలోకి దూసుకువెళ్ళిందని సిఎస్ఎన్ఎ తెలియజేసింది. చైనా పురాణ కథల్లో చంద్రుణ్ణి 'చంద్రదేవత' గా కొలుస్తారు. చంద్రదేవతపై చైనా పురుణాల్లో ఎన్నో కథలు ఉన్నాయి. చంద్రుడిమీదకు చైనా చేసిన ఇది ఆరో ప్రయోగం. దక్షిణ ధృవంవైపు దిగిన నౌక ఎంతో సూక్ష్మ బుద్ధితో పనిచేసిన ఎ ఐ ఇంజన్లు తనకు కావాల్సిన పరిమాణంలో మట్టిని రాళ్ళను సేకరించాయి. డ్రిల్లింగ్ ద్వారా లోతుల్లో ఉన్న మట్టిని ఎ ఐ యంత్రం సేకరించగా, రోబోటిక్ చేతుల ద్వారా ఉపరితలంపై ఉన్న రాళ్ళను ఎ ఐ యంత్రం సేకరించింది. అదేవిధంగా చైనా ఛేంజ్ ఇ –6 నౌక ల్యాండర్ తీసుకువెళ్ళిన చైనా జాతీయ పతాకాన్ని కూడా విజయవంతంగా దక్షిణ ధృవంపై ఎగురవేసింది.

## దిగొచ్చిన నైజీరియా ప్రభుత్వం : కార్మికుల సమ్మె విరమణ




**అబ్యూజా :** కనీస వేతనాలు పెంచాలని కోరుతూ నైజీరియాలో దేశవ్యాప్తంగా కార్మికులు రెండు రోజులుగా చేసిన సార్వత్రిక సమ్మె మంగళవారం సాయంత్రం ముగిసింది. తొలుత చర్చలు విఫలమైనప్పటికీ తర్వాత ప్రభుత్వం దిగివచ్చి కార్మిక సంఘాల డిమాండ్లు అగీకరించింది. వారికి నెలకు 40 డాలర్లు మేరకు వేతనం చెల్లించేందుకు ప్రభుత్వం అంగీకరించడంతో కార్మికులు సమ్మె విరమించారు. పశ్చిమ ఆఫ్రికాదేశం నైజీరియాలో రోజు రోజుకూ జీవన వ్యయాలు విపరీతంగా పెరిగిపోతూ వేతనాలు తగ్గిపోతూ ఉండటంతో ప్రజల కష్టాలు పరాకాష్టకు చేరాయి. దేశంలో ద్రవ్యోల్బణం రికార్డుస్థాయిలో పెరిగింది. దీంతో కార్మిక సంఘాలు సార్వత్రిక సమ్మెకు దిగాయి.నైజీరియన్ నేషనల్ కాంగ్రెస్, ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్‌లు ఈ సమ్మెకు పిలుపు ఇచ్చాయి. ప్రస్తుతం కార్మికులకు నెలకు 37 పౌండ్లు వేతనం చెల్లిస్తున్నారు. కార్మిక సంఘాలు సమ్మె ప్రారంభించడంతో దేశవ్యాప్తంగా రవాణా, స్కూళ్ళు, బ్యాంకులు, ఆసుపత్రులు, ఇతర కార్యాలయాలు కూడా మూతపడ్డాయి. విమాన రాకపోకలు కూడా నిలిచిపోయాయి. విద్యుత్ కోతలు ఏర్పడటంతో ప్రజలు అంథకారంలో మగ్గుతున్నారు. ప్రభుత్వానికి, కార్మిక సంఘాల నాయకులకు మధ్య మే 31వ తేదీన జరిగిన చర్చలు విఫలం కావడంతో కార్మిక సంఘాలు సార్వత్రిక సమ్మె ప్రారంభించాయి. గత ఏడాది మే నెలలో దేశాధ్యక్షుడుగా బోలా తినుబు బాధ్యతలు చేపట్టినప్పటినుండీ ఆర్థిక సంస్కరణలు ప్రారంభించారు. అప్పటి నుండి దేశంలో ధరలు తారాస్థాయికి పెరిగాయి.

## బిజెపికి దిమ్మతిరిగే తీర్పు

(మొదటి పేజీ తరువాయి)

గెలిచారు. ఇక, ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ నుంచి బరిలోకి దిగిన కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ 1,52,513 ఓట్ల తేడాతో ఘన విజయం సాధించారు. ఆయనకు 6,87,549 ఓట్లు వచ్చాయి. బిజెపి అభ్యర్థి దినేష్ ప్రతాప్ సింగ్ 2.97,619 ఓట్లకు పరిమితమయ్యారు. కాగా, కేరళలోని వాయనాడ్ నుంచి కూడా పోటీ చేసిన రాహుల్ అక్కడ మరోసారి విజయాన్ని నమోదు చేసుకున్నారు. 6,47,445 ఓట్లు సంపాదించిన ఆయన 3,64,422 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. ఆయన సమీప ప్రత్యర్థి, సిపిఐ అభ్యర్థి అన్నీ రాజా 2,83,023 ఓట్లు సంపాదించుకున్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఏకంగా 7.44,716 ఓట్ల తేడాతో, కాంగ్రెస్‌కు చెందిన తన సమీప ప్రత్యర్థి సొనాల్ రమాబాయ్ పటేల్‌పై రికార్డు విజయాన్ని నమోదు చేశారు. అమిత్ షాకు 10,10,972, రమాబాయ్‌కి 2,66,286 చొప్పున ఓట్లు లభించాయి.

## నైతిక విజయం

(మొదటి పేజీ తరువాయి)

మిగతా అన్ని రాజకీయ పార్టీలను కూడా కలుపుకుని తగిన వ్యూహరచనలతో ముందుకెళ్లి ఉంటే తమిళనాడు తరహాలోనే తెలంగాణలో కూడా విజయం సాధించేదన్నారు. కాంగ్రెస్ పార్టీ తమ సొంత నిర్ణయాల కంటే కూటమి పార్టీల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని వారిని కూడా కలుపుకుని ఎన్నికలకు వెళ్లి ఉంటే మరిన్ని స్థానాల్లో విజయం సాధించి ఉండేదని అభిప్రాయపడ్డారు.

### జగన్ నియంతృత్వ పోకడ, అహంకారానికి నిదర్శనం పది సీట్లు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ ఎన్నికల ఫలితాలపై డాక్టర్ నారాయణ స్పందిస్తూ దేశంలో అత్యధికంగా సంక్షేమ పథకాలు తమ ప్రభుత్వమే అందిస్తున్నదని విర్రవీగిన వైసిపికి గతంలో టిడిపికి వచ్చిన 23 సీట్ల కన్నా తక్కువ సంఖ్యలో 10 సీట్లకే పరిమిత కావడం జగన్మోహన్‌రెడ్డి నియంతృత్వ పోకడ, అహంకార వైఖరికి నిదర్శనం అన్నారు. పెద్దమొత్తంలో 151 సీట్లు అందించిన రాష్ట్ర ప్రజల మేలు కంటే కక్ష సాధింపు రాజకీయాలపైనే దృష్టి సారించి రాజకీయ వ్యవస్థను అస్తవ్యస్తం చేసిన ఘనత ఒక్క జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఎన్నికల్లో గెలుపొందిన టిడిపికి, ఈ రాజకీయ వ్యవహారంలో కీలకపాత్ర వహించిన పవన్ కళ్యాణ్‌కు అభినందనలు తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటు చేశాక గతంలో చేసిన తప్పిదాలు చేయకుండా, జగన్మోహన్‌రెడ్డి మాదిరిగా వ్యవహరించకుండా ప్రజా సమస్యలపై, అమరావతి రాజధాని, పోలవరం సాధనలో ముఖ్యపాత్ర వహిస్తారని అశిస్తున్నట్లు తెలిపారు.

## ఢీ అంటే ఢీ అన్న బిజెపి

(మొదటి పేజీ తరువాయి)

కూడా గెలవకపోవడంతో గులాబి పార్టీ అడ్రస్ గల్లంతైంది. పర్యవసానంగా లోక్‌సభలో బిఆర్ఎస్ ప్రాతినిధ్యం కోల్పోయింది. ఇక హైదరాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో బిజెపి అభ్యర్థి మాధవీలత మొదటి ఐదు రౌండ్లలో ఆధిక్యత కనబరిచినప్పటికీ చివరకు యధావిధిగా ఎంఐఎం నేత అసదుద్దీన్ ఓవైసీ ఘన విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో కమ్యూనిస్టుల ప్రభావం ఉన్న లోక్‌సభ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు భారీ మెజారిటీతో విజయం సాధించారు. గత ఎన్నికల్లో 40 శాతానికి పైగా ఉన్న బిఆర్ఎస్ ఓటు బ్యాంకు బిజెపికి టర్న్ అయినట్లు కనబడుతున్నది. ఫలితంగానే బిజెపి సిట్టింగ్ ఎంపిలతో పాటు మరో నలుగురి గెలుపునకు కారణమైంది. ఇదిలా ఉండగా సికింద్రాబాద్ కంటోన్‌మెంట్ అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి శ్రీగణేశ్ విజయం సాధించడంతో బిఆర్ఎస్ సిట్టింగ్ స్థానాన్ని కాంగ్రెస్ కైవసం చేసుకుంది.

# అదంతా సానుభూతే

### రాష్ట్రంలో బిజెపికి 8 సీట్లు రావడం ఆ పార్టీకి వచ్చిన ఆదరణ, బలం కారణం కాదు

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో రాష్ట్రంలో బిజెపికి 8 సీట్లు రావడం ఆ పార్టీకి వచ్చిన ఆదరణ, బలం కారణం కాదని, ఆ నియోజకవర్గాల్లో స్థానిక పరిస్థితులు, అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన అభ్యర్థులు సానుభూతితో ఇప్పుడు గెలిచారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు చెప్పారు. తనకు తాను దైవాంశ సంభూతుడుగా ప్రకటించుకున్న ప్రధాని మోదీకి లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలిచ్చిన తీర్పుతో చావు తప్పి కన్ను లొట్టపోయినట్లుగా ఉందన్నారు. ఈ ఎన్నికల్లో ఇండియా కూటమికి ఇంకా కొద్దిగా సానుకూల పరిస్థితి వచ్చి ఉంటే మోదీ దుష్టపాలన నుంచి భారతదేశానికి విముక్తి లభించి ఉండేదన్నారు. ఈ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గతం కంటే మెరుగైన ఫలితాలు సాధించిందని, అయితే కాంగ్రెస్ పార్టీ నేతలు హామీ ఇచ్చినట్లు అన్ని పార్టీలను కలుపుకుని ముందుకు వెళితే మరింత మెరుగైన ఫలితాలు ఉండేవని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌ను తగ్గించేందుకు బిఆర్ఎస్ పరోక్షంగా బిజెపికి సహకరించిందని, ఫలితంగా గతంలో బిఆర్ఎస్‌కు వచ్చిన ఓట్లు ఈ ఎన్నికల్లో చాలా మేరకు బిజెపికి బదిలీ అయ్యాయన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్దుంభవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పశ్య పద్మ, ఎన్.బాలమల్లేష్‌లతో కలిసి కూనంనేని మీడియా సమావేశం నిర్వహించారు. కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ప్రధాని మోదీ తన స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం దేవుడి మొదలు అన్ని వ్యవస్థలను ఉపయోగించుకున్నప్పటికీ ఆయన పాచిక మాత్రం పారలేదని, ఇప్పటికైనా మోదీ దుష్టపాలన నుంచి దేశానికి విముక్తి లభించాలని ఆకాంక్షించారు. ఇందుకు ఎన్‌డిఎ కూటమిలో రెండవ అతిపెద్ద పార్టీ అయిన టిడిపి అధినేత చంద్రబాబునాయుడు కీలక నిర్ణయం తీసుకుని ఇండియా కూటమికి మద్దతు ఇవ్వాలని కోరారు. గతంలో తెలుగు ప్రజలను ప్రధాని మోదీ అవమాన పర్చిన అంశాలతో పాటు వివిధ ప్రతిపక్ష పార్టీల నాయకులను కక్షపూరితంగా తొక్కివేసిన విధానాలను గుర్తు చేసుకోవాలని చంద్రబాబును కూనంనేని సాంబశివరావు కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు కూటమి విజయం సాధించడంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కీలకపాత్ర పోషించారన్నారు. ఎపిలో గత ఎన్నికల్లో 52శాతం ఓట్లతో అధికారం చేపట్టిన వైఎస్ జగన్ అహంభావం, అవినీతి ప్రజావ్యతిరేక విధానాలతోనే రాజకీయంగా పతనమయ్యారని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో అహంభావంతో కూడిన నిరంకుశ పాలనకు చోటులేదని, ప్రధాని మోదీ, తెలంగాణలో కెసిఆర్, ఎపిలో జగన్ ఒకే స్వభావం కలిగిన ఈ ముగ్గురు ఓటమి పాలయ్యారని తెలిపారు.

### కమ్యూనిస్టులకు బలం ఉన్న ప్రతి చోటా కాంగ్రెస్‌కు భారీ మెజారిటీ

తెలంగాణలో తమ మిత్రపక్షమైన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు పట్ల కూనంనేని సాంబశివరావు హర్షం వ్యక్తం చేశారు. కమ్యూనిస్టులకు బలం ఉన్న ప్రతి చోటా కాంగ్రెస్ అభ్యర్థులు భారీ మెజారిటీ విజయం సాధించారని తెలిపారు. జహీరాబాద్ మినహా ఖమ్మం, మహబూబ్‌బాద్, నల్లగొండ, భువనగిరి, నాగర్‌కర్నూల్, వరంగల్, పెద్దపల్లి నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ఘన విజయం సాధించారన్నారు. కాంగ్రెస్ పార్టీ నేతలు హామీ ఇచ్చినట్లు అందరిని కలుపుకునిపోయి ప్రజారంజక పాలనను అందించాలని సూచించారు.

**మోదీ జిమ్మికులు పనిచేయలేదు : చాడ వెంకట్‌రెడ్డి** పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజల ముందు మోదీ జిమ్మికులు పనిచేయలేదని చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. 400 సీట్లకు పైగా గెలువబోతున్నామని డాంభికాలు పలికిన మోదీ కూటమికి కేవలం 290 పైచిలుకు స్థానాలే దక్కడం అందుకు నిదర్శనమన్నారు. ఎగ్జిట్ పోల్స్‌కు పూర్తి భిన్నంగా ప్రజాతీర్పు ఉందని, దేశవ్యాప్తంగా ఇండియా కూటమి మరింత సమన్వయంతో పనిచేసి ఉంటే మరింత మెరుగైన ఫలితాలు వచ్చి ఉండేవని ఆయన వెల్లడించారు. కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తూ, ప్రతిపక్ష నాయకుల గొంతు నొక్కడం ద్వారా దేశంలో గుత్తాధిపత్యం చెలాయించాలనుకున్న మోదీకి ప్రజలు తమ తీర్పు ద్వారా గుణపాఠం చెప్పారన్నారు. ఎపిలో జగన్ ఓటమికి ఆయన స్వయంకృతాపరాధమే కారణమన్నారు. అక్కడ ఉద్యోగులను తీవ్రంగా అణిచివేయడమే కాకుండా ప్రజా వ్యతిరేకంగా నిరంకుశ పాలన సాగించడంతోనే జగన్ పరాజయం పాలయ్యారన్నారు. ఎపిలో గెలుపొంది అధికారం చేపట్టబోతున్న చంద్రబాబుతో పాటు పవన్ కళ్యాణ్‌కు చాడ వెంకట్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

## అదిరిందయ్యా చంద్రం!

(మొదటి పేజీ తరువాయి)

బీజేపీ కూటమి 110సీట్లలో విజయం సాధించింది. ఉమ్మడి విశా ఖ, ప్రకాశం, కడప, కర్నూలు, చిత్తూరు జిల్లాల్లో 10 స్థానాల్లో మా త్రమే వైసీపీ అభ్యర్థులు విజయం సాధించారు. ఉమ్మడి విశాఖలో 2, ఉమ్మడి ప్రకాశంలో ఒకటి, ఉమ్మడి కడప జిల్లాలో మూడు, కర్నూలు జిల్లాలో 2, చిత్తూరు జిల్లాలో 2 నియోజకవర్గాలను వైసీపీ దక్కించుకుంది. ఐదు జిల్లాల పరిధిలోని 65 నియోజకవర్గాలకు కేవలం 11 చోట్ల మాత్రమే వైసీపీ విజయం సాధించింది. మిగతా 55 నియోజకవర్గాల్లో టీడీపీ కూటమి గెలుపొందింది. టీడీపీ కూటమిలో భాగస్వామ్యపక్షంగా ఉన్న జనసేన పార్టీ 21 స్థానాల్లో పోటీ చేసి మొత్తం సీట్లు గెల్చి... వందశాతం విజయం నమోదు చేసి రికార్డు సృష్టించింది. ప్రతిపక్ష హోదాకు కనీసం 18 సీట్లు కావాల్సి ఉండగా... వైసీపీ మూడో స్థానానికి పరిమితమైంది. పొత్తులో భాగంగా 144 శాసనసభ స్థానాల్లో పోటీచేసిన టీడీపీ 135 స్థానాల్లో విజయం సాధించగా, బీజేపీ పోటీచేసిన 10 నియోజకవర్గాలకుగాను 8 స్థానాల్లో గెలిచింది. కూటమి 175 స్థానాలకుగాను 165 స్థానాల్లో విజయం సాధించి రికార్డు సృష్టించింది. కూటమి సృష్టించిన సునామీకి మంత్రుల్లో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మినహా మిగిలినవారంతా ఘోరపరాజయం పొందారు. చివరకు వైసీపీ అధినేత, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నియోజకవర్గమైన పులివెందులలోనూ ఈసారి మెజార్టీ తగ్గడం గమనార్హం. సమీప టీడీపీ అభ్యర్థి బీటెక్ రవిపై జగన్ 61,176 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించిప్పటికీ... గత ఎన్నికలతో పోలిస్తే ఆయన ఆధిక్యం ఈసారి 28 వేల మేరకు తగ్గింది. సీఎం జగన్ సొంత జిల్లా అయిన కడప జిల్లాలో గతంలో అన్ని స్థానాలను వైసీపీ గెల్చుకోగా, ఈసారి సగానికే పరిమితమైంది. కడప అసెంబ్లీ నియోజకవర్గంలోనూ వైసీపీ ఓటమి చవిచూసింది. హోరాహోరీ పోరు నెలకొన్న కుప్పంలో చంద్రబాబు, పిఠాపురం నియోజకవర్గంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్, మంగళగిరిలో టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేశ్, హిందూపురంలో నందమూరి బాలకృష్ణ భారీ మెజార్టీతో విజయం సాధించారు. గుడివాడలో కొడాలి నాని, గన్నవరంలో వల్లభనేని వంశీ, నగరిలో ఆర్కే రోజా, చీపురుపల్లిలో బొత్స సత్యనారాయణ ఓటమి పాలయ్యారు.

**టీడీపీ కూటమికి 21 ఎంపీ సీట్లు...**పార్లమెంటు నియోజకవర్గాల ఫలితాల్లోనూ టీడీపీ కూటమి హవా కొనసాగించింది. రాష్ట్రంలో 25పార్లమెంటు స్థానాలకుగాను 21స్థానాలను కూట మి కైవసం చేసుకోగా...2019 ఎన్నికల్లో 22ఎంపీలు గెల్చుకున్న వైసీపీ ఈ సారి కేవలం 4 సీట్లకే పరిమితమైంది. మచిలీపట్నం, కాకినాడ ఎంపీ స్థానాలను జనసేన కైవసం చేసుకుంది. కడపలో ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్‌షర్మిల గట్టిపోటీ ఇచ్చినట్లు ప్రచారం జరిగినప్పటికీ ఆమె మూడవస్థానానికి పరిమితమయ్యారు. వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితుడిగా ఉన్న అవినాశ్‌రెడ్డిని ఓడించాలని షర్మిల, సునీత ప్రచారం చేసినప్పటికీ విజయం అవినాశ్‌రెడ్డినే వరించింది. టీడీపీ మొత్తం 16 ఎంపీ స్థానాలు గెల్చుకోగా, బీజేపీ ఆరు పార్లమెంటు నియోజకవర్గాలలో పోటీచేసి మూడుస్థానాల్లో విజయం సాధించింది. బీజేపీ రాష్ట్రఅధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి రాజమండ్రి నుంచి విజయంసాధించారు.

**వైఎస్ జగన్ రాజీనామా...**ఎన్నికల్లో ఘోరపరాజయం చవిచూసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. తన రాజీనామా లేఖను గవర్నరు అబ్దుల్ నజీర్‌కు అందజేశారు. కాగా, జగన్ రాజీనామాను గవర్నరు ఆమోదించా రు. తదుపరి ప్రభుత్వం ఏర్పడేంతవరకూ ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా కొనసాగాలని గవర్నరు కోరారు.

## వామపక్ష గొంతుక

(మొదటి పేజీ తరువాయి)


అమ్రారామ్(సిపిఎం)


సచ్చితానందన్(సిపిఎం)


రాధాకృష్ణన్(సిపిఎం)


వెంకటేశన్(సిపిఎం)


రాజారామ్‌సింగ్ (సిపిఐ(ఎంఎల్)లిబరేషన్)


సుధామాప్రసాద్ (సిపిఐ(ఎంఎల్)లిబరేషన్)

2,08,957 ఓట్ల తేడాతో ఘనవిజయం సాధించారు. ఆయన ఎఐఎడిఎంకె అభ్యర్థి సుర్సిత్ శంకర్‌పై గెలుపొందారు. తమిళనాడులో సిపిఐ(ఎం) కూడా గత ఎన్నికల్లో గెలిచిన రెండు స్థానాలను నిలబెట్టుకుంది. మధురై నుండి ఎస్.వెంకటేశన్ 2.09లక్షల మెజారిటీతో, దిండిగల్‌లో ఆర్.సచ్చిదానంతం 45వేల మెజారిటీతో విజయం సాధించారు. కేరళలోని అలత్తూర్ స్థానంలో హోరాహోరిగా జరిగిన పోటీలో సిపిఐ(ఎం) అభ్యర్థి కె.రాధాకృష్ణన్ తన సమీప ప్రత్యర్థి రమ్య హరిదాస్‌పై 20 వేల పైచిలుకు ఆధిక్యంతో గెలుపొందారు. కొత్తగా రాజస్థాన్‌లోని సికార్ లోక్‌సభ నియోజకవర్గాన్ని సిపిఐ (ఎం) అభ్యర్థి అమ్రారామ్ సుమారు 73 వేల ఓట్లతో గెలుపొందారు. ఇక్కడ ఆ పార్టీ కాంగ్రెస్‌తో పొత్తులో ఉంది. యుడిఎఫ్ కూటమిలో ఉన్న ఆర్ఎస్‌పి అభ్యర్థి ఎన్.కె.ప్రేమచంద్రన్ రెండవ సారి కొల్లాం నియోజకవర్గం నుండి లక్షన్నర మెజారిటీతో విజయం సాధించారు.

**బిహార్‌లో బోణీ కొట్టిన సిపిఐ(ఎంఎల్)(లిబరే-షన్) :** ఇండియా కూటమిలో భాగంగా బిహార్‌లో మహాఘట్‌బంధన్ నుండి పోటీ చేసిన సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ రెండు చోట్ల విజయం సాధించింది. అర్రాలో కేంద్ర మంత్రి ఆర్.కె.సింగ్‌పై సిపిఐ(ఎంఎల్) అభ్యర్థి సుదామా ప్రసాద్ 63వేల ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. కారాకాట్ నియోజకవర్గం నుండి ఆ పార్టీకే చెందిన రాజారామ్ సింగ్ లక్షకుపైగా ఓట్లతో ఇండిపెండెంట్‌పై విజయం సాధించారు.


ప్రేమచంద్రన్ (ఆర్ఎస్‌పి)

# రాష్ట్రంలో కాంగ్రెస్,బిజెపి పోటాపోటీ గెలుపు

## కంటోన్మెంట్ అసెంబ్లీ ఉపఎన్నికల్లో.. కాంగ్రెస్ అభ్యర్థి విజయం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజక వర్గానికి జరిగిన ఉ ప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శ్రీగణేశ్ విజయం సాధించారు. కంటోన్మెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ నుంచి శ్రీగణేశ్, బిజెపి నుంచి వంశతిలక్, బిఆర్ఎస్ నుంచి నివేదిత పోటీ చేశారు. సమీప బిఆర్ఎస్ అభ్యర్థి నివేదితపై శ్రీగణేశ్ 9,725 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. శ్రీగణేశ్ 2018, 2023లలో బిజెపి నుంచి పోటీ చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాం గ్రెస్ పార్టీలో చేరి టిక్కెట్ దక్కించుకున్నారు. మూడవ ప్రయత్నంలో ఆయన సఫలీకృలయ్యారు.

### ప్రజల మద్దతు కాంగ్రెస్‌కే : సిఎం

ప్రజల మద్దతు కాంగ్రెస్ పార్టీకే ఉన్నదనే వి షయం లోక్‌సభ ఎన్నికల ఫలితాలతో రుజువైందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రజల ఆశీర్వాదాలు మా ఆత్మస్థైర్యాన్ని పెంచాయి, మ రింత సమర్థవంతమైన పాలన అందివ్వడానికి ఉత్సాహాన్నిచ్చాయన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ 100 రోజుల పాలనను ఆశీర్వదిస్తూ... ఎనిమిది లోక్ సభ స్థానాలతో పాటు కంటోన్మెంట్ శాసన సభ ఉప ఎన్నికలో విజయం చేకూర్చిన రాష్ట్ర ప్రజలకు హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ విజయం కోసం పని చేసిన కార్యకర్తలు, నాయకులు, శ్రేయోభిలాషులందరికీ అభినందనలు తెలిపారు. ఇది కార్యకర్తల విజయం. వారి శ్రమ, కష్టం పార్టీ గుర్తిస్తుందన్నారు. బుధవారంతో ఎన్నికల కోడ్ ముగుస్తోంది. మళ్లీ ప్రజా ప్రభుత్వ పాలన మొదలవుతుందని. రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి సారిస్తామన్నారు.

### సిఎంను కలిసిన కాగ్రెస్ అభ్యర్థి శ్రీగణేష్..

ఎంఎల్ఎ పఎన్నికలో కంటోన్మెంట్ నుంచి గెలిచిన కాంగ్రెస్ అభ్యర్థి శ్రీగణేష్ మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా సిఎం ఆయన్ని అభినందించారు.

### చంద్రబాబుకు రేవంత్ రెడ్డి అభినందనలు..

ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో టిడిపి నేతృత్వంలోని ఎన్‌డిఎ కూటమి గెలుపొందడంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. ఈ ఎన్నికల్లో విజయం సాధించిన చంద్రబాబు, పవన్ కల్యాణ్‌కు అభినందనలు తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియా ప్లాట్ఫామ్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు సిఎం రేవంత్ రెడ్డి. ఇరు రాష్ట్రాల మధ్య సంబంధాలపైనా కీలక వ్యాఖ్యలు చేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య సత్సంబంధాలను కొనసాగిస్తూ.. సమస్యలను పరిష్కరించుకుంటూ అభివృద్ధి పథం వైపు సాగుదామని ఆకాంక్షించారు. ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో విజయం సాధించిన టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను అభినందనలు తెలిపారు.

### ఓటర్లకు ధన్యవాదాలు : భట్టి



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** ఈ దేశంలో స్వతంత్రాన్ని, రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటే కాంగ్రెస్ పార్టీకి, ఇండియా కూటమి అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని అఖిల భారత కాంగ్రెస్ కమిటి, రాష్ట్ర కాంగ్రెస్ కమిటి ఇచ్చిన పిలుపునకు స్పందించి దేశంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి, ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించి అద్భుతమైన విజయాన్ని అందించినందుకు దేశ, రాష్ట్ర ఓటర్లకు డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ, ఇండియా కూటమి అభ్యర్థులు రాష్ట్రంలో, దేశంలో రికార్డు స్థాయి మెజార్టీలు సాధించేందుకు కృషిచేసిన కాంగ్రెస్ నాయకులు, పార్టీ శ్రేణులకు ఆయన అభినందనలు తెలిపారు.

### చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌కు అభినందనలు తెలిపిన కెసిఆర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఏపి అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ఘన విజయం సాధించిన టిడిపి, జనసేన, బిజెపి కూటమికి బిఆర్ఎస్ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్‌రావు శుభాకాంక్షలు తెలిపారు.ప్రభుత్వంఏర్పాటు చేయబోతున్న టిడి పి అధ్యక్షుడు చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌ను అభినందించారు.

### ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు : జూపల్లి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** నాగర్‌కర్నూల్ లోక్‌సభ స్థానంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్లు రవి విజయమే లక్ష్యంగా పని చేసిన పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలకు ఎక్సైజ్. పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు దన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు చెప్పారు. నాగర్ కర్నూల్ ఎంపీగా విజయం సాధించిన మల్లు రవికి శుభాకాంక్షలు తెలియజేశారు. భవిష్యత్తులోనూ మరిన్ని విజయాలు సాధిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇదే స్ఫూర్తితో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా పార్టీ ఘనవిజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

### ఫలితాలు నిరాశపరిచాయి: కెటిఆర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** లోక్‌సభ ఎన్నికల ఫలితాలు తమను నిరాశపరిచాయని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు అన్నారు. మళ్లీ త్వరలోనే బిఆర్ఎస్ పుంజుకుంటుందని విశ్వాసాన్ని వ్యక్తం చే శారు. రానున్న రోజుల్లో మరింతగా కష్టపడి మళ్లీ ఉన్నత శిఖరాలకు చేరుకుంటామని, ఫి నిక్స్ పక్షిలాగా తిరిగి పుంజుకుంటామని చెప్పారు. పార్టీ స్థాపించిన 24 ఏళ్ల సుదీర్ఘమైన ప్రస్థానంలో ఎన్నో రకాల ఎత్తు పల్లాలను చూశామన్నారు.అద్భుతమైన విజయాలతో పాటు అనేక ఎదురుదెబ్బలు ఎదుర్కొన్న అనుభవం పార్టీకి ఉన్నదని ఆయన సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో నూ ఇలాంటి ఎదురుదెబ్బలు తిన్నప్పటికీ ప్రజాదరణతో బిఆర్ఎస్ పుంజుకున్న సందర్భాలెన్నో ఉన్నాయన్నారు. ప్రస్తుత శాసనసభలోనూ మూడో వంతు సీట్లతో ప్రధాన ప్రతిపక్షంగా కొనసాగుతున్నామన్నారు. రాజకీయాల్లో గెలుపు, ఓటములు సహజమేనని, గెలిచినప్పుడు పొంగిపోవద్దని, ఓడినప్పుడు కుంగిపోవద్దనే సిద్ధాంతాన్ని తాము పాటిస్తామన్నారు. ఫలితాలతో తాము ఎట్టిపరిస్థితుల్లో కుంగిపోయేది లేదని, ఎప్పటిలాగే ప్రజాసమస్యలపై పోరాడుతూనే ఉంటామని, ప్రధాన ప్రతిపక్షంగా ప్రభుత్వానికి వారి బాధ్యతను గుర్తు చేస్తూనే ఉంటామని చెప్పారు. ఫలితాలతో సంబంధం లేకుండా ప్రజాక్షేత్రంలో తెలంగాణ ప్రజల తరపున పోరాడుతూనే ఉంటామని, తెలంగాణ ప్రయోజనాల కోసం రాష్ట్రం అధికారంలో ఉన్న కాంగ్రెస్‌తో పాటు కేంద్రంతో కూడా పోరాటాన్ని కొనసాగిస్తూనే ఉంటామని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఫలితాలు నిరాశ కలిగించినప్పటికీ లోక్ సభ ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు ఎంతో శ్రమించారని, వారందరికీ పార్టీ తరపున కెటిఆర్ కృతజ్ఞతలు తెలిపారు.

### పెద్దపల్లిలో గడ్డం వంశీకృష్ణ(కాంగ్రెస్)



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి:** పెద్దపల్లి పార్లమెంట్ స్థానం హస్తగతం అయింది. కాంగ్రెస్ తరపున గడ్డం వెంకటస్వామి మనుమడు గడ్డం వంశీకృష్ణ ఒక లక్షా 31364ఓట్ల మెజార్టీతో తన సమీప ప్రత్యర్థి గోమాస శ్రీనివాస్‌పై విజయం సాధించారు. కాగా పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో మొత్తం 1592996మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 807015మంది మహిళా ఓటర్లు, 786390మంది పురుషులు ఉన్నారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో మొత్తం 10లక్షలకు పైగా ఓట్లు పోలయ్యాయి. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు 1933 56ఓట్లు, బీజేపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్‌కు 344223ఓట్లు రాగా కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణకు 475587ఓట్లు వచ్చాయి. దీంతో గడ్డం వంశీకృష్ణ సమీప ప్రత్యర్థి గోమాస శ్రీనివాస్‌పై 131364ఓట్ల మెజార్టీతో విజయం సాధించినట్లు ఎలక్షన్ అధికారులు ప్రకటించారు.

### జహీరాబాద్‌లో సురేష్ షెట్కర్ (కాంగ్రెస్)



**ప్రజాపక్షం/ సంగారెడ్డి ప్రతినిధి:** జహీరాబాద్ పార్లమెంటు నియోజకవరంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేష్ షెట్కర్ విజయం సాధించారు. సిట్టింగ్ ఎం పి అయిన బీబీ పాటిల్‌పై 49,947 వేల మేజార్టీతో విజయం సాధించారు. ఇక్కడ బీఆర్ఎస్ నుంచి గాలి అనిల్ కుమార్ పోటీలో ఉన్నారు. ఉ: 8 గంటలకు పోస్టల్ బ్యా లెట్ ఓట్ల లెక్కింపు తో ప్రారంభమైంది. పోస్టల్ బ్యాలెట్లలో కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కర్ కి మెజార్టీ వచ్చింది. అనంతరం ఈవీఎంల లెక్కింపు ప్రారంభమైంది. ఎంపీగా గెలుపొందిన సురేష్ షెట్కర్ ను మంత్రి దామోదర్ రాజనర్సింహా జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి సీనియర్ కాంగ్రెస్ నాయకులు అభినందించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు రేయింభవళ్లు శ్రామించిన పార్టీ శ్రేణులు అందరికి జహిరాబాద్ పార్లమెంటు ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు.

### ఖమ్మంలో రామసహాయం రఘురాంరెడ్డి(కాంగ్రెస్)



**లప్రజాపక్షం/ ఖమ్మం :** వామపక్షాల మద్దతుతో ఖమ్మంలో కాంగ్రెస్ పార్టీ రికార్డు విజయం సాధించింది. ఖమ్మం పార్లమెంటు చరిత్రలో కనీ వినీ ఎరుగని మెజార్టీని సాధించింది. 1952లో ఖమ్మం పార్లమెంటు ఏర్పడిన తర్వాత ఈ స్థాయి గెలుపును ఎవరు అందుకోలేదు. కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి ఆల్ టైం రికార్డు సృష్టించారు. ఆయన తన సమీప ప్రత్యర్థి, బిఆర్ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు పై 467847 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. మొత్తం పార్లమెంటు పరిధిలో 16,31,039 ఓట్లకు గాను 12,41,135 ఓట్లు పోలయ్యాయి. ఇందులో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి నామ నాగేశ్వరరావు 2,99,082 ఓట్లు సాధించగా, కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి 7,66,929 ఓట్లు సాధించారు. బిజెపి పక్షాన పోటీ చేసిన తాండ్ర వినోద్‌రావు 1,18,636 ఓట్లు సాధించారు.

### నాగర్‌కర్నూల్‌లో మల్లురవి (కాంగ్రెస్)



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి:** నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గంలో కాం గ్రెస్ అభ్యర్థి మల్లు రవి విజయం సాధించారు. నాగర్‌కర్నూల్ మార్కెట్‌యార్డులో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాల్లో వెలువడిన ఫలితాల్లో ఉదయంనుండి కాంగ్రెస్, బిజెపి, టిఆర్ఎస్ మధ్య తీవ్ర పోటి కనబడింది. మొదటిరౌండ్ నుండి చివరిరౌండ్‌వరకు మెజార్టీ ఓట్లు సాధిస్తూ 94,414వేల ఓట్లకుపైగా మెజారీతో మల్లురవి గెలుపొందారు. బిజెపి అభ్యర్థి పోతుగంటిభరత్ ప్రసాద్ రెండోస్థానంలో నిలిచి 3,70,658 ఓట్లు సాధించారు. టిఆర్ఎస్‌పార్టీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ 3,21,343 ఓట్లుసాధించి మూడోస్థానంలో నిలిచారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పోరులో మొత్తం ఓటర్లు 17లక్షల38,264 ఓటర్లు ఉండగా 12లక్షల7వేల471 ఓట్లు పోలయ్యాయి.

### భువనగిరిలో చామల కిరణ్‌కుమార్‌రెడ్డి (కాంగ్రెస్)



**ప్రజాపక్షం/యాదాద్రి :** లోక్‌సాభ ఎన్నికల్లో భువనగిరి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి 2 లక్షల 22 వేల ఓట్ల మెజార్టీతో భారీ విజయం సాధించారు. బిజెపి అభ్యర్థి ఎంపి బూర నర్సయ్య గౌడ్ 4,01,513 ఓట్లతో రెండవ స్థానానికి పరిమితమయ్యారు. బిఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్ 2,54,838 ఓట్లతో మూడవ స్థానానికి పరిమితమయ్యారు. మంగళవారం ఓట్ల లెక్కింపు మొదలైన తొలి రౌండు నుండి 23 రౌండ్ల వరకు ప్రతీ రౌండ్‌లో చామల కిరణ్ కుమార్ రెడ్డి స్పష్టమైన ఆధిక్యాన్ని కనబర్చారు. ఓట్ల లెక్కింపు పూర్తయిన అనంతరం మొత్తంగా 6,23,762 ఓట్లు సాధించిన చామల కిరణ్ కుమార్ రెడ్డి ఎంపిగా గెలుపొందినట్లుగా ఎన్నికల అధికారులు ప్రకటించారు. కాగా, భువనగిరి పట్టణంలో భారీ విజయోత్సవర్యాలీ నిర్వహించారు.

### నల్లగొండలో రఘువీర్ రెడ్డి(కాంగ్రెస్)



**ప్రజాపక్షం/నల్లగొండ ప్రతినిధి :** నల్లగొండ పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించింది. కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి ప్రత్యర్థి బిజెపి అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డిపై 5,59,906 ఓట్ల భారీ మెజార్టీతో గెలుపొందారు. ఓట్ల లెక్కింపు నల్లగొండ పట్టణ పరిధిలోని అనిశెట్టి దుప్పలపల్లి ఎఫ్‌సిఐ గోదాంలో మంగళవారం నిర్వహించారు. నియోజకవర్గ వ్యాప్తంగా 12,77,135 ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోగా 7 హాళ్లల్లో 14 24 రౌండ్‌లలో ఓట్ల లెక్కింపు ప్రక్రియను కొనసాగించారు. ఓట్ల లెక్కింపు పూర్తయ్యేసరికి కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందారు. అయితే రఘువీర్ రెడ్డికి 7,84,337 ఓట్లు రాగా బిజెపి అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డికి 224431, బిఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డికి 218417 ఓట్లు రావడం జరిగింది.

### వరంగల్‌లో కడియం కావ్య (కాంగ్రెస్)



**ప్రజాపక్షం/హన్మకొండ ప్రతినిధి :** వరంగల్ లోక్‌సభా స్థానానికి జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కడియం కావ్య ఘన విజయం సాధించారు. హోరాహోరీగా జరిగిన ఈ ఎన్నికల ఫలితాలను మంగళవారం వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులో లెక్కించారు. మొత్తం వరంగల్ పార్లమెంట్ పరిధిలో 12,56,301 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోగా కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యకు 5,75,566 ఓట్లు రాగా బిజెపి అభ్యర్థి ఆరూరి రమేష్‌కు 3,55,875 ఓట్లు, బిఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ మారపల్లి సుధీర్ కుమార్‌కు 2,30,820 ఓట్లు వచ్చాయి. కడియం కావ్య తన సమీప ప్రత్యర్థి (బిజెపి) ఆరూరి రమేష్‌పై 2,18,691 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఇక బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మారపల్లి సుధీర్ కుమార్ మూడవ స్థానానికే పరిమితం అయ్యారు.

### మహబూబాబాద్‌లో బలరాం నాయక్ (కాంగ్రెస్)



**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి :** మహబూబాబాద్ పార్లమెంట్ నియొజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ విజయం సాధించారు. 21వ రౌండ్ పూర్తి అయ్యే సరికి మొత్తం 10,83,204 ఓట్లు లెక్కించగా, బలరాం నాయక్‌కు 6,05,359 ఓట్లు వచ్చాయి. బిఆర్ఎస్ అభ్యర్థి మాలోతు కవిత 2,61,145 ఓట్లు, బిజెపి అభ్యర్థి అజ్మీరా సీతారాం నాయక్ 1,08,595 ఓట్లు సాధించగలిగారు. బలరాం నాయక్ మొత్తంగా 3,44,214 ఓట్ల మెజార్టీ సాధించి ఈ పార్లమెంట్ నియోజకవర్గంలో ఆయన సరికొత్త రికార్డును నెలకొల్పిన ఘనత సాధించారు. కాగా 22వ రౌండ్ ముగిసేసరికి బలరాంనాయక్‌కు 6,08,505 ఓట్లు రాగా, మాలోతు కవితకు 2,62,416 ఓట్లు, సీతారాం నాయక్‌కు 1,08,775 ఓట్లు లభించాయి. దీంతో 3,46, 089 ఓట్ల ఆధిక్యత బలరాం నాయక్ సాధించారు.

### మహబూబ్‌నగర్‌లో డికె అరుణ (బిజెపి)



**ప్రజాపక్ష/మహబూబ్‌నగర్ ప్రతినిధి:** ఉత్కంఠ పోరులో మహబూబ్‌నగర్ పార్లమెంటు బిజెపి అభ్యర్థిగా డికె అరుణ విజయం సాధించారు. చివరి రౌండ్ వరకు స్వల్ప మెజార్టీ కనబరిచిన బిజెపి 4350 ఓట్ల మెజార్టీతో విజయం సాధించింది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి గట్టి పోటీ ఇచ్చినా చివరికి స్వల్ప తేడాతో ఓటమి చెందారు. బిజెపి అభ్యర్థి డీకే అరుణకు 5,06,747 ఓట్లు రాగా, కాంగ్రెస్ అభ్యర్థి వంశీచందరెడ్డికి 5,03,111 ఓట్లు వచ్చాయి. బీఆర్ఎస్ అభ్యర్థి మన్నె శ్రీనివాస్ రెడ్డి 1,54,296 ఓట్లతో సరిపెట్టుకున్నారు. పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 1682,470 ఓట్లకు గాను 12,18,587 ఓట్లు పోలయ్యాయి. ఏడు నియోజకవర్గాల్లో పురుషులు మొత్తం 832256 ఓట్లు మహిళలు 850172 ఓట్లు ఉన్నాయి.

### ఆదిలాబాద్‌లో గోడం నగేష్ (బిజెపి)



**ప్రజాపక్షం/బోథ్ :** ఆదిలాబాద్ ఎంపి గా బిజేపి అభ్యర్థి గోడం నగేష్ 85,447 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. రెండవ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణ నిలిచారు. బిఆర్ఎస్ నుంచి పోటీ చేసిన అభ్యర్థి ఆత్రం సక్కు మూడవ స్థానంలో నిలిచారు. బిజెపి అభ్యర్థి నగేష్‌కు 5,52,314 ఓట్లు రాగా, కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణకు 4,66,867 ఓట్లు వచ్చాయి. ఇక బిఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కుకు 1,34,644 ఓట్లు వచ్చాయి. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపుల్లో బిజెపి పూర్తి ఆధిక్యం కనబర్చింది. గోడం నగేశ్ 4,649, కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణ 2,681, బిఆర్ ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కు 375 బ్యాలెట్ ఓట్లు సాధించారు. బిజెపి అభ్యర్థి గోడం నగేశ్ 1968 మెజార్టీ ఓట్లు సాధించినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

### మల్కాజిగిరిలో ఈటల రాజేందర్ (బిజెపి)



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** మల్కాజిగిరి పార్లమెంటు స్థానంలో తొలి సారిగా కాషాయ జెండా ఎగిరింది. బిజెపి అభ్యర్థి ఈటల రాజేందర్ 9 లక్షల 91 వేల 042 ఓట్లు సాధించారు. కాంగ్రెస్ అభ్యర్థి సునీతా రెడ్డిపై 3 లక్షల 91 వేల 475 ఓట్ల మెజారిటీతో ఘన విజయం సాధించారు. 2008లో పునర్విభజన అనంతరం ఏర్పడిన మల్కాజిగిరి పార్లమెంటు స్థానానికి ఇప్పటి వరకు జరిగిన నాలుగు ఎన్నికల్లో భారీ మెజారిటీ ఓట్లు సాధించిన ఈటల రాజేందర్ సంచలనం సృష్టించాడు. కాంగ్రెస్ అభ్యర్థి 5 లక్షల 99 వేల 042 ఓట్లతో రెండవ స్థానం, బిఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి 3 లక్షల 486 ఓట్లతో మూడవ స్థానం దక్కించుకున్నారు. నోటాకు 13,366 ఓట్లు పడ్డాయి. 2009లో సర్వే సత్యనారాయణ, 2014 ఎన్నికల్లో మల్లారెడ్డి , 2019 ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి గెలుపొందారు.

### నిజామాబాద్‌లో ధర్మపురి అరవింద్ (బిజెపి)



**నిజామాబాద్:** నిజామాబాద్ పారమెంట్ నియోజకవర్గంలో బిజెపి అభ్యర్థి ధర్మపురి అర్వింద్ తన సీటును పదిలపరుచుకున్నారు. కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్ రెడ్డిపై లక్ష ఓట్లకు పైగా మెజార్టీ సాధించి జయకేతనం ఎగురవేశారు. ధర్మపురి అర్వింద్ కు పోస్టల్ బ్యాలెట్లతో కలుపుకుని మొత్తం 5,92,318 ఓట్లు రాగా, రెండవ స్థానంలో నిలిచిన కాంగ్రెస్ అభ్యర్థి తాటిపర్తి జీవంరెడ్డికి 4,83,077 ఓట్లు పోల్ అయ్యాయి. అరవింద్ 1,09241 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. బిఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు 1,02,406 ఓట్లు పొందారు. మొత్తం 7,780 పోస్టల్ బ్యాలెట్ ఓట్లలో 414 ఓట్లు వివిధ కారణాల వల్ల చెల్లుబాటు కాలేదు. నిజామాబాద్ ఎంపిగా గెలుపొందిన ధర్మపురి అరవింద్‌కు పరిశీలకుల సమక్షంలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు.

### కరీంనగర్‌లో బండి సంజయ్(బిజెపి)



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** కరీంనగర్ పార్లమెంట్ స్థానంలో బిజెపి ఎంపి అభ్యర్థి బండి సంజయ్ భారీ మెజార్టీతో గెలుపొందారు. మొత్తం 28 మంది అభ్యర్థులు పోటీ చేశారు. కరీంనగర్ పార్లమెంటు 13,03,630 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. గతంలో ఎంపిగా గెలుపొందిన బండి సంజయ్ తిరిగి రెండోసారి విజయం సాధించారు. బండి సంజయ్ 5,85,116 ఓట్లు సాధించారు. తన సమీప కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుకు 3,59,907 ఓట్లు రాగా, 2,25,209 మెజార్టీతో బండి సంజయ్ విజయం సాధించారు. కాగా బిఆర్ఎస్ అభ్యర్థి వినోద్ కుమార్ 2,82,163 ఓట్లతో మూడో స్థానానికి పరిమితమయ్యారు. 2006లో జరిగిన ఉప ఎన్నికల్లో కెసిఆర్ 2,01,582 సాధించిన మెజార్టీని బండి సంజయ్ ఈ ఎన్నికల్లో రికార్డును తిరగరాయడం విశేషం.

### మెదక్‌లో రఘునందన్ రావు(బిజెపి)



**ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి :** మెదక్ ఎంపి స్థానం కమలం పార్టీ కైవసం చేసుకుంది. బిజెపి అభ్యర్థి రఘునందన్ రావు సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధుపై 39,139 వేల ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించారు. కాంగ్రెస్ రెండవ స్థానంతో సరిపెట్టుకోగా, మూడవ స్థానంలో బిఆర్ఎస్ పార్టీ ఈ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి రఘునందన్ రావుకు 4,71,217 ఓట్లు పోలయ్యాయి. నీలం మధుకు 4,32,078 ఓట్లు రాగా, బిఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి 3,96,790 ఓట్లు వచ్చాయి. రఘునందన్ రావు 39,139 వేల ఓట్ల మెజార్టీతో గెలిచారు. మెదక్ పార్లమెంట్ నియోజకవర్గానికి జరిగిన ఎన్నికల్లో 13,72,894 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

### లష్కర్‌లో కిషన్ రెడ్డి (బిజెపి)



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సికింద్రాబాద్ లోక్ సభ స్థానాన్ని బిజెపి మరోసారి నిలబెట్టుకుంది. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి తన సమీప ప్రత్యర్థి దానం నాగేందర్‌పై 49944 మెజారిటీతో విజయం సాధించారు. దీంతో కిషన్ రెడ్డి సికింద్రాబాద్ నుంచి రెండవసారి గెలుపొందారు. ఇక్కడ నుంచి పోటీచేసిన దానం నాగేందర్, టి. పద్మారావు గౌడ్‌లు ఓటమిపాలయ్యారు. సికింద్రాబాద్ లోక్‌సభ స్థానంలో మొత్తం ఓట్లు 1047659 పోలయ్యాయి. జి. కిషన్ రెడ్డి (బిజెపి) 473012 (45.15 శాతం), సమీప ప్రత్యర్థి దానం నాగేందర్ (కాంగ్రెస్) 423068 (40.38 శాతం), టి. పద్మారావు గౌడ్ (బిఆర్ఎస్) 129586 (12.37 శాతం), నోటా 5166 ఓట్లు పోలయ్యాయి.

### హైదరాబాద్‌లో అసదుద్దీన్ (ఎఐఎం)



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ లోక్‌సభ స్థానాన్ని ఎఐఎంఐఎం నిలబెట్టకుంది. ఎఐఎంఐఎం పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఓవైసీ తన సమీప ప్రత్యర్థి 338087 కొంపల్లి మాధవీలతపై ఓట్ల మెజారిటీతో ఘన విజయం సాధించారు. దీంతో ఆయన ఈ స్థానంలో ఐదవసారి విజయం సాధించారు. ఇక్కడ బిజెపి నుంచి పోటీచేసిన కొంపల్లి మాధవీలత, కాంగ్రెస్ అభ్యర్థి మహ్మద్ వలీవుల్లా సమీర్‌లు ఓటమిపాలయ్యారు. హైదరాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో మొత్తం ఓట్లు 1080324 పోలయ్యాయి. అసదుద్దీన్ ఓవైసీకి (ఎఐఎంఐఎం) 661981 (61.28 శాతం), సమీప ప్రత్యర్థి మాదవి లత (బిజెపి) 323894 (29.98 శాతం), మహ్మద్ సలీఉల్లా సమీర్ (కాంగ్రెస్) 62962 (5.83 శాతం), గడ్డం శ్రీనివాస్ యాదవ్ (బిఆర్ఎస్) 18641 (1.73 శాతం), నోటా 2906 ఓట్లు పోలయ్యాయి.

### చేవెళ్లలో కొండా విశ్వేశ్వర్ రెడ్డి (బిజెపి)



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** చేవెళ్లలో బిజెపి ఎంపి అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఘన విజయం సాధించారు. తన ప్రత్యర్థి కాంగ్రెస్ పార్టీకి చెందిన డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డిపై 1,73,019 కోట్ల తేడాతో గెలుపొందారు. ఎన్నిక కౌంటింగ్ ప్రారంభం నుంచి స్పష్టమైన ఆధిక్యంతో దూసుకుపోయిన కొండా విశ్వేశ్వర్ రెడ్డి విజేతగానిలిచారు. కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ గడ్డం రంజిత్ రెడ్డికి పోస్టల్ బ్యాలెట్‌తో కలిసి 6,36,509 ఓట్లు రాగా, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి 8,09,528 ఓట్లు సాధించి 1,73,019 మెజార్టీతో విజేతగా నిలిచారు. బిఆర్ ఎస్ పార్టీకి చెందిన కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ 1,78,848 కోట్లతో సరిపెట్టుకున్నారు. కాగా 2019 ఎన్నికల్లో తన ప్రత్యర్థి రంజిత్‌రెడ్డి చేతిలో స్వల్ప మెజారిటీతో విశ్వేశ్వర్‌రెడ్డి ఓటమి పాలయ్యారు.

## ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** రాష్ట్రంలో 17 లోక్‌సభ నియోజకవర్గ, సికింద్రాబాద్ కంటోన్మెంట్ శాసనసభ ఉప ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ వెల్లడించారు.హైదరాబాద్‌లోని బిఆర్‌కె భవన్‌లోని ఎన్నికల కమిషన్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎన్నికల లెక్కింపు వివరాలను వికాస్ రాజ్ వెల్లడించారు.రాజకీయ పార్టీలు, ఇండిపెండెంట్ అభ్యర్థుల నుండి ఎటువంటి సమస్యలు లేకుండా కౌంటింగ్ ప్రక్రియను పూర్తి చేశామన్నారు. భువనగిరి, మెదక్, మహబూబ్‌నగర్ లోక్‌సభ నియోజకవర్గాల కౌంటింగ్ ప్రక్రియ కొంత ఆలస్యంగా మొదలైందని, ఈ మూడు స్థా నాల్లో వెరిఫికేషన్ జరిపించి,ఫలితాల ప్రకటనలో ఇబ్బందులు రాకుండా చూశామని ఆయన తెలిపారు. కౌంటింగ్ విషయంలో ఏ ఒక్క నియోజకవర్గం నుండి కూడా తమకు ఫిర్యాదులు అందలేదన్నారు.ఏ నియోజక వర్గం నుండి ఎవరు గెలుపొందారు?,ఎవరిపై విజయం సాధించారనే స మాచారాన్ని ఎన్నికల కమిషన్ వెబ్ సైట్‌లో ఉంచామని వివరించారు. పో టీ చేసిన అభ్యర్థులు, వారి తాలూకు కౌంటింగ్ ఏజెంట్ల సమక్షంలోనే కౌం టింగ్ ప్రక్రియను నిర్వహించామని, లోక్‌సభ ఎన్నికల జరిగిన రోజు నుం చి మొదలు కౌంటింగ్ జరిగే వరకు ఆయా కేంద్రాల వద్ద సిసి కెమెరాలతో నిఘా పెట్టామని వివరించారు.

**నేడు నల్లగొండ-వరంగల్-ఖమ్మం గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఓట్ల లెక్కింపు**

నల్లగొండ వరంగల్‌ఖమ్మం గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఉపఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను బుధవారం ప్రారంభంకానుందని వికాస్‌రాజ్ తెలిపారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియను సజావుగా జరిపేందుకు అన్ని రకాల చర్యలూ తీసుకున్నామని తెలిపారు.

## ప్రశాంతంగా ముగిసిన కౌంటింగ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. ప్రతి కౌంటింగ్ కేంద్రం వద్ద నాలుగు అంచెల పోలీసు భద్రతను ఏర్పాటు చేశారు. 200 మీటర్ల దూరం వరకు 144 సెక్షన్ విధించి కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎక్కడ కూడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకపోవడంతో పోలీసులు ఊపిరిపీల్చుకున్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద భద్రతను, కౌంటింగ్ ప్రక్రియను గంట గంటకు డిజిపి రవిగుప్తా తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సిసిటివిలో వీక్షించారు. ఎక్కడ కూడా ఏ చిన్న సంఘటన చోటుచేసుకోకపోవడంతో పోలీసు అధికారులు, సిబ్బందికి అభినందనలు తెలిపారు. అయితే ముందు జాగ్రత్త చర్యగా నియోజక వర్గాలలో బందోబస్తును కొనసాగిస్తున్నారు. గెలుపొందిన అభ్యర్థులు ర్యాలీలు, సభలు, సమావేశాలు, టపాసులు కాల్చడంపై నిషేధాజ్ఞలు విధించారు. మొత్తం మీద కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగియడంపై పోలీసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజాపక్షం

బుధవారం, జూన్ 05

## అంతుచిక్కని ప్రజాతీర్పు

మంగళవారం వెల్లడైన 18వ సార్వత్రిక ఎన్నికల ఫలితాలు, వాటితోపాటే ఓట్లు లెక్కించిన ఆంధ్రప్రదేశ్, ఒడిశా అసెంబ్లీల ఎన్నికల ఫలితాలు సామాన్య ప్రజలనేగాక రాజకీయ, ఎన్నికల పండితులు, పరిశీలకులు, జోస్యుల (సెఫాలజిస్టులు)ను సైతం దిగ్భ్రాంతికి గురి చేశాయి. ఈ తీరున ఫలితాలను ఎవరూ ఊహించి అయినా ఉండకపోవడమే ఇందుకు కారణం. 64 కోట్ల 20 లక్షలమంది మంది పౌరులు ఓటుహక్కు వినియోగించుకున్న ఈ అపూర్వమైన ప్రజాస్వామ్య విన్యాసంలో ఎంతో విచక్షణ, పరిణతి చూపిన ఓటర్లు ముందుగా ప్రశంసలకు పాత్రులు. రాజకీయనాయకులు ఎవరేమిచెప్పినా, కుల, మత మార్గాల్లో విభజించి పబ్బంగడుపుకునే ప్రయత్నాలు చేసినా, ఏమి ఉచితాలు ఇవ్వజూపినా మెజారిటీ ఓటర్లు మాత్రం వివేకంతో తమ జీవనస్థితిగతుల అనుభవసారంతో ఆలోచించిమరీ ఓటువేశారు. వారు సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమపాళ్ళలో కాంక్షించారు. వాటితోపాటు స్వతంత్ర ఆలోచన, రాజ్యాంగం ప్రసాదించిన స్వేచ్ఛలు, హక్కులకు రక్షణ కోరుకున్నారు. తమ కుటుంబాలకు మెరుగైన జీవితాన్ని, తమ సంతానానికి సరైన విద్య, ఉపాధిని కోరుకున్నారు. పదేళ్ళ పాలనలో మాటలగారడీతప్ప అది ఇవ్వలేని ఆర్ఎస్ఎస్ మార్గనిర్దేశనలోని బిజెపి ప్రభుత్వానికి, మూడవ పర్యాయం అధికారం పొంది రాజ్యాంగాన్ని తలక్రిందులు చేయాలని తలపెట్టిన మోదీ–షా బిజెపికి లోక్‌సభలో మెజారిటీ సీట్లు ఇవ్వటానికి నిరాకరించారు. గత ఎన్నికల్లో ఎన్‌డిఎ పక్షాలుగాక బిజెపికి స్వయంగా 303 సీట్లు ఇచ్చిన ఓటర్లు ఈ పర్యాయం కనీసం మెజారిటీ సీట్లు ఎందుకు నిరాకరించినట్లు? భారత్‌ను ప్రపంచస్థాయికి అభివృద్ధి చేస్తామని మభ్యపెట్టే ప్రచారం చేసుకుంటూ, ప్రభుత్వ రంగాన్ని ధ్వంసం చేస్తూ తమను ఆశ్రయించిన పెట్టుబడిదారులకు ఆ పరిశ్రమలనుకట్టబెట్టటాన్ని ప్రజలు గమనించలేదనుకుని ఉంటారు.రూ. 16 లక్షలకోట్ల అపులు రద్దు చేయటాన్ని పట్టించుకోరని అనుకుని ఉంటారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా గొంతెత్తినవారిపై, ప్రతిపక్ష పార్టీల నాయకులపై క్రూర నిర్బంధ చట్టాలు ప్రయోగించటం, కేంద్ర దర్యాప్తు సంస్థలను ప్రయోగించి భయభ్రాంతులను చేయటం, అమృత కాలం, 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థతో దేశాన్ని ప్రపంచలో మూడవస్థానానికి తీసుకువెళ్ళడం వగైరా కల్లబొల్లి మాటలతో బిజెపి పాలకులు తమను మోసం చేస్తున్నారని ప్రజలు గ్రహించలేరని అనుకుని ఉండవచ్చు. మరో ఐదేళ్ళు ఉచితంగా తలకు 5 కిలోలు వంతున ఆహార ధాన్యాలిస్తాం, 500 ఏళ్ళ కల అయోధ్యలో రామాలయం నిర్మించి బాల రాముణ్ణి స్వయంగా ప్రతిష్ఠించాం, ప్రజలు భక్తిరసంలో ఓలలాడుతూ ఆ మత్తులో ఓట్లు గుద్దుతారనుకునీ ఉండవచ్చు. పైగా దైవాంశసంభూతుడనని మోదీ స్వయంగా చెప్పుకున్నారాయె! మోదీ గాలి జోరుగా వీస్తున్నదనుకున్న భ్రమలో వద్దంటే ఓట్లు కురుస్తాయనుకుని తమ 'హిందూరాష్ట్ర', 'అధ్యక్షతరహా పాలన' (చిన్న రాష్ట్రాలు, యూనిటరీ ప్రభుత్వం ఆర్ఎస్ఎస్–బిజెపి ఎజెండాలో ఉన్న అంశాలే) ఎజెండాను నెరవేర్చుకునేందుకు ఈసారి బిజెపికి 370 సీట్లు (ఆర్టికల్ 370 రద్దు ఘనకార్యానికి గుర్తింపుగా), ఎన్‌డిఎకి 400 కు పైగా సీట్లు ఇవ్వాలని, అభ్యర్థులతో నిమిత్తం లేకుండా మోదీ మోము చూసి ఓటేయాలని బిజెపి అర్థించింది. ప్రజలు కర్రుకాల్చి వాత పెట్టారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగం జోలికివస్తే పళ్ళు రాలతాయన్న రీతిగా తీర్పు చెప్పారు. ఇప్పుడు ప్రభుత్వం ఏర్పాటు సుస్థిరత పోయి అస్థిరతలోపడింది. ఈ సందేశం పర్యవసానమే స్టాక్ మార్కెట్లు అతిభారీగా కుప్పకూలాయి.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి వైసిపి ప్రభుత్వానికి ఓటర్లు ప్రతిపక్షపార్టీ హోదా కూడా ఇవ్వకుండా మట్టికరిపించారు. తాను ఉచితంగా పంచిపెడుతున్న ప్రభుత్వధనం ఓటుబ్యాంకును సృష్టించి తనకు తిరిగి పట్టం కడుతుందని భావించి రాష్ట్రంలో అభివృద్ధిలేకపోగా స్వేచ్ఛావాయువులు కూడా హరించే నిరంకుశపాలన అందించారు. నోరెత్తని ప్రజలు సమయంరాగానే ఓటుతో చాచికొట్టారు.

తెలంగాణ రాష్ట్రంలో పాలక కాంగ్రెస్‌పార్టీ లోక్‌సభ ఎన్నికల్లో తమ స్థితిని మెరుగుపరచుకుంది. అది ఆశించిన సీట్లు తగ్గినా తమపార్టీ ప్రాతినిధ్యం మూడు నుండి ఎనిమిదికి పెంచుకుంది. అయితే ప్రధానమంత్రి, హోంమంత్రి, ఇతర కేంద్ర నాయకత్వం రాష్ట్రంపై కేంద్రీకరించినందున బిజెపి కూడా తమ విజయాలను నాలుగు నుండి ఎనిమిదికి పెంచుకుంది. ఎటొచ్చీ ఘోరంగా దెబ్బతిన్నది కె సి ఆర్ నాయకత్వంలోని బి ఆర్ ఎస్ పార్టీ. గత ఎన్నికల్లో 9 సీట్లు గెలిచిన పార్టీ ఈసారి ఖాతా తెరవలేదు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ మాయమాటలు నమ్మి తమను ఓడించారని, ఈ ఓటమి తాత్కాలికమేనని, జాక్‌పాట్ ముఖ్యమంత్రి ఎంతోకాలం ఉండడనీ, త్వరలోనే తాము తిరిగి అధికారంలోకి వస్తామన్న భ్రమలో మునిగితేలుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై రోజూ ముప్పేట దాడి చేయడం తగ్గించుకుని, తమ పతనానికిగల స్వయంకృతాపరాధాలేమిటో పునరాలోచన చేసి దిద్దుబాటు చర్యలు తీసుకుంటే మేలు. అసోంలో 80వ దశకంలో దీర్ఘకాలంపాటు ఉద్యమం నడిపి కేంద్ర ప్రభుత్వంతో ఒప్పందం (అస్సాం అకార్డ్) తదుపరి పెద్ద మెజారిటీతో రాష్ట్రంలో అధికారం చేపట్టిన అస్సాం గణపరిషత్ పరిస్థితి ఐదేళ్ళ తదుపరి ఏమైందో అధ్యయనంచేసి గుణపాఠాలు తీసుకోవటం బిఆర్ఎస్‌కు మేలు చేస్తుంది.

ఇక ఒడిశాలో వరుసగా ఆరవసారి పదవీకాలం కోరుకున్న బిజూ జనతాదళ్ (తండ్రి బిజూ పట్నాయక్ విషాద మరణానంతరం ఆయన పేరుతోపెట్టిన పార్టీ) అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సరైన వారసుణ్ణి ఎంపిక చేసుకోకుండా తనకు వీర విధేయుడైన ఒక తమిళ ఐ ఎ ఎస్ (రిటైర్డ్) అధికారిని ముందుపెట్టుకుని అధికారం నడిపేందుకు చేసన ప్రయత్నాన్ని ఒడిశా ఓటర్లు తిరస్కరించారు. ఆయన ఆరోగ్య సమస్యను బిజెపి బాగా ఉపయోగించుకుంది. ప్రధాని మోదీ సైతం నవీన్ తనకు మంచి మిత్రుడు అంటూనే ఓట్లకోసం ఆయన ఆరోగ్యం, వారసత్వంపై దాడిచేయడం గుర్తుచేసుకోదగింది. ఒడిశా పాలన తమిళుని చేతిలోకి పోతుందంటూ బిజెపి సాగించిన 'ఆత్మగౌరవ' ప్రచారం దానికి ఫలితం ఇచ్చింది. స్వతంత్రునిగా కనిపిస్తూనే పార్లమెంటులో బిజెకి హితునిగా వ్యవహరిస్తూ వచ్చిన పట్నాయక్ జగన్‌మోహన్‌రెడ్డి వలే తగు మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది.

పట్నాయక్ బిజెపికి అధికారం అప్పగించడమేగాక, రాష్ట్రం నుండి అత్యధిక లోక్‌సభ స్థానాలు గెలుచుకునే అవకాశం ఇచ్చి మోదీ తిరిగి అధికారంలోకి వచ్చేందుకు తోడ్పడినవారైనారు. చరిత్ర క్షమించని నేరం చేశారు.

## ఏడుగురు ఇండిపెండెంట్‌ల గెలుపు

**న్యూఢిల్లీ :** లోక్‌సభ ఎన్నికల్లో ఏడుగురు స్వతంత్ర్య అభ్యర్థులు గెలుపొందారు. వారిలో చాలా మంది లక్షకుపైగా మెజారిటీతో విజయం సాధించడం విశేషం మాజీ ప్రధాని ఇందిరాగాంధీ హత మార్చిన బియాంత్‌సింగ్ కుమారుడు సరబ్‌జీత్ సింగ్ ఖల్సా ఫరీద్‌కోట్ నియోజకవర్గం నుండి ఇండిపెండెంట్‌గా 70 వేల ఓట్ల మెజారిటీతో ఎన్నికయ్యారు. లద్దాఖ్‌ను కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చినందుకు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేసిన లద్ధాఖీలు ఈసారి తమ నిరసనను మరో అడుగు ముందుకు నడిపించారు. లద్ధాఖ్ పార్లమెంటు నియోజకవర్గం నుండి బిజెపి, కాంగ్రెస్‌లను తిరస్కరించి స్వతంత్ర అభ్యర్థి మహ్మద్ హనీఫాను 28వేల మెజారిటీతో గెలిపించారు. దామన్, దయ్యూ నియోజకవర్గంలో పటేల్ ఉమేశ్‌భాయ్ బాబూ భాయ్‌ను 6,225 ఓట్లతో విజయం సాధించారు. పంజాబ్‌లోని ఖద్దూర్ సాహిబ్‌లో జైలు నుండి పోటీ చేసిన స్వతంత్ర అభ్యర్థి అమృత్ పాల్ సింగ్ 1.97 లక్షలతో, బారాముల్లాలో కూడా జైలు నుండి పోటీ చేసి రాషీద్ ఇంజనీర్ 2 లక్షల ఓట్లతో గెలుపొందారు. బిహార్‌లోని పూర్ణియా స్థానంలో ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన రాజేశ్ రంజన్ అలియాస్ పప్పూయాదవ్ 24 వేల ఓట్లతో విజయం సాధించారు. ఆయన కాంగ్రెస్ టికెట్ ఆశించగా, పొత్తులో భాగంగా మిత్రపక్షానికి కేటాయించడంతో ఇండిపెండెంట్ పోటీ చేసి గెలిచారు. మహారాష్ట్రలోని సాంగ్లీ నియోజకవర్గం నుండి టికెట్ ఆశించిన కాంగ్రెస్ సీనియర్ నేత , మాజీ సిఎం వసంత్ దాదా పాటిల్ మనవడు విశాల్ ప్రకాశ్ బాపు పాటిల్ కూడా ఇండిపెండెంట్‌గా గెలుపొందారు. పొత్తులో భాగంగా ఆ సీటు ఉద్ధవ్ ఠాక్రేకు కేటాయించారు. దీంతో కాంగ్రెస్ శ్రేణులంతా విశాల్‌ను పోటీలో దింపి లక్షకు పైగా మెజారిటీతో గెలిపించుకున్నారు. ఇండిపెండెంట్‌లుగా గెలుపొందిన వారంతా దాదాపు బిజెపిని వ్యతిరేకిస్తున్నవారేనని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

## జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి

### ఒమర్ అబ్దుల్లా పరాజయం

### ఉగ్రవాద కేసులో జైలుకెళ్లిన రషీద్ సంచలన విజయం

**బారాముల్లా:** జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సి) సీనియర్ నేత ఒమర్ అబ్దుల్లా లోక్‌సన ఎన్నికల్లో అనూహ్యంగా పరాజయాన్ని చవిచూశాడు. ఉగ్రవాద కేసులో 2019 నుంచి జైల్లో ఉన్న షేక్ అబ్దుల్ రషీద్ అలియాస్ ఇంజనీర్ రషీద్ సుమారు లక్ష ఓట్ల మెజారిటీలో ఒమర్‌పై సంచలన విజయాన్ని నమోదు చేశారు. జైలు నుంచే స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేసిన రషీద్ విజయాన్ని ఎవరూ ఊహించలేదు. ఒమర్ సులభంగా గెలుస్తారని రాజకీయ పండితులు, విశ్లేషకులు జోస్యం చెప్పారు. అందరి అంచనాలను తల్లకిందులు చేస్తూ రషీద్ విజయభేరి మోగించారు.

# దక్షిణాదిలో 'ఇండియా' హవా

### దక్షిణాదిలో 'ఇండియా' హవా

### గతంలో కంటే పెరిగిన సీట్లు

### బిజెపికి పెరిగింది ఒక్కటే

### 130 స్థానాల్లో ఇండియాకు 76, ఎన్‌డిఏకు 49, ఇతరులకు 4



**ప్రజాపక్షం /హైదరాబాద్ :** దక్షిణభారతదేశంపై బిజెపి ఎన్నో ఆశలు పెట్టుకుంది. లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తరాదిన కోల్పోయే సీట్లను దక్షిణాదిలో ఎక్కువ సీట్లను గెలుచుకోవడం ద్వారా పూడ్చుకోవాలని బిజెపి భావించింది. అయితే, అందుకు అనుగుణంగా ఫలితాలు రాలేదు. దక్షిణభారతదేశంలో ఆరు రాష్ట్రాలలోని 130 లోక్‌సభ స్థానాలు ఉండగా ఇండియా కూటమి 76 స్థానాలు, ఎన్‌డిఎ కూటమి 49 స్థానాలు గెలుపొందాయి. ఇతరులకు ఐదు స్థానాలు రాగా, అందులో నాలుగు వైసిపికి, ఒకటి ఎంఐఎంకు దక్కాయి. గత ఎన్నికల్లో ఇండియా కూటమికి 64, ఎన్‌డిఎకు 35 స్థానాలు లభించాయి. ఇతరులకు 35 రాగా, అందులో వైసిపికి 22, టిడిపికి 3, బిఆర్ఎస్‌కు 9 , రాగా , ఈ పార్టీలు ఆయా సందర్భాలలో పార్లమెంటులో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఎన్‌డిఎకు మద్దతు పలికాయి. దక్షిణాదిలో సీట్ల వారీగా చూసుకుంటే కాంగ్రెస్ తన బలాన్ని 28 నుండి 41 స్థానాలకు, బిజెపి 30 నుండి 31 స్థానాలకు పెంచుకున్నది. కర్నాటక, తెలంగాణలో గెలిచిన స్థానాలతో కాంగ్రెస్ పుంజుకుంది. మరోవైపు బిజెపికి కర్నాటకలో ఎంపి స్థానాలు 25 నుండి 17కు పడిపోయినప్పటికీ, తెలంగాణలో పుంజుకొని బలాన్ని 4 నుండి 8కి పెంచుకోగా, కేరళలో ఒక స్థానం వచ్చింది. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో టిడిపి పొత్తుతో మూడు స్థానాలను గెలుచుకోగలిగింది. ఆ పార్టీతో పొత్తే జాతీయ స్థాయిలో ఎన్‌డిఏ మ్యాజిక్ మార్కు దాటేందుకు అవకాశం కల్పించింది. పుదుచ్చేరిలో ఏకైక స్థానానికి కాంగ్రెస్ నిలబెట్టుకుంది.

**తమిళనాడు : ఫలించిన స్టాలిన్ నేతృత్వం.. పనిచేయని అన్నామలై మంత్రం**

| | |
|---|---|
| డిఎంకె | 22 |
| కాంగ్రెస్ | 9 |
| విసికె | 2 |
| సిపిఐ | 2 |
| సిపిఐ(ఎం) | 2 |
| ఎండిఎంకె | 1 |
| ఐయుఎంఎల్ | 1 |

దక్షిణాదిలో అత్యధిక స్థానాలు కలిగిన తమిళనాడు రాష్ట్రంలో ఇండియా కూటమి క్లీన్ స్వీప్ చేసింది. డిఎంకె నేతృత్వంలోని ఈ కూటమి గత పార్లమెంటు ఎన్నికల్లో కూడా దాదాపు ఇదే ఫలితాలను సాధించింది. 2019లో మొత్తం 39 స్థానాలకు 38 గెలుచుకోగా, ఈసారి మొత్తం 39 స్థానాలను కూటమి కైవసం చేసుకుంది. డిఎంకె అధినేత , సిఎం ఎం.కె.స్టాలిన్ కూటమి భాగస్వాములను గౌరవిస్తూ, వ్యూహాత్మకంగా వ్యవహరించి, ప్రచారానికి నేతృత్వం వహించి అన్ని స్థానాలను గెలుచుకునేందుకు బాటలు వేసారు. గతంలో అన్నాడిఎంకె కూటమిలో భాగంగా ఉన్న బిజెపి, ఈసారి దాని నుండి వేరుబడి స్వంతంగా కూటమి కట్టింది. ప్రచారపటాటోపంతో హోరెత్తించిన బిజెపి ఒక్కస్థానం కూడా గెలుచుకోలేకపోయింది. ఆ రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు తిరు అన్నామలై కోయంబత్తూరు స్థానం నుండి 70వేలకు పైగా తేడాతో ఓటమి పాలయ్యారు. అలాగే తెలంగాణ మాజీ గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర్ రాజన్ కూడా దాదాపు లక్ష ఓట్లతో చెన్నై సౌత్ లోక్‌సభ స్థానంలో డిఎంకె చేతిలో పరాజయం పొందారు. మాజీ సిఎం పన్నీర్ సెల్వం కూడా ఓడిపోయారు.

ఇండియా కూటమి

**ఆంధ్రప్రదేశ్ :** ఎన్‌డిఏకు ఊపిరినిచ్చిన చంద్రబాబు

| పార్టీ | 2019 | 2024 |
|---|---|---|
| టిడిపి | 3 | 16 |
| జనసేన | 0 | 2 |
| బిజెపి | 0 | 3 |
| వైసిపి | 22 | 4 |

ఒకేసారి లోక్‌సభ, శాసనసభ ఎన్నికలు జరిగిన ఆంధ్రప్రదేశ్‌లో టిడిపి కూటమి హవా కొనసాగింది. గత ఏడాది 53 రోజుల పాటు జైలులో పెట్టిన సానుభూతి చంద్రబాబుకు కలిసి రావడంతో పాటు, జగన్ ప్రభుత్వం అప్రజాస్వామిక తీరు కూడా టిడిపి భారీ విజయానికి దారి వేసింది. అలాగే విభజన జరిగిన పదేళ్ళైనా స్వంత రాజధాని లేకపోవడం, గతంలో చంద్రబాబు హయాంలో ప్రారంభించిన అమరావతిని పక్కనబెట్టి, జగన్ ప్రభుత్వం మూడు రాజధానులను చేయడం కూడా ఫలితాలపై ప్రభావం చూపింది. మొత్తం 25 ఎంపి స్థానాలలో టిడిపికి 16, జనసేనకు 2, బిజెపికి 3, వైసిపికి 4 స్థానాలు లభించాయి.

ఆంధ్రప్రదేశ్

**తెలంగాణ: బిఆర్ఎస్‌కు షాక్, కాంగ్రెస్, బిజెపికి పెరిగిన సీట్లు**

బిఆర్ఎస్ ఏర్పడినప్పటి నుండి తొలిసారిగా లోక్‌సభలో ఒక్కస్థానం లేకుండా పోవడం ఇదే తొలిసారి. 2004లో ఐదు, 2009లో 2, 2014లో 10, 2019లో 9 స్థానాలు గెలుచుకున్న బిఆర్ఎస్‌కు ఒక్క సీటు రాలేదు. చివరకు ఆ పార్టీకి గట్టి పట్టున్న సిద్దిపేట,మెదక్ శాసనసభ స్థానాలు ఉన్న మెదక్ లోక్‌సభ నియోజకవర్గంపై పెట్టుకున్న ఆశలు కూడా అడియాశలు అయ్యాయి. ఇక కాంగ్రెస్ గత శాసనసభలో సాధించిన విజయపరంపరను పార్లమెంటు ఎన్నికల్లో కూడా కొనసాగించి 8 స్థానాలను గెలుచుకోగలిగింది. గతంలో మూడు స్థానాలు మాత్రమే వచ్చాయి. కొన్ని స్థానాలలో అభ్యర్థుల ఎంపిక సరిగా జరగకపోవడంతో డబుల్ డిజిట్ దాటలేదనే అభిప్రాయం నెలకొంది. బిజెపి తన స్థానాలను రెట్టింపు చేసుకొని 8 స్థానాలు లభించింది. పట్టణ ప్రాంతాలలో మోదీ ప్రభావంతో పాటు, ప్రధానంగా తాము గెలవకున్నా కాంగ్రెస్ గెలవకూడదని చాలా చోట్ల బిఆర్ఎస్‌కు చెందిన ఓట్లు బిజెపికి బదిలీ అయినట్లు స్పష్టమవుతోంది. ఎంఐఎం తన ఏకైక స్థానాన్ని నిలబెట్టుకోగలిగింది.

| పార్టీ | 2019 | 2024 |
|---|---|---|
| కాంగ్రెస్ | 3 | 8 |
| బిఆర్ఎస్ | 9 | 0 |
| బిజెపి | 4 | 8 |
| ఎంఐఎం | 1 | 1 |

**కేరళ: గత ఫలితాలే రిపీట్**

కేరళ రాష్ట్రంలో గత లోక్‌సభ ఎన్నికల ఫలితాలే పునరావృతమయ్యాయి. మొత్తం 20 స్థానాలలో కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్ కూటమికి 18 స్థానాలను నిలబెట్టుకుంది. కాంగ్రెస్ కీలక నేత రాహుల్‌గాంధీ వయనాడ్ నుండి పోటీ చేయడం ఆ కూటమికి కలిసి వచ్చింది. అక్కడ సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అన్నీ రాజా స్ఫూర్తిదాయకమైన పోటీ ఇచ్చారు. గత శాసనసభ ఎన్నికల్లో వరుసగా రెండవసారి అధికారంలోకి వచ్చిన ఎల్‌డిఎఫ్ కూటమికి కేరళ ప్రజలు జాతీయ రాజకీయాల్లో అండగా నిలబడలేదు. గతంలో మాదిరిగా సిపిఐ(ఎం) ఒక స్థానం గెలుచుకోగా, బిజెపి బోణీ కొట్టింది. ఆ పార్టీ తరుపున త్రిస్సూర్ నుండి గెలుపొందారు. తిరువనంతపురంలో ముక్కోణపు పోటీలో కేంద్ర మాజీ మంత్రి శశిథరూర్ కష్టంగా బైటపడ్డారు.

| పార్టీ | 2019 | 2024 |
|---|---|---|
| యుడిఎఫ్ | | |
| కాంగ్రెస్ | 15 | 14 |
| ఆర్ఎస్‌పి | 1 | 1 |
| ఐయుఎంఎల్ | 2 | 1 |
| కేరళ కాంగ్రెస్ | 0 | 1 |
| ఎల్‌డిఎఫ్ | | |
| సిపిఐ(ఎం) | 1 | 1 |
| ఎన్‌డిఎ | | |
| బిజెపి | 0 | 1 |

**కన్నడనాట పుంజుకున్న కాంగ్రెస్**

| పార్టీ | 2019 | 2024 |
|---|---|---|
| కాంగ్రెస్ | 1 | 9 |
| బిజెపి | 25 | 17 |
| జెడిఎస్ | 1 | 2 |
| ఇండి | 1 | 0 |

కర్నాటక రాష్ట్రంలో శాసనసభ ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ లోక్‌సభ ఎన్నికల్లో తన స్థానాలను పెంచుకున్నది. ఆశించిన స్థాయిలో రానప్పటికీ తొమ్మిది స్థానాలలో గెలుపొందింది. బిజెపి శాసనసభ ఎన్నికల ఫలితాలు రాగానే నష్ట నివారణ చర్యల్లో భాగాంగా జెడి (ఎస్)తో పొత్తు పెట్టుకోవడం కొంత కలిసొచ్చింది.

బిజెపి బలం 25 నుండి 17కు తగ్గగా, మిత్రపక్షం జెడి (ఎస్)కు రెండు స్థానాలు వచ్చాయి. లైంగిక వేధింపుల్లో ఇరుక్కున మాజీ ప్రధాని దేవేగౌడ్ మనవడు, హసన్ ఎంపి ప్రజ్వల్ ఈ సారి ఓటమి చవి చూశారు. మాజీ సిఎం కుమారస్వామి ఎంపిగా గెలిచారు. గుల్బర్గా నుండి ఎఐసిసి అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే అల్లుడు రాధా కృష్ణ దొడ్డమణి గెలుపొందారు.

## ఒక స్థానం కోల్పోయిన ఎంఐఎం

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** హైదరాబాద్ కేంద్రంగా పని చేసే ఆలిండియ ముస్లిం ఇత్తెహదుల్ ముస్లిమీన్ (ఎఐఎంఐఎం) పార్టీ ఈసారి లోక్‌సభలో ఒక సీటును కోల్పోయింది. ఆ పార్టీ నాలుగు దశాబ్దాలుగా హైదరాబాద్ లోక్‌సభ స్థానంలో గెలుస్తూ వస్తోంది. గత ఎన్నికల్లో హైదరాబాద్‌తో పాటు అనూహ్యంగా మహారాష్ట్రలోని ఔరంగాబాద్ లోక్‌సభ స్థానంలో విజయం సాధించి, లోక్‌సభలో తన బలాన్ని రెండుకు పెంచుకుంది. ఈసారి ఎన్నికల్లో హైదరాబాద్, ఔరంగాబాద్‌తో పాటు , బిహార్‌లోని కిషన్ గంజ్ స్థానాన్ని కూడా గెలుస్తామని ఆ పార్టీ అంచనాలు వేసుకుంది. అయితే, కేవలం హైదరాబాద్‌లోనే గెలుపొందింది. ఈ సారి సోషల్ మీడియాలో హల్‌చల్ చేసిన బిజెపి అభ్యర్థి మాధవి లత గట్టి పోటీ ఇస్తుందని భావించినప్పటికీ ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఓవైసీ అవలీలగా గెలుపొందారు. ఐదవసారి గతం కంటే అధికంగా సుమారు 3.34 లో మెజారిటీతో గెలుపొందారు.

## కేంద్ర మంత్రికి గట్టిపోటీ ఇచ్చిన సిపిఐ

**బిహార్ :** బిహార్‌లోని బెగుసరాయ్ లోక్‌సభ నియోజకవర్గంలో బిజెపి అభ్యర్థి, కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్‌కు సిపిఐ గట్టి పోటీ ఇచ్చింది. ఈ స్థానంలో సిపిఐ అభ్యర్థి, ఎంఎల్‌ఏ అవదేశ్ కుమార్ రాయ్ రెండవ స్థానంలో నిలిచారు. గత ఎన్నికల్లో గిరిరాజ్ సింగ్ 4.22 లక్షల మెజారిటీతో సిపిఐపై గెలుపొందారు. ఈసారి సిపిఐ అభ్యర్థి ఆయన మెజారిటీని 81వేలకు తగ్గించారు.

## వెలవెలబోయిన 'ఆప్' కార్యాలయం




**న్యూఢిల్లీ:** ఢిల్లీలోని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ప్రధాన కార్యాలయంలో లోక్‌సభ ఎన్నికల ఫలితాల హడావుడి కనిపించలేదు. ఎప్పుడూ కిక్కిరిసి ఉండే కార్యాలయం మంగళవారం వెలవెలబోయింది. ఢిల్లీలోని ఏడు స్థానాలకుగాను ఆప్ నాలుగు స్థానాల్లో, మిత్ర పక్షమైన కాంగ్రెస్ మూడు స్థానాల్లో పోటీ చేశాయి. కౌంటింగ్ కొనసాగుతున్న కొద్దీ, నాలుగు స్థానాల్లోనూ ఆప్ అభ్యర్థులు వెనుకంజలో ఉండడంతో, స్థానిక నేతలు నీరుగారిపోయారు. ఆప్ జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ బెయిల్ గడువు ముగియడంతో మళ్లీ తీహాడ్ జైలుకు వెళ్లడం కూడా నాయకుల్లో నిరుత్సాహానికి కారణమైంది. కాగా, పొరుగు రాష్ట్రమైన పంజాబ్‌లో 'ఇండియా' కూటమితో సంబంధం లేకుండా ఆప్ సొంతంగా లోక్‌సభ ఎన్నికల్లో పోటీపడింది. అక్కడ కూడా ఆశించిన ఫలితాలు రావడం లేదన్న వార్తలు వినిపించడంతో, ఆప్ కార్యాలయం వద్ద సందడి తగ్గిపోయింది. మంగళవారం మధ్యాహ్నానికి కొద్ది మంది నాయకులు, కార్యకర్తలు మాత్రమే అక్కడ మిగిలారు.

## ఆ ఇద్దరూ జైళ్లో ఉండే గెలిచారు !

### అందులో ఒకరు ఏకంగా మాజీ సిఎంనే ఓడించారు



**న్యూఢిల్లీ :** ఈ సారి ఎన్నికల్లో ఇద్దరు అభ్యర్థులు ఏకంగా జైలు నుండే పోటీ చేసి ఎంపిలుగా గెలుపొందారు. వారిలో పంజాబ్ రాష్ట్రంలోని ఖదూర్ సాహిబ్ నుండి అమృత్ పాల్ సింగ్, జమ్మూ కశ్మీర్‌లోని బారాముల్లా నుండి అబ్దుల్ రాషీద్ షేక్ అలియాస్ ఇంజనీర్ రాషీద్ ఉన్నారు. ఎన్ఐఎ అరెస్టు చేయడంతో 2019 నుండి ఇంజనీర్ రాషీద్ తిహాడ్ జైలులో ఉన్నారు. ఆయన జైలు నుండే బారాముల్లా నియోజకవర్గం నుండి పోటీ చేసారు. ఆ స్థానంలో ఏకంగా జమ్మూ కశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాపైనే గెలిచారు. రాషీద్ ఇంజనీర్‌కు 2 లక్షలకు పైగా మెజారిటీతో గెలుపొందడం విశేషం. గతంలో రెండు సార్లు ఎంఎల్‌ఏగా కూడా ఉన్నారు. ఇక మరో ఇండిపెండెంట్ అభ్యర్థి అమృత్‌పాల్ సింగ్ జాతీయ భద్రతా చట్టం కింద అరెస్టై, అస్సోంలోని దిబ్రూగఢ్ జైలులో ఏడాదికి పైగా ఉన్నారు. ఖలిస్తాన్ అనుకూల వారిస్ దే పంజాబ్‌కు ఆయన నేతృత్వం వహిస్తున్నారు. గత ఏడాది ఆయనను వెంటాడి, వేటాడి నాటకీయ ఫక్కీలో పోలీసులు జాతీయ భద్రతా చట్టం కింద అరెస్టు చేసి, అస్సోంలోని దిబ్రూగఢ్ జైలులో ఉంచారు. దీంతో పంజాబ్‌లోని యువతలో పెద్ద ఎత్తున అలజడి రేగింది. జైలులో నామినేషన్ పత్రాలను నింపించుకొని, ఆయన తల్లి ఊరూర తిరిగి అమృత్‌పాల్‌సింగ్‌కు కేటాయించిన మైక్ గుర్తుకు ఓటేయ్యాలని ప్రచారం చేసింది. దీంతో అమృత్‌పాల్ సింగ్ 1.97 లక్షల ఓట్ల మెజారిటీతో కాంగ్రెస్ అభ్యర్థిపై గెలుపొందారు.

## నోటాకు 2 లక్షలకు పైగా ఓట్లు!




**మధ్యప్రదేశ్ :** ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో కొత్త రికార్డు నమోదైంది. మధ్యప్రదేశ్ రాష్ట్రం ఇండోర్ నియోజకవర్గంలో నోటాకు ఇప్పటి వరకు ఎవరికి రానంతగా అత్యధికంగా 2,18,674 ఓట్లు లభించాయి. ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థిని బిజెపి చివరి నిమిషంలో తమ పార్టీలో చేర్చుకొని నామినేషన్‌ను ఉపసంహరించుకునేలా చేసింది. దీంతో ఆగ్రహంతో ఊగిపోయిన కాంగ్రెస్ పార్టీ తమ కార్యకర్తలను నోటాకు ఓటు వేయాలని ఆదేశించింది. ఫలితంగా రికార్డు స్థాయిలో 2 లక్షలకు పైగా ఓట్లు నోటాకు వచ్చాయి.

## మాయావతి స్వయంకృతం!



**లక్నో:** ఉత్తరప్రదేశ్‌లో ఒకప్పుడు బలమైన పార్టీగా ఎదిగి, రాష్ట్రంలో ప్రభుత్వాన్ని నడిపిన బహుజన సమాజ్ పార్టీ (బిఎస్‌పి) క్రమంగా తన ప్రాభవాన్ని కోల్పోయింది. కాన్షీరాం మృతి తర్వాత పార్టీ పగ్గాలు స్వీకరించిన మాయావతి అనుసరిస్తున్న విధానాలు, తీసుకుంటున్న నిర్ణయాలు వివాదాస్పదంగా మారుతున్నాయి. దేశంలో ప్రజాస్వామ్యం, లౌకికవాదం ప్రమాదంలో పడిన తరుణంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేయాలన్న ఆమె నిర్ణయం ఎదురుదెబ్బ తీసింది. ప్రతిపక్ష 'ఇండియా' కూటమితో కలవకుండా, ఒంటరి పోరాటానికి సిద్ధపడిన ఆమె, రాష్ట్రంలో ఉన్న మొత్తం 80 లోక్‌సభ స్థానాలకూ అభ్యర్థులను నిలబెట్టినా, ఒక్క సీటును కూడా సంపాదించుకోలేకపోయారు. దళితులకు రాజ్యాధికారం నినాదంతో ఒకప్పుడు ఉత్తరప్రదేశ్‌తోపాటు దేశ రాజకీయాల్లోనూ కీలక పాత్ర పోషించిన బిఎస్‌పి గత లోక్‌సభ ఎన్నికల్లో 10 సీట్లు సాధించింది. 2014లో ఒంటరిగా పోటీ చేసినప్పుడు ఒక్క సీటు కూడా రాకపోవడంతో, 2019లో సమాజ్‌వాది పార్టీతో కలిసి పోటీకి దిగింది. పొత్తుల్లో భాగంగా 38 స్థానాల్లో అభ్యర్థులను నిలబెట్టింది. 9.10 శాతం ఓట్లను సంపాదించింది. కానీ, ఎన్నికైన ఆ పది మంది ఎంపిలు క్రమంగా పార్టీకి దూరమవుతూ వచ్చారు. బిజెపికి 'బి' పార్టీగా బిఎస్‌పి వ్యవహరిస్తున్నదనే విమర్శలు ఉన్నాయి. ఉత్తరప్రదేశ్ అసెంబ్లీలో ఈ పార్టీ నుంచి గెలిచిన ఏకైక ఎమ్మెల్యే ఉమా శంకర్ సింగ్ అసెంబ్లీలో పాలక బిజెపికి మద్దతుగా ఓటు వేయడంతో ఈ ఆరోపణలకు మరింత బలం చేకూరింది. కాగా, దళితుల్లో మాయావతికి ఉన్న బలాన్ని తగ్గించడానికి మరో దళిత నాయకురాలు బేబీ రాణి మౌర్యను ప్రోత్సహించింది. బిజెపి నుంచి సహకారం లభించని మాయావతి, 'ఇండియా' కూటమిలో చేరి ఉంటే, ఎన్నోకొన్ని స్థానాలను దక్కించుకొని ఉండేవారు. కానీ, ఒంటరి పోరాటానికే ఆమె సిద్ధపడ్డారు. అభ్యర్థులను నిలబెట్టారు. ఘోర పరాజయాన్ని చవిచూశారు. ఉత్తరప్రదేశ్‌లో బిఎస్‌పి పరిస్థితి దారుణంగా మారడానికి ఆమె చేసిన పొరపాటేనని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

## కుప్పకూలిన స్టాక్ మార్కెట్లు



**ముంబయి:** బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ఈసారి సార్వత్రిక ఎన్నికల్లో తిరుగులేని విజయం సాధిగస్తుందని, సుమారుగా 400 సీట్లు కైవసం చేసుకుంటుందని ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు వెలువడిన వెంటనే రికార్డు స్థాయిలో అమ్మకాల ర్యాలీని నమోదు చేసిన స్టాక్ మార్కెట్లు, మంగళవారం నాటి ట్రెండ్స్ బయటకు వస్తున్న కొద్దీ నష్టాల్లోకి జారుకున్నాయి. ఎన్‌డిఎ కూటమి అతికష్టం మీద మళ్లీ అధికారంలోకి రావచ్చన్న వార్తలు స్టాక్ మార్కెట్ లావాదేవీలపై తీవ్ర ప్రభావం చూపాయి. ట్రేడింగ్ మొదలైన ప్రారంభంలోనే పెట్టుబడిదారుల నుంచి అమ్మకాల ఒత్తిడి పెరిగింది. ఫలితంగా మధ్యాహ్నంలోపే కనీసం 26 లక్షల కోట్ల రూపాయలు ఆవిరయ్యాయి. అంతకు ముందు కొనుగోళ్లు కొనసాగితే, ఓట్ల లెక్కింపు నేపథ్యంలో పరిస్థితులు తారుమారయ్యాయి. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బిఎస్ఇ)లో సెన్సెక్స్, జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఇ)లో నిఫ్టీ పాయింట్ల పతనం కొనసాగింది. మొదటి సెషన్ లోనే 400 లక్షల కోట్ల రూపాయల నష్టాన్ని మార్కెట్లు ఎదుర్కోవడం మదుపరుల సెంటిమెంట్‌ను స్పష్టం చేసింది. క్రమం తప్పకుండా పతనమైన సెన్సెక్స్, ట్రేడింగ్ ముగిసే సమయానికి ఏకంగా 4,389.99 పాయింట్ల నష్టంతో, 72,079.05 పాయింట్ల వద్ద స్థిరపడింది. గత నాలుగేళ్లలో ఒకే రోజు ఇంతటి పతనం నమోదు కావడం ఇదే మొదటిసారి. కాగా, నిఫ్టీ కూడా అదే దారిని అనుసరించింది. 1,370.40 పాయింట్లు కోల్పోవడంతో, 21,884.50 పాయింట్లకు పడిపోయింది. బిఎస్ఇ 30 సెన్సెక్స్ కంపెనీల్లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) అత్యంత దారుణంగా, 16 శాతానికిపైగా నష్టపోయింది. పవర్‌గ్రిడ్, ఎన్‌టిపిసి షేర్లు 15 శాతం నష్టాల్లో ట్రేడ్ అయ్యాయి. లార్సన్ అండ టూబ్రో, యాక్సిస్ బ్యాంక్, టాటా స్టీల్, భారతీ ఎయిర్టెల్, జెఎస్‌డబ్ల్యు స్టీల్, రిలయన్స్ ఇండస్ట్రీస్ కూడా భారీ నష్టాలను ఎదుర్కొన్నాయి. ఎన్‌డిఏకు అత్యంత బలమైన ఉత్తరప్రదేశ్, హర్యానా, రాజస్థాన్ వంటి రాష్ట్రాల్లో బిజెపి వెనుకంజ వేయడం మార్కెట్‌పై తీవ్ర ప్రభావం చూపింది. సంస్థాగత ఇన్వెస్టర్లు కూడా చివరి క్షణాల్లో అమ్మకాలకే మొగ్గు చూపడంతో సెన్సెక్స్, నిఫ్టీ పతనం తప్పలేదు. అంతకు ముందు, ఎగ్జిట్ పోల్స్‌లో బిజెపి తిరుగులేని విజయం సాధిస్తుందనే ఫలితాలు రావడంతో ఒక్కసారిగా పెరిగిన లావాదేవీలు, ఓట్ల లెక్కింపులో వెల్లడవుతున్న సరళితో పాటు దిగజారాయి. ఇంట్రా ట్రేడ్ కూడా రికార్డు పతనాన్ని నమోదు చేయడం గమనార్హం.

## రఘురాంరెడ్డికి వామపక్షాల అభినందన



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మం పార్లమెంటు ఎన్నికల్లో ఘన విజయం సాధించిన కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డికి వామపక్ష నేతలు శుభాకాంక్షలు తెలిపారు. వామపక్షాల మద్దతుతో విజయం సాధించిన రఘురాంరెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, సహాయ కార్యదర్శి దండి సురేష్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, జిల్లా నాయకులు వై. విక్రం, కాంగ్రెస్ నాయకులు రాయల నాగేశ్వరరావు, మిక్కిలినేని నరేంద్ర ఉన్నారు.

## ‘జయ’ విద్యార్థుల విజయభేరి




**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్:** నీట్ 2024 ఫలితాల్లో జిల్లా కేం ద్రంలోని జయ జూనియర్ కళాశాల మొదటి బ్యాచ్ విద్యార్థులు మెడికల్ సీట్లు సాధించారని కళాశాల కరస్పాండెంట్ జయవేణుగోపాల్ తెలిపారు. మంగళవారం కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ నీట్ ఫలితాల్లో తమ కళాశాలకు చెందిన ఎస్‌కె అఫ్నాన్ 537, పి.సాయి శివాని 531, ఎస్ వరప్రసాద్ 529, సమ్‌రీన్ 412 జాతీయ మార్కులు సాధించినట్లు తెలిపారు. పది మంది విద్యార్థులు నీట్ పరీక్షలు రాయగా వారిలో నలుగురు విద్యార్థులు మెడికల్ సీట్లు సాధించడం హర్షణీయం అన్నారు. విద్యార్థుల ఉత్తమ ప్రతిభ కబరిచేలా కృషి చేసిన అధ్యాపకులు, సహకరించిన విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు బింగి జ్యోతి, జెల్లా పద్మ తదితరులు ఉన్నారు.

## అంగన్‌వాడీలో బడిబాట



**ప్రజాపక్షం/నాంపల్లి:** మండల పరిధిలోని సుంకిశాల గ్రామంలో మంగళవారం అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్ యదమ సుమతమ్మ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బడి ఈడు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించాలని, కేంద్రాలలో పిల్లలకు పోషకాలతో కూడిన భోజన సదుపాయాలు, గుడ్లు, ఆకుకూరలు, ఆకర్షణీయమైన అంగన్‌వాడీ కేంద్రాలు, ఆట స్థలాలు, అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లలను పంపడం ద్వారా విద్యా, మానసిక, శారీరక వృద్ధి చెందడం జరుగుతుందని తెలిపారు. ప్రతి విద్యార్థికి కేంద్రాలలో ప్రతి నెల ఆరోగ్య పరీక్షలు నిర్వహించి తగు సూచనలు చేయడం జరుగుతుందని అన్నారు. ఈ విద్యా సంవత్సరం నుండి విద్యార్థులకు కేంద్రాలలో యూనిఫాం కూడా ఇవ్వడం జరుగుతుందని ప్రతి ఒక్కరు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలలలో చేర్పించి ఫ్లిల్లల బంగారు భవిష్యత్తుకు పునాది వేయాలని తల్లులకు సూచించారు. ఈకార్యక్రమంలో తల్లులు, కిషోర బాలికలు, గ్రామ పెద్దలు ఆయాలు పాల్గొన్నారు.

## దొంగల పట్టివేత

**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** పట్టణ పరిధిలో గల జానపహాడ్ మేజర్ ఎన్నెస్పీ కెనాల్ మీద గల గేట్‌రాడ్‌లు,షట్టర్‌లు,గేర్ బాక్స్‌ల చోరీకి పాల్పడిన దొంగలను పట్టుకున్నట్లు మంగళవారం నేరేడుచర్ల ఎస్ఐ రవీంద్రనాయక్ విలేకరులకు తెలిపారు.ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని దిర్శించర్ల గ్రామానికి చెందిన వేముల రాజు,వేముల శ్రీకాంత్‌లు కలిసి దొంగలించినట్లు తెలిపారు.ఎన్నెస్పీ అధికారులు రెబ్బ రాము, వర్క్ ఇన్స్పెక్టర్ ఫిర్యాదు ఇవ్వగా కేసు నమోదుచేసి అట్టి దొంగతనానికి పాల్పడిన ఇద్దరిపై కేసు నమోదు చేసి దొంగతనం చేసిన సొత్తును స్వాధీనం చేసుకుని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పర్చినట్లు ఎస్ఐ తెలిపారు.

## కౌంటింగ్ ప్రక్రియ పరిశీలన



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్:** నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను మంగళవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్ వెంకట్రావ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌంటింగ్ ప్రక్రియలో 450 మందికి పైగా ఉద్యోగులను నియమించినట్లు తెలిపారు. ప్రతి కేంద్రంలో 14 ఏర్పాటు చేసి ఎన్నికల కౌంటింగ్‌ను విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ఆయన వెంట ఆర్‌డిఓలు సూర్యనారాయణ, వేణుమాధవ్, శ్రీనివాస్, తహసీల్దార్లు, మాస్టర్ ట్రైనర్లు రమేష్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## అందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధిః** పార్లమెంటు ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగాముగిసేందుకు సహకరించిన ప్రజాప్రతినిధులు,అధికారులు, సిబ్బంది, పోలీసు అధికారులు, ప్రజలకు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. పోలింగ్‌తో పాటు ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా పూర్తయ్యిందని పేర్కొన్నారు. మంగళవారం ఓట్ల లెక్కింపు కార్యక్రమం ప్రశాంతంగా సాగిందని వివరించారు. పార్లమెంటు ఎన్నికల కోడ్ వచ్చినప్పటి నుంచి ఎన్నికలు పూర్తయ్యే వరకు ఈ ప్రక్రియలో భాగస్వాములైన అధికారులకు సిబ్బంది అందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నానని పేర్కొన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది ఎంతో కష్టపడి పనిచేశారని తెలిపారు. ఎన్నికల నిర్వహణ కోసం ముందు జాగ్రత్తగా పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టామని పేర్కొన్నారు.

## కెఎల్ఎన్ ప్రభంజనం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** నీట్ ఫలితాల్లో పట్టణంలోని కేఎల్ఎన్ విద్యార్థులు ప్రతిభ చాటినట్లు కళాశాల కరస్పాండెంట్ కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.బి.మేఘన 5959వ ర్యాంకు, బి.అద్విత్‌కృష్ణ 6124, బి.అఖిల 6950వ ర్యాంకులు సాధించి జిల్లాలో అగ్రగామిగా నిలిచారన్నారు. అదేవిధంగా ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్లు సాధించే వారు 8మంది ఉన్నారన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులను కళాశాల డైరెక్టర్లు పీఎల్ఎన్.రెడ్డి, నరేందర్‌రెడ్డి, హనుమంతరెడ్డి అభినందించారు.

# కారుకు పంక్చర్.. కాంగ్రెస్‌దే పైచేయి

సూర్యాపేట నియోజకవర్గంలో
69,320 ఓట్ల మెజారిటీ
ముందే చెప్పిన ‘ప్రజాపక్షం’





**ప్రజాపక్షం/సూర్యాపేటప్రతినిధి:** పార్లమెంట్ ఎన్నికల్లో కారుకు పంచర్ అయింది. సూర్యాపేట నియోజకవర్గంలో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయిన తరువాత వరుసగా మూడు పర్యాయాలు జరిగిన ఎన్నికల్లో కారు జోరు సాగింది. మూడు సార్లు జగదీష్ రెడ్డి చేతిలో ఓటమిపాలైన మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ఆయనకు దిమ్మతిరిగేలా రిటన్ గిఫ్ట్ ఇచ్చారు. ఇదే విషయాన్ని ప్రజాపక్షం పోలింగ్ అనంతరం గత నెల 21న కాంగ్రెస్‌దే పై చేయి అని రాసిన కథనం నేడు అక్షర సత్యమైంది. తాను గత అసెంబ్లీ ఎన్నికల్లో 4600 ఓట్లతో ఓటమి చెందానని ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రఘువీర్‌రెడ్డికి నియోజకవర్గంలో 46 వేల మెజార్టీ ఇచ్చి తీరుతామని ఆర్‌డిఆర్ ఎన్నికల ప్రచారంలో శపథం చేశారు. ఇది ఇలా ఉంటే కాంగ్రెస్ పార్టీకి ఎన్నికల్లో 69,320 మెజార్టీ ఓట్లు వచ్చాయి. అతను చెప్పినదాని కన్నా 23,320 ఓట్లు ఎక్కువ రావడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో ఫుల్ జోష్‌లో ఉన్నారు.తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత 2014లో జరిగిన ఎన్నికల్లో నాటి టిఆర్ఎస్ అభ్యర్థిగా గుంటకండ్ల జగదీష్ రెడ్డి సూర్యాపేట శాసన సభ్యుడిగా సుమారు 2200పై చిలుకు ఓట్లతో విజయం సాధించారు. 2018లో జరిగిన ముందస్తు ఎన్నికల్లో ఆయన 7500కు పైగా ఓట్లతో మరోసారి గెలిచారు. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో 4600ఓట్లమెజార్టీతో హాట్రిక్ సాధించారు. సూర్యాపేట నియోజకవర్గంలో ఇక బిఆర్ఎస్, తనకు తిరుగులేదని వేల కోట్ల రూపాయలతో తాను అభివృద్ధి పనులు చేయడంతోనే ప్రజలు ఆదరిస్తున్నారని ఆయన పదే పదే చెప్పుకోస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో సూర్యాపేట బిఆర్ఎస్ కంచుకోట అని ఆ పార్టీ శ్రేణులు గొప్పలు చెప్పుకున్నారు. కాని పార్లమెంట్ ఎన్నికల్లో కారుకు పంచర్ కావడంతో వారి ఆశలకు గండిపడింది. మాజీ మంత్రి, శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్‌రెడ్డితో అసెంబ్లీ ఎన్నికలకు ముందులా పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చి నా ఓటర్లు ఏ మాత్రం పట్టించుకోలేదు. రాష్ట్రంలో బిఆర్ఎస్ అధికారం కోల్పోయిన చింత సచ్చినా పులుపు చావలేదన్న రీతిలో ఆయన వ్యవహరించిన తీరును ప్రజలు చీదరించుకున్నారు.

**ఆత్మస్థైర్యంతో ఆర్డీఆర్ ముందుకు**

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత మూడు పర్యాయాలు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో స్వల్ప తేడాతో ఓటమి చెందిన మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి ఆత్మస్థైర్యం కోల్పోకుండా రాజకీయాల్లో గెలుపు ఓటములు సహజమని ముందుకు సాగుతున్నారు. రాష్ట్రంలో పార్టీ అధికారంలో రావడంతో ఆయన గతంలో కన్నా రెట్టింపు ఉత్సాహంతో నిరంతరం నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ కార్యకర్తల్లో మనోధైర్యం నింపుతున్నారు. ఈలోపు పార్లమెంట్ ఎన్నికలు రావడంతో ఆయన కాంగ్రెస్ పార్టీకి నియోజకవర్గంలో పూర్వ వైభవం తీసుకవచ్చేందుకు కంకణబద్ధుడై పని చేశారు. తన కుమారుడు ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తంరెడ్డితోపాటుకుడిఎడమ భుజాలుగా ఉంటున్న రాష్ట్ర నాయకులు కొప్పుల వేణారెడ్డి, పోతు భాస్కర్‌లతో కలిసి ముం దుకు సాగుతున్నారు. ఈ ఎన్నికల్లో ప్రత్యార్థి పార్టీల ఎత్తులను చిత్తు చేసేలా పై ఎత్తులు వేసి నియోజకవర్గాన్ని మొత్తం మండుటెండల్లో సైతం చుట్టేశారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తేనే అభివృద్ధి సాధ్యమని ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న ఆరుగ్యారంటీలను ప్రజలకు వివరిస్తూ చైతన్యం చేయడంలో పూర్తి సక్సెస్ అయ్యారు. దీంతో వారు పట్ట శ్రమకు పార్లమెంట్ ఎన్నికల్లో భారీ మెజార్టీ సాధించడం ఇందుకు నిదర్శనం.

**ఆర్డీఆర్‌ను అలింగనం చేసుకున్న జానారెడ్డి**

సూర్యాపేట నియోజకవర్గంలో తన కుమారుడు రఘువీర్ రెడ్డికి పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీ అందించిన మాజీ మంత్రి, నియోజకవర్గ ఇన్ చార్జీ రాంరెడ్డి దామోదర్ రెడ్డిని మాజీ మంత్రి కుందూరు జనారెడ్డి అలింగనం చేసుకోని అభినందనలు తెలిపారు. ఇచ్చిన హామీ కన్న ఎక్కువ మెజార్టీ ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ విజయం కోసం పని చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

## కరీంనగర్ ప్రజలకు రుణపడి ఉంటా : సంజయ్



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధిః** తనను ఓడించేందుకు ఒక వర్గం ఓట్లను ఏకం చేయాలనుకున్న కెసిఆర్, కాంగ్రెస్ నేతలు ఎన్ని కుట్రలు చేసినా తనను అత్యధిక మెజారిటీతో గెలిపించి కరీంనగర్‌ప్రజల దమ్ము చూపారని బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి ఎండి బండి సంజయ్ అన్నారు. కరీంనగర్ ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ హవాతోనే తనకు ఇంతటి మెజారిటీ దక్కిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇకనైనా ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, లేని పక్షంలో ప్రజల పక్షాన పోరాడి ఆ పార్టీ అంతు చూస్తామని హెచ్చరించారు. ఎన్నికల ఫలితాలు ముగిసిన అనంతరం బండి సంజయ్ ఎస్సారార్ కళాశాల వద్దకు వెళ్లి ఎన్నికల రిటర్నింగ్ అధికారి చేతుల మీదుగా గెలుపు ధ్రువీకరణ పత్రాన్ని అందుకున్నారు. అనంతరం బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. భారీ మెజార్టీ ఇచ్చి తనపై నమ్మకం ఉంచి మరోసారి ప్రజలకు సేవ చేసే భాగ్యం కల్పించినందుకు శిరస్సు వంచి ధన్యవాదాలు తెలియజేశారు. ఇది ప్రజా విజయమని, ఈ విజయం బిజెపి కార్యకర్తలకే అంకితమన్నారు. మోదీ అద్భుతమైన పాలనను గుర్తించి ప్రజలు కట్టబెట్టిన విజయమన్నారు. కరీంనగర్ సహా తెలంగాణ అభివృద్ధి చెందాలంటే మోదీ మరోసారి ప్రధాని కావాలనే లక్ష్యంతో భారీ మెజార్టీ అందించారన్నారు. తెలంగాణ అంతటా మోదీ హవా కొనసాగిందన్నారు. ఇతర పార్టీలు ఎన్నికల సంధర్భంలో అనేక తప్పుడు ప్రచారాలు చేసినా, కుట్రలు చేసినా ప్రజలు పట్టించుకోలేదన్నారు. రాబోయే రోజుల్లోనూ అదే పంథాను కొనసాగిస్తూ ప్రజల పక్షాన ఉంటానన్నారు. తెలంగాణ ప్రజలు బిజెపిపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారంటీలు సహా హామీలన్నీ అమలు చేయించేందుకు ప్రధాన ప్రతిపక్షంగా ఉంటూ ప్రజల పక్షాన ముందుండి కొట్లాడతామన్నా రు. కాంగ్రెస్ మెడలు వంచైనా సరే హామీలను అమలు చేయిస్తామన్నారు. రాబోయే రోజుల్లో మోదీ రాజ్యమే..రామరాజ్యమేనన్నారు. రాజ్యాంగం మారుస్తారని, రిజర్వేషన్లు ఎత్తేస్తారని ఇండియా కూటమి దేశవ్యాప్తంగా విష ప్రచారం చేసి ప్రజలను భయభ్రాంతులను గురిచేసిందని, ఇంటికో లక్ష రూపాయలు అకౌంట్లో వేస్తామంటూ సాధ్యం కాని హామీలు గుప్పించి ప్రజలను ఆకర్షించే ప్రయత్నం చేసిందన్నారు. దక్షిన భారతం, ఉత్తర భారతం అంటూ దేశాన్ని తీల్చేందుకు వెనుకాడలేదని, దీంతో ప్రజలు అయోమయానికి గురయ్యారన్నారు. లేకుంటే ఎన్డీఏకు 4 వందల సీట్లు వచ్చేవన్నారు. అయినప్పటికీ తెలంగాణ ప్రజలు వాస్తవాలు గ్రహించి బిజెపికి అత్యధిక సీట్లు కట్టబెట్టారన్నారు.

## సిపిఐ శ్రేణులకు ధన్యవాదాలు

సిపిఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు పల్లా నర్సింహారెడ్డి




**ప్రజాపక్షం/దేవరకొండ:** నల్గొండ పార్లమెంట్ ఎన్నికల్లో సిపిఐ బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి గెలుపు కోసం శ్రమించి పనిచేసిన గెలుపులో భాగస్వాములైన సిపిఐ దేవరకొండ నియోజకవర్గ శ్రేణులకు సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి ధన్యవాదాలు తెలిపారు. మంగళవారం ప్రజాపక్షంతో ఆయన మాట్లాడుతూ రఘువీర్‌రెడ్డి విజయం కోసం పొత్తులో భాగంగా సిపిఐ బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి గెలుపు కోసం నియోజకవర్గంలోని డిండి, దేవరకొండ, చింతపల్లి, చందంపేట, పిఏపల్లి, కొండమల్లేపల్లి, నేరేడుగొమ్ము మండల పార్టీ కార్యదర్శులు, జిల్లా నాయకులు, మండల కార్యవర్గం, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు ఎంతో శ్రమించి పట్టుదలతో గెలుపే లక్ష్యంగా గ్రామస్థాయిలో పనిచేసి రఘువీర్‌రెడ్డి గెలుపుకోసం కృషి చేసి గెలుపులో భాగస్వాములైన సిపిఐ శ్రేణులకు ధన్యవాదాలు తెలిపారు. రఘువీర్‌రెడ్డికి నల్గొండ ప్రజలు ఏకంగా 5,52,652 మెజార్టీ ఇవ్వడం ఆనందించ దగిన విషయం అని ఈ సందర్భంగా ఆయన అన్నారు.

# నల్లగొండలో నాడు రావి.. నేడు రఘువీర్





**ప్రజాపక్షం/నల్లగొండ ప్రతినిధిః** పోరాటాల పురిటిగడ్డ నల్లగొండ జిల్లాకుప్రత్యేకమైన స్థానం ఉంటుం ది. ఎప్పుడు ఎన్నికలు జరిగినా ఈ నియోజకవర్గంలో ఏదో ఒక చరిత్ర సృష్టిస్తుంది.1952తొలిపార్లమెంటుఎన్నికల్లో తొలి ప్రధాని నెహ్రూ కంటే అత్యధిక మెజార్టీని కమ్యూనిస్టు నాయకులు రావి నారాయణరెడ్డి సాధించి నియోజకవర్గానికి పేరు తీసుకొచ్చారు. 1996 ఎన్నికల్లో ఫ్లోరైడ్ విముక్తి కోసం నల్లగొండ జిల్లాకుసాగు, తాగునీరు ఇవ్వాలని ప్రాజెక్టులు నిర్మించాలని డిమాండ్ చేస్తూ 483 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు. సార్వత్రిక ఎన్నికలతో పాటు జరుగాల్సిన నల్లగొండ పార్లమెంటు ఎన్నికలను అభ్యర్థులు ఎక్కువగా ఉండటంతో 3 నెలల పాటు వాయిదా వేసి జంబో బ్యాలెట్ ద్వారా ఎన్నికలు నిర్వహించి ప్రపంచాన్నే నల్లగొండ వైపు చూసే విధంగా చేశారు. అయితే వీటన్నింటికి భిన్నంగా ఈసా రి జరిగిన 2024 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి 5,59,906 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా దేశం మొత్తం నల్లగొండ వైపే చూసే విధంగా ఫలితాలను తీసుకురావడంలోజిల్లా ప్రజలకు దక్కుతుంది. పార్లమెంటు ఎన్నికలు ప్రారంభం 1952 తొలిసారి జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో సిపిఐ నాయకులు రావి నారాయణరెడ్డి 309,162 ఓట్లతో విజయం సాధించారు. తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ 2,33, 571 ఓట్లు రావడంతో తొలి పార్లమెంటు భవనాన్ని రావి నారాయణరెడ్డే ప్రారంభించడం జరిగింది. అదేవిధంగా 2014 ఎన్నికల్లో టిడిపిఅభ్యర్థితేరాచిన్నపరెడ్డిపై కాంగ్రెస్ అభ్యర్థి గుత్తా సుఖే oదర్‌రెడ్డి 1,93,156 ఓట్లతో విజయం సాధించారు. ఆ తరువాతఈ పార్లమెంటు ఎన్నికల్లోకాంగ్రెస్ అభ్యర్థి కుం దూరు రఘువీర్‌రెడ్డి 5,59,906 ఓట్ల మెజార్టీతో గెలుపొంది నాటి రావి నారాయణరెడ్డి మెజార్టీ కంటే భారీ మెజార్టీ సాధించారు. రావి నారాయణరెడ్డి కంటే అత్యధిక ఓట్లు సాధించాలనే లక్ష్యం తో పార్లమెంటు నియోజకవర్గ ఇం చార్జీ, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మరో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి,ఎంఎల్‌ఏలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, సిపిఐ, సిపిఎం శ్రేణు లు చేసిన కృషితోనే రఘువీర్‌రెడ్డి భారీ మెజార్టీ సాధించారు. అయితే నల్లగొండ జిల్లాలో గత మూడు సార్లు జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీనే విజయం సాధిస్తూ వచ్చింది. 2009,2014లో జరిగిన ఎ న్నికల్లో ఎంపిగా గుత్తా సుఖేందర్‌రెడ్డి కాంగ్రెస్ నుండి గెలుపొంది బిఆర్ఎస్‌లో చేరినప్పటికీ 2019 ఎంపి ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి ఉత్తమ్ కుమార్‌రెడ్డి విజయం సాధించారు. గత మూడు సార్లు జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించగా 2024లో కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి విజయం సాధించారు.

## పేకాటరాయుళ్ల అరెస్టు



**ప్రజాపక్షం/నందికొండః**పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి 7 మందిని అరెస్ట్ చేసిన ఘటన నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని స్థానిక పైలాన్ కాలనీలో చోటుచేసుకుంది.పట్టణ ఎస్ఐ సంపత్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం..మంగళవారం సాయంత్రం ఐదు గంటలకు నమ్మదగిన సమాచారం మేరకు పైలాన్ కాలనీ లో పేకాట గృహంపైదాడి చేసి కోప్పురి రమణ,షేక్ ఇమ్రాన్ భాష,దాసరి హనుమంతు,ఈర్ల రాంబాబు,ఈర్ల రాజశేఖర్, బండారు వెంకటేశ్వర్లు, వెంకటయ్య అను సదరు వ్యక్తులను అదుపులోకి తీసుకోవడం జరిగిందని, నాలుగు ద్విచక్ర వాహనాలను, రూ. 11,700 నగదు, 7 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు.

# నల్లగొండను కైవసం చేసుకున్న కాంగ్రెస్

రెండో స్థానంలో నిలిచిన బిజెపి..
మూడో స్థానంలో బిఆర్ఎస్
5,59,906 ఓట్లతో గెలుపొందిన రఘువీర్‌రెడ్డి



**ప్రజాపక్షం/నల్లగొండ ః** సార్వత్రిక ఎన్నికల్లో నల్లగొండ పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. ఎన్నికల కౌంటింగ్‌ను పట్టణ పరిధిలోని అనిశెట్టి దుప్పలపల్లి ఎఫ్‌సిఐ గోదాంలో మంగళవారం నిర్వహించారు. పార్లమెంటు నియోజకవర్గంలో 12,77,135 మంది ఓటర్లు తమ హక్కు వినియోగించుకోగా అట్టి ఓట్లను లెక్కించారు. 7 గోదాం హాళ్లలో 14 ఏర్పాటు చేసి 24 రౌండ్‌లలో ఓట్ల లెక్కింపు ప్రక్రియను కొనసాగించారు.ఈ ఓట్ల లెక్కింపులో మొదటి రౌండ్ గెలిచి చివరి 24 రౌండ్ల వరకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కుందూరు రఘువీర్ రెడ్డి మెజార్టీ పెంచుకుంటూ పోయారు. మొదట్లో బిఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి ఓట్లను సంపాదించుకున్నప్పటికీ 6వ రౌండ్ నుండి చివరి వరకు మూడవ స్థానానికే పరిమితమయ్యారు. అయితే అనూహ్యంగా బిజెపి అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి మాత్రం తమ ఓటు బ్యాంకు కంటే అత్యధికంగానే రఘువీర్‌రెడ్డి మొదటిస్థానంలోఉంటే సైదిరెడ్డి మాత్రం రెండవ స్థానంలో ఉంటూ ఓట్లను సాధించారు. అయితే కాంగ్రెస్ అభ్యర్థి రఘువీర్‌రెడ్డికి ఈవిఎంల ద్వారా 7,72,264 ఓట్లు రాగా పోస్టల్ బ్యాలెట్ ద్వారా 12,073 ఓట్లు రావడం జరిగింది. బిజెపి అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డికి 2,19,605 ఓట్లు రాగా పోస్టల్‌లో 4,826 మొత్తం 2,24,432 ఓట్లను సాధించారు. బిఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డికి 2,16,681 ఓట్లతో పాటు పోస్టల్‌లో 1,736 మొత్తం 2,18,415 ఓట్లు సాధించగా 5,869 మంది ఓటర్లు నోటాకు ఓటేశారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియను ఎన్నికల పరిశీలకులు మనోజ్ కుమార్ మాణిక్‌రావు సూర్యవంశీ, ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ దాసరిహరిచందనతోపాటు సూర్యాపేట కలెక్టర్ వెంకట్రావు, అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర పర్యవేక్షించారు.



## అభివృద్ధి చేసి చూపిస్తాం : కోమటిరెడ్డి

**ప్రజాపక్షం/నల్లగొండ ః** పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రఘువీర్‌రెడ్డిని 5.59 లక్షల పై చిలుకు భారీ మెజార్టీతో గెలిపించిన ప్రజలకు రాబోయే రోజుల్లో అభివృద్ధి చేస్తామని రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ఎన్నికల ఫలితాల కౌంటర్ వద్ద కోమటిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ భారీ మెజార్టీతో నల్లగొండలో రఘువీర్‌ను, భువనగిరిలో 2 లక్షల పై చిలుకు మెజార్టీతో చామల కిరణ్ రెడ్డిని గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ప్రతి ఒక్కటి అమలుచేసి తీరుతామన్నారు. రాష్ట్రంలో 9 నుంచి 12 స్థానాలు కాంగ్రెస్ విజయం సాధిస్తుందని ఆశించామన్నారు. నల్లగొండలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు చేసిన కష్టం వెలకట్టలేనిదన్నారు. సీనియర్ నాయకులు, మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి మాట్లాడుతూ రఘువీర్ రెడ్డి గెలుపుకోసం కృషి చేసిన పార్టీ శ్రేణులు, కమ్యూనిస్టు పార్టీ శ్రేణులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు ఎంత మెజార్టీతో గెలిపించారో అంత మేరకు తన కుమారుడు రఘువీర్ జిల్లా అభివృద్ధి కోసం కృషి చేస్తాడని హామీ ఇచ్చారు.



ఎంఎల్‌ఏలు బాలు నాయక్, బిఎల్ఆర్, జయవీర్ రెడ్డి, డిసిసి అధ్యక్షులు శంకర్ నాయక్ ,మున్సిపల్ చైర్మన్‌బుర్రిశ్రీనివాస్‌రెడ్డి, పట్టణాధ్యక్షులు గుమ్మల మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులున్నారు.

### రుణపడి ఉంటా ః రఘువీర్

**నల్లగొండః** సార్వత్రిక ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రం లోనే నల్లగొండ పార్లమెంటు నియోజకవర్గంలో తనకు భారీ మెజార్టీ ఇచ్చి గెలిపించిన ప్రజలకు, తన గెలుపుకు అహర్నిశలు కష్టపడి పనిచేసిన పార్టీ శ్రేణులకు రుణపడి ఉంటానని ఎంపి కుందూరు రఘువీర్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ఫలితాల అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న డిండి, బ్రాహ్మణ వెల్లెంల ప్రాజెక్టుల పూరి కోసం కృషి చేస్తానన్నారు.

## కౌంటింగ్ కేంద్రం ముఖం చూడని బిజెపి, బిఆర్ఎస్

**ప్రజాపక్షం/భువనగిరిరూరల్ :** పార్లమెంటు ఎన్నికలలో భాగంగా మంగళవారం భువనగిరి పట్టణ శివారులో ఉన్న అరోరా ఇంజనీరింగ్ కళాశాలలో కౌంటింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఉదయం ఎనిమిది గంటల వరకు భువనగిరి పార్లమెంటు స్థానానికి పోటీ చేసిన వివిధ పార్టీల అభ్యర్థులు ఎవరు కూడా కౌంటింగ్ కేంద్రానికి రాలేదు. ప్రధానంగా బిజెపి అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్య గౌడ్, టిఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేష్ కౌంటింగ్ కేంద్రానికి రావాల్సి ఉండగా ఎవరూ రాలేదు. ఏజెంట్లు, నాయకులు విస్మయానికి గురయ్యారు. కాంగ్రెస్ పార్టీకి అత్యధిక మెజార్టీ పెరుగుతుండడంతో ఉదయం 11 గంటలకు కౌంటింగ్ కేంద్రంలో కూర్చున్న పలు పార్టీల ఏజెంట్లు, నాయకులు బయటికి వెళ్లిపోయారు. బయటకు వచ్చిన వారు తమ పార్టీలకు వచ్చిన ఫలితాలను చూసి అనుకున్న ఓట్ల కంటే మెజార్టీ ఓట్లు కూడా రాకపోవడంతో నిరాశచెందారు. గెలుస్తామనే ఆశతో వచ్చిన నాయకులు, ఏజెంట్లు తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు.

# అణచివేత, అత్యాచారాలకు వ్యతిరేక పోరాటం

ఎన్ఎఫ్ఐడబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు
కిన్నెర మల్లవ్వ




**ప్రజాపక్షం/కరీంనగర్‌ప్రతినిధిః**సమాజంలో అణచివేతకు, అత్యాచారాలకు, హత్యలకు, అవమానాలకు వ్యతిరేకంగా మహిళలంతా ఐక్యంగా ఉండి పోరాటాలు నిర్వహించాలనిభారతజాతీయ మహిళా సమాఖ్య ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు కిన్నెర మల్లవ్వ పిలుపునిచ్చారు. మంగళవారం కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్ వద్ద భారత జాతీయ మహిళా సమాఖ్య 70వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన మహిళా సమాఖ్య పతాకాన్ని మల్లవ్వ ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత జాతీయ మహిళా సమాఖ్య 1954లో ఆవిర్భవించిందని, అప్పటి నుంచి నేటి వరకు సమాజంలో ఎక్కడ మహిళలకు అన్యాయం జరిగినా వారికి అండగా పోరాడుతుందన్నారు. మహిళలు అనేక రంగాల్లో తమ ప్రతిభను నిరూపించుకునేందుకు సమాజంలో ముందుకు వస్తున్నారని, వారందరికీ పాలక ప్రభుత్వాలు సామాజిక ఆర్థిక, రాజకీయ రంగంలో పెద్దపీట వేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నేటికీ సమాజంలో మహిళలపై అనేక అత్యాచారాలు, లైంగిక వేదింపులు, వరకట్న వేదింపులు జరుగుతున్నాయని, మహిళల రక్షణ కోసం పాలకవర్గాలు కఠినమైన చట్టాలను తీసుకువచ్చి అండగా నిలవాలని కోరారు. అన్ని రంగాల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలని, భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకోవాల్సిన బాధ్యత మహిళలపై ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో భారత మహిళా సమాఖ్య జిల్లా గౌరవ అధ్యక్షురాలు గూడెం లక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శి కొట్టె అంజలి, నాయకురాళ్లు కేతవ్వ, రజిత, స్వప్న, భారతి, మమత తదితరులున్నారు.

## ధ్రువీకరణ పత్రం అందుకున్న కడియం కావ్య

అభినందించిన మంత్రి సురేఖ, ఎమ్మెల్యేలు,మేయర్



**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసిన డాక్టర్ కడియం కావ్య భారీ మెజార్టీతో గెలుపు పొందారు. కాగా కడియం కావ్యకు ఎన్నికల్లో 98,145 ఓట్లు రాగా 54,425 మెజార్టీతో గెలుపొందారు. మంగళవారం వరంగల్ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, ఎన్నికల అధికారులు ఫామ్. 22 ధృవీకరణ పత్రాన్ని కావ్యకు అందచేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అటవీ, పర్యాటక, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కడియం శ్రీహరి, నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణరావు, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ తదితరులు పాల్గొన్నారు.

## మహిళల రక్షణకు కొత్త చట్టాలు రావాలి

ఎన్ఎఫ్ఐడబ్ల్యు జిల్లా కార్యదర్శి సుగుణ



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** దేశంలో మహిళలపై ఇంకా వివక్ష కొనసాగుతుందని, దాడులు హత్యాచారాల పై ఈ ప్రభుత్వాలు కొత్త చట్టాలను తెచ్చి దోషులను కఠినంగా శిక్షించాలని భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) జిల్లా కార్యదర్శి కొరిమి సుగుణ డిమాండ్ చేశారు. మంగళవారం రోజున మహిళా సమాఖ్య 70వ వార్షికోత్సవం సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు పొన్నగంటి లావణ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. స్థానిక జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎఐటియుసి కొమురయ్య భవన్‌లో జెండా ఆవిష్కరణ చేసి ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుగుణ మాట్లాడుతూ, దేశంలో మహిళల పట్ల ఏర్పడినటువంటి చులకన భావాన్ని అసమానతలను తొలగించి సమానత్వాన్ని శాంతిని, అభివృద్ధిని, సాధించాలనే ధ్యేయంతో జూన్ 6 1954లో భారత జాతీయ మహిళా సమాఖ్య ఏర్పడిందని సుగుణ అన్నారు. దేశంలో ఇంకా మహిళలను చిన్నచూపు చూస్తున్నారని చట్టసభల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని పేర్కొన్నారు. మతోన్మాద పార్టీలో పాలనలో మహిళలు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మహిళలపై పసిపిల్లలు హింస పెరిగిపోయిందని దీనికి ఉదాహరణ మణిపూర్ ఘటన అని గుర్తు చేశారు. మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ దేవుడి పేరుమీద ఓట్లు దండుకుంటున్న బీజేపీని మతతత్వ విధానాలను ఎండగట్టాలని అన్నారు. ఇప్పటికైనా ఈ ప్రభుత్వాలు మహిళల పట్ల జరుగుతున్న దాడులు అత్యాచారాలపై కఠిన శిక్షలు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు పొన్నగంటి లావణ్య, పెద్దమాముల సంధ్య, బొల్లి లావణ్య, పద్మ, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్‌ల ద్వారా కేసులను పరిష్కరించుకోవాలి



**ప్రజాపక్షం/ములుగు జిల్లా ప్రతినిధి:** లోక్ అదాలత్‌ల ద్వారా పరిష్కరించుకోదగు కేసులను పరిష్కరించుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి కన్నయ్యలాల్ తెలిపారు.మంగళవారం జాతీయ, రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థల ఆదేశాలను అనుసరించి ములుగు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను ములుగు జిల్లా కోర్టులో నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారని కక్షిదారులు తమ కేసులను రాజీ కుదుర్చుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో రాజీపడదగు క్రిమినల్, సివిల్ కేసులు, భూ తగాదాల కేసులు, మోటార్ వెహికల్, యాక్సిడెంట్ కేసులు, వివాహ, కుటుంబ తగాదా కేసులు, బ్యాంక్, చెక్ బౌన్స్, ఎలక్ట్రిసిటీ, చిట్ ఫండ్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కేసులు, ఇన్సూరెన్స్ కేసులు, ఎక్సైజ్ కేసులు వంటి, ఇతర రాజీపడదగు కేసులను ఇరు పక్షాల అంగీకారంతో పరిష్కరించుటకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌లో రాజీపడదగు కక్షిదారులు తమ తమ కేసుల వివరాలను సంబంధిత కోర్టులలో తెలియజేసి రాజీ కుదుర్చుకుని కోర్టుల చుట్టు తిరగకుండా ప్రశాంతమైన జీవనాన్ని కొనసాగించాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న కేసులను పరిష్కరించుటకు 3 బెంచీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ జాతీయ లోక్ అదాలత్ విజయవంతం చేయడంలో వివిధ జిల్లాల పోలీస్ అధికారులు, ప్రభుత్వ శాఖల అధికారులు, న్యాయవాదుల పాత్ర, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా పాత్ర అనిర్వచనీయం, లోక్ అదాలత్‌ల పట్ల ఎటువంటి సలహాలకైనా, సందేహాలకైన, ఏదేని న్యాయ సహాయంకు అయినను న్యాయ సేవాధికార సంస్థను ఆశ్రయించి ఉచిత న్యాయ సలహాలు, సూచనలు పొందాలని తెలిపారు.

## పాపన్నపేటలో కాంగ్రెస్ పార్టీ ఆధిక్యం

ఎన్నికల్లో అనూహ్యంగా పెరిగిన బిజెపి

**ప్రజాపక్షం/పాపన్నపేట :** పార్లమెంటు ఎన్నికల ఫలితాలు మంగళవారం వెల్లడి కాగా మండలంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నీలం మధుకు 13,281 ఓట్లు , బిజెపి పార్టీ రఘునందన్ రావుకు 9.711 ఓట్లు, బిఆర్ఎస్ పార్టీ వెంకట్రాం రెడ్డికి 8514 ఓట్లు వచ్చాయి. మండల కేంద్రమైన పాపన్నపేటతో పాటు యూసుఫ్ పేట, బాచారం, శేరిపల్లి, కొత్తపల్లి, చికోడ్, నార్సింగి, దౌలాపూర్, గ్రామాలలో బిజెపి పార్టీకి ఆధిక్యం రాగా, రామతీర్థం, ఎనకపల్లి, కోడుపాక, గ్రామాలలో బిఆర్ఎస్ పార్టీ అత్యధిక ఓట్లు సంపాధించింది. సీత నగరం గాజుల గూడెం, చిత్రియాల్, అబ్లాపూర్, అన్నారం, లక్ష్మీ నగర్, నాగసన్ పల్లి, పోడ్చన్‌పల్లి, పొడ్చన్‌పల్లి తండా, గాంధరిపల్లి, జయపురం, కొంపల్లి, కొత్త, పాత లింగయ పల్లి, మల్లంపేట, కందిపల్లి, అరికెల, తమ్మయ పల్లి, నర్సింగ్ రావు పల్లి తండా, నామాపూర్, మిన్పూర్, ముద్దాపూర్, కుర్తివాడ గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ మెజార్టీ ఓట్లను సంపాధించింది. అసెంబ్లీ ఎన్నికల్లో కొన్ని బూతులలో ఖాతా తెరవని బిజెపి పార్టీ పార్లమెంట్ ఎన్నికల్లో మండలంలో ద్వితీయ స్థానంలో నిలిచింది. ద్వితీయ స్థానంలో ఉన్న బిఆర్ఎస్ పార్టీ తృతీయ స్థానం చేరుకుంది. కాంగ్రెస్ పార్టీ యధావిధిగా మండలంలో అధికంగానే ఉంది. మెదక్ ఎంపీ బిజెపి అభ్యర్థి రఘునందన్ రావు గెలుపు కోసం పని చేసిన ప్రతి ఒక్కరికి బిజెపి నాయకులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## కాంగ్రెస్ నేతల సంబరాలు

**ప్రజాపక్షం/తరిగొప్పుల:** భువనగిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఎంపిగా భారీ మెజార్టీతో గెలిచినందుకు తరిగొప్పుల కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. బాణాసంచా పేల్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువ నేత చామల కిరణ్‌కుమార్ రెడ్డితో అభివృద్ధి సాధ్యపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చిలువేరు సంపత్, బృంగి శివకుమార్, పలుచని రమేష్, ఏడెల్లి శ్రావణ్‌రెడ్డి, పింగళి ఇంద్రారెడ్డి, పండుగ కనకయ్య, మామిడాల రాజశేఖర్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



# రెండుగా చీలిన తెలంగాణ ఓటర్లు

ఉత్తరం బిజెపికి, దక్షిణం కాంగ్రెస్‌కు



**ప్రజాపక్షం/ ఖమ్మం :** తెలంగాణ పార్లమెంటు ఎన్నికల సందర్భంగా తెలంగాణ ఓటర్లలో ప్రాంతీయ వైవిధ్యం కనిపించింది. తెలంగాణ ఓటర్లు రెండు పాయలుగా చీలి రెండు పార్టీలకు మద్దతుగా నిలిచారు. ఉత్తర తెలంగాణ బిజెపికి దన్నుగా నిలిస్తే దక్షిణ తెలంగాణ కాంగ్రెస్‌కు అండగా నిలిచింది. దక్షిణ తెలంగాణలోని మహబూబ్‌నగర్, వరంగల్, నల్గొండ, ఖమ్మం జిల్లాల్లో రికార్డు మెజార్టీలతో కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించారు. వరంగల్, నల్గొండ, మహబూబాబాద్, ఖమ్మం, భువనగిరి, నాగర్ కర్నూల్, జహీరాబాద్‌లో కాంగ్రెస్ అభ్యర్థులు రికార్డు మెజార్టీ సాధించారు. నల్గొండలో కాంగ్రెస్ అభ్యర్థి కుందురు రఘువీర్ రెడ్డి ఐదు లక్షల పైచిలుకు మెజార్టీ సాధించి రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలిచారు. ఖమ్మంలో సైతం దశాబ్దాల రికార్డు బద్దలైంది. ఇప్పటి వరకు 17 సార్లు జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో ఎవరికి ఎప్పుడు రాని మెజార్టీని కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డి సాధించారు. మహబూబాబాద్‌లో సైతం కాంగ్రెస్ అభ్యర్థికి వచ్చిన మెజార్టీ రికార్డు మెజార్టీనే. బలరాం నాయక్ సుమారు రెండు లక్షల ఓట్లు సాధించి మహబూబ్ నగర్ పార్లమెంటు చరిత్రలో కొత్త రికార్డును నమోదు చేశారు. వరంగల్‌లో కడియం కావ్య, భువనగిరిలో చామల కిరణ్‌కుమార్ రెడ్డి రికార్డు మెజార్టీలతో విజయం సాధించారు. ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల్లో కాంగ్రెస్‌కు ఏకపక్షంగా ఓట్లు పడ్డాయి. ఇదే సందర్భంలో కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్, హైదరాబాద్, రంగారెడ్డిలో బిజెపి ఏక పక్ష విజయాలను సాధించింది. ఆది నుంచి అందరి దృష్టిని ఆకర్షించిన కరీంనగర్ స్థానం నుంచి బండి సంజయ్ 2.20 లక్షల ఓట్ల పైచిలుకు మెజార్టీని సాధించి మరోసారి చర్చనీయాంశమయ్యారు. వార్త ల్లో వ్యక్తిగా నిలిచే నిజామాబాద్ ఎంపి ధర్మపురి అరవింద్ సైతం లక్షకు పైగా ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. చేవెళ్లలో కొండా విశ్వేశ్వరరెడ్డి గెలుపొందగా మల్కాజ్‌గిరిలో బిజెపి నేత ఈటల రాజేందర్ రికార్డు విజయాన్ని నమోదు చేశారు. మెదక్ నియోజకవర్గం తొలి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ సొంత నియోజక వర్గం కావడం, బిఆర్ఎస్ ఆవిర్భావం తర్వాత ఇక్కడ మరోపార్టీ గెలువక పోవడం సర్వేలు సైతం బిఆర్ఎస్‌కే గెలుపు అవకాశాలు ఉన్న ఏకైక నియోజక వర్గంగా పేర్కొనడంతో అందరి దృష్టి మెదక్‌పై పడింది. కానీ అనూహ్యంగా మెదక్ నుంచి రఘునందన్ రావు గెలుపుపొందారు. మహబూబ్ నగర్ జిల్లాలో రెండు పార్లమెంటు నియోజక వర్గాలు ఉంటే మహబూబ్ నగర్ నుంచి బిజెపి అభ్యర్థిగా పోటీ చేసిన డికె అరుణ గట్టి పోటీని ఎదుర్కొని స్వల్ప మెజార్టీతో విజయం సాధించారు. మహబూబ్ నగర్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత జిల్లా కావడం కాంగ్రెస్ నాయకులు వంశీ చందర్‌రెడ్డి ఇక్కడి నుంచి పోటీ చేయడం రాష్ట్ర వ్యాప్త చర్చకు దారి తీసింది. కాని బిజెపియే ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. ఇదే జిల్లాలోని నాగర్ కర్నూల్ నుంచి పోటీ చేసిన ఖమ్మం వాసి మల్లు రవి విజయం సాధించారు. గతంలో ఆయన ఇక్కడి నుంచి పార్లమెంటుకు ప్రాతినిధ్యం వహించారు. సికింద్రాబాద్‌లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విజయం సాధించినప్పటికీ ప్రజల్లో ఆయన పట్ల అంతగా సానుకూలత లేదని ఫలితాలు రుజువు చేశాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పెద్దపల్లిలో కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీ విజయం సాధించారు. ఆదిలాబాద్ ఎప్పటి లాగానే బిజెపికి దన్నుగా నిలిచింది. మొత్తంగా తెలంగాణలోని దక్షిణ ప్రాంత ఓటర్లు కాంగ్రెస్‌కు పట్టం కడితే ఉత్తర తెలంగాణ ఓటర్లు బిజెపికి పట్టం కట్టారు. ఉత్తర, దక్షిణ తెలంగాణ ప్రజలు మాత్రం బిఆర్ఎస్‌కు మొండి చేయి చూపారు. దక్షిణ తెలంగాణలో రెండవ స్థానంలో నిలవగా చాలా చోట్ల మూడో స్థానానికి బిఆర్ఎస్ పడిపోయింది. బిఆర్ఎస్ ఘోర ఓటమి తర్వాత ఇప్పుడు ఆ పార్టీ భవిష్యత్తు పై సర్వత్రా చర్చ సాగుతుంది.

## ఎల్లంకి లక్ష్మీనారాయణ ఆశయాలను సాధిస్తాం

సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు శ్రీనివాస్



**ప్రజాపక్షం/ గార్ల :** సిపిఐ మాజీ మండల కార్యదర్శి ఎల్లంకి లక్ష్మి నారాయణ కల అయినటువంటి రాంపురం ఏటిపై హైలెవల్ వంతెన నార్మాణాన్ని సాధించి ఆయన ఆశయాన్ని నెరవేరుస్తామని సిపిఐ రాష్ట కమిటి సభ్యుడు మండల వైస్ ఎంపిపి కట్టెబోయిన శ్రీనివాస్ అన్నారు. సిపిఐ మాజీ మండల కార్యదర్శి కామ్రేడ్ ఎల్లంకి లక్ష్మి నారాయణ నాలుగవ వర్ధంతి సందర్భంగా గార్ల పాకాల ఏటి ఒడ్డున గల ఆయన స్మారక స్తూం పం వద్ద మంగళవారం సిపిఐ ఆధ్వర్యంలో ఆ యన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపిపి కే.శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారానికై అహర్నిషలు పోరాడిన గొప్ప నాయకులు ఎల్లంకి అని, ఆయన మరణం సిపిఐ మండల పార్టీకి తీరని లోటని అన్నారు. సిపిఐ మండల కార్యదర్శి జంపాల వెంకన్న , సింగు రమేష్ , దార్ల నగేష్ ,గుండ్ల సుధాకర్ రెడ్డి,ఎల్లంకి లాలు ,ఎల్లంకి సరిత, గుండ్ల ఉపెందర్ రెడ్డి ,వెంకట నర్సమ్మ తదితరుతు పాల్గోన్నారు.

## 144 సెక్షన్

ములుగు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

**ప్రజాపక్షం/ములుగు జిల్లా ప్రతినిధి :** మహబూబాబాద్ పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉంటుందని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. ములుగు జిల్లా పరిధిలో శాంతి కాపాడడం కోసం, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే సంఘటనలను నివారించడానికి, మహబూబాబాద్ పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపు దృష్ట్యా ఈ నెల 4 ఉదయం 6 గంటల నుండి 5వ తేదీ ఉదయం 6 గంటల వరకు ములుగు జిల్లా వ్యాప్తంగా ఐదుగురు కంటే ఎక్కువ మంది వ్యక్తులు సమావేశాన్ని నిషేధించడం జరిగిందని తెలిపారు. 144 సెక్షన్ అమలులో ఉన్న సమయంలో చట్టవిరుద్ధమైన సమావేశాలపై పూర్తి నిషేధం, బహిరంగసభల నిర్వహణపై నిషేధం ఉంటుందని పేర్కొన్నారు. ఈ ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోబడతాయని కలెక్టర్ తెలిపారు.



# లౌకికవాదానికి కేంద్ర ప్రభుత్వం గొడ్డలి పెట్టు

మోదీవి దిగజారుడు రాజకీయాలు

సిపిఐ జాతీయ కార్యదర్శి కే.నారాయణ



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** భిన్న సంస్కృతుల సమ్మేళనంతో ముడిపడి ఉన్న లౌకికవాదాన్ని బలపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం గొడ్డలిపెట్టుగా మారిందని సీపీఐ జాతీయ కార్యదర్శి కే.నారాయణ విమర్శించారు. ఇటీవల అమెరికాలో రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడిన యాదగిరిగుట్ట యాదగిరిపల్లికి చెందిన గుండ్ల సౌమ్య కుటుంబాన్ని మంగళవారం పరామర్శించి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం ఆయన మాట్లాడారు. దేశంలో లౌకికవాదం, రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకంగా దిగజారుడు పద్ధతి మోదీ అవలంబించారని మండిపడ్డారు. భారతదేశంలో చోటు చేసుకుంటున్నా రాజకీయ పరిణామాలను ప్రజలు గమనించాలన్నారు.

**విదేశీ ప్రభుత్వాలపై పాలసీ కోసం ఒత్తిడి చేయాలి**

విదేశాలలో మరణించిన విద్యార్థుల కు పాలసీ వర్తించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అక్కడి ప్రభుత్వం పై ఒత్తిడి తేవాలని ఆయన డిమాండ్ చేశారు. అక్కడి ఆర్థిక వ్యవస్థ కొండపడి ఉద్యోగాలు కోల్పోయి సతమవుతమవుతున్నారన్నారు. సౌమ్య మృతికి అమెరికాలోని తన మిత్రులకు రాష్ట్ర ప్రభుత్వానికి తక్షణమే స్పందించాలని లేఖ రాసినట్లు వివరించారు. అక్కడి తెలుగు వారందరూ వాలంటరీలుగా మానవతా దృక్పథంతో సహకరించారన్నారు. వీసా అనుమతి పొందిన తర్వాత అమెరికా ప్రభుత్వం పూర్తి బాధ్యత ఉండాలన్నారు. అందుకోసం విదేశాల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి అక్కడి ప్రభుత్వం అన్ని విధాల ఆదుకునేందుకు తగిన చర్యలు తీసుకొని అనాధలుగా మారకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకోవాలని ఆయన కోరారు. సౌమ్య కుటుంబాన్ని పరామర్శించిన వారిలో సీపీఐ జాతీయ కమిటీ సభ్యుడు పల్లా వెంకటరెడ్డి, యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు సహాయ కార్యదర్శి పోలేదని సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ . నాయకులు కొల్లూరు రాజయ్య బండి జంగమ్మ వేషాల అశోక్ కళ్ళపల్లి మహేందర్ పేరబోయిన మహేందర్ బబ్బురి శ్రీధర్ రాయగిరి బాలకృష్ణ ఆరె పుష్ప మూలకుంట్ల నరసమ్మ మద్దూరు భాగ్యమ్మ పుట్ట రమేష్ అన్యబోయిన వెంకటేష్ మహేష్ నాయకులు ఉన్నారు.

**ఉప్పల సాలయ్య కుటుంబానికి పరామర్శ**



**ఆత్మకూర్ (యం):** మండలంలోని కూరేళ్ళ గ్రామంలో ఉప్పల సాలయ్య (95)మృతి చెందగా సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె నారాయణ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పల్లా వెంకటరెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు వారి కుటుంబ పరామర్శించారు. సాలయ్య కుమారులు ఉప్పల ముత్యాలు వారి కుటుంబ సభ్యులకి మనోధైర్యాన్ని కల్పించారు. తెలంగాణ భూ పోరాటంలో సిపిఐ పార్టీకి సాలయ్య సహకారం అందించే వారని గుర్తు చేశారు. వారి కుమారుడు ఉప్పల ముత్యాలు జిల్లా కార్యవర్గ సభ్యులుగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులుగా పనిచేయుచున్నారు.కుమారులు కుటుంబ సభ్యులు అంకితభావంతో పార్టీలో కొనసాగుతున్నారని అన్నారు . వారి వెంట సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శిలు యానాల దామోదర్ రెడ్డి, బోలగొని సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు చెడచంద్రయ్య, ఏషాల అశోక్,కల్లెం కృష్ణ,పాసికంటి లక్ష్మీ నరసయ్య,సిపిఐ మండల కార్యదర్శిలు జల్ది రాములు, అన్నపు వెంకటేష్, అన్నేమైన వెంకటేష్, మారుపాక వెంకటేష్, బబ్బూరి శ్రీధర్,సాలిగంజి పాల్గొన్నారు.

## బండి గెలుపుతో బిజెపి శ్రేణుల సంబరాలు



**ప్రజాపక్షం/భీమదేవరపల్లి:** కరీంనగర్ ఎంపిగా బండి సంజయ్ రెండు లక్షలకు 25వేలకు పైగా మెజారిటీతో గెలుపొందడంతో బిజెపి శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ములుకనూరులో బిజెపి మండల అధ్యక్షుడు పైడిపల్లి పృథ్వీరాజ్ ఆధ్వర్యంలో స్వీట్లు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బండికి భారీ మెజారిటీ కట్టబెట్టిన నియోజకవర్గం ఓటర్లకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు దొంగల కొమురయ్య, జిల్లా కార్యదర్శి మాచర్ల కుమారస్వామి, నాయకులు ఊసకోయిల కిషన్, శ్రీమోజు శ్రీనివాస్, అంబీర్ కవిత, అయిత సాయి తదితరులు పాల్గొన్నారు.

# సమసమాజం కోసం రావి నారాయణరెడ్డి కృషి

సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి



**ప్రజాపక్షం/హన్మకొండ ప్రతినిధి :** సమసమాజం కోసం రావి నారాయణ రెడ్డి కృషి చేశారని సిపిఐ హన్మకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి అన్నారు. మంగళవారం హన్మకొండ బాలసముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో తెలంగాణ సాయుధ పోరాట యోదుడు రావి నారాయణ రెడ్డి 118వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా రావి నారాయణ రెడ్డి చిత్రపటానికి సిపిఐ నాయకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి మాట్లాడుతూ తెలంగాణలో నైజంనిరంకుశ పాలనకు వ్యతిరేఖంగా సాయుధ పోరాటానికి రావి నారాయణ రెడ్డి పిలుపునిచ్చారని, భూస్వామ్య కుటుంబంలో పుట్టి కూడా పేదల కోసం పోరాడారని అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో పది లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచారని అన్నారు. నడు జరిగిన పార్లమెంట్ ఎన్నికలలో నెహ్రూ కంటే ఎక్కువ మెజారిటీ సాధించి చరిత్ర పుటలలోకి ఎక్కారని, అలాగే కొత్త గా నిర్మించిన పార్లమెంట్ భవనాన్ని ప్రారంభించారని అన్నారు. రావి నారాయణ రెడ్డి ఆశయాలను ప్రజలలోకి తీసుకెళ్లి ప్రజలను చైతన్యం చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, నాయకులు మునిగాల బిక్షపతి, బాషబోయిన సంతోష్, వేల్పుల సారంగపాణి, కొట్టె వెంకటేష్,చరణ్ తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ ఓటమి స్వయం కృతాపరాధమా?





**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మం పార్లమెంటు పరిధిలో బిఆర్ఎస్ ఘోర ఓటమికి ఆ పార్టీయే నైతిక బాధ్యత వహించాల్సి ఉంటుంది. ముఖ్యంగా బిఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో నిలిచిన నామ నాగేశ్వరరావు తీరు ఆ పార్టీ క్యాడర్‌ను తీవ్ర నైరాశ్యానికి గురి చేసింది. అభ్యర్థిత్వం ప్రకటించిన చాలా రోజుల పాటు నియోజక వర్గానికి రాకపోవడం, కాంగ్రెస్ అభ్యర్థి ఎంపిక విషయంలో తలమునకలవుతున్న బిఆర్ఎస్ ప్రచారాన్ని నిర్వహించకపోవడం ఆ పార్టీ కార్యకర్తల్లో గందరగోళానికి, నిరాశకు దారి తీసింది. నామినేషన్ ప్రక్రియ తర్వాత కూడా నియోజక వర్గ ఇంచార్జిలకు ఆర్థిక సహకారం అందించక పోవడంతో చాలా మంది మొక్కుబడి ప్రచారానికే పరిమితమయ్యారు. చేతి నుంచి ఖర్చు పెట్టుకుని ప్రచారం చేసే స్థాయిలో తాము లేమంటూ పలువురు బిఆర్ఎస్ నేతలు బహిరంగంగా వ్యాఖ్యానించడం గమనార్హం. ఓటర్లకు కాంగ్రెస్ పార్టీ డబ్బుల పంపిణీ చేసినా ఖమ్మం, కొత్తగూడెం నియోజక వర్గాలలో బిఆర్ఎస్ కనీసం ఆ దిశగా ఆలోచన చేయకపోవడం మిగిలిన నియోజక వర్గాలలో చేసినా పూర్తి స్థాయిలో చేయకపోవడం బిఆర్ఎస్‌కు ఈ ఫలితం వచ్చేందుకు కారణమయ్యాయి. నామ నాగేశ్వరరావు వ్యక్తిగత ఈమేజ్ కాని కుల సమీకరణ కాని ఈ ఎన్నికల్లో కలిసి రాలేదు. ఓటర్లందరూ గంప గుత్తగా కాంగ్రెస్ వైపు మళ్లారు. కొన్ని చోట్ల కాంగ్రెస్ నాయకత్వం పై వ్యతిరేకత వ్యక్తమైనా కాంగ్రెస్ అధికారంలో ఉండడం త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో బిఆర్ఎస్ వైపు ఓటర్లు చూడలేదు. కాంగ్రెస్ గెలుపు ఊహించిందే అయినా కాంగ్రెస్‌కు ఈ స్థాయిలో రికార్డు మెజార్టీ రావడానికి మాత్రం ఖచ్చితంగా బిఆర్ఎస్ అభ్యర్థి వైఫల్యమే కారణంగా చెప్పవచ్చు. ఎంపి వద్దిరాజు రవిచంద్ర, సండ్ర వెంకట వీరయ్య లాంటి కొందరు బిఆర్ఎస్ నేతలు చురుకుగా వ్యవహరించినా ఆశించిన ఫలితం దక్కలేదు.

## ఈదురు గాలుల బీభత్సం



**ప్రజాపక్షం/మల్హర్ :** మండలంలోని మల్లారం, చిన్న తూండ్లతో పాటు పలు గ్రామాల్లో మంగళవారం మధ్యాహ్నం ఈదురు గాలులు బీభత్సాన్ని సృష్టించాయి. ఈదురు గాలుల వల్ల మల్లారంలో నాల్గు స్తంబాలు విరిగి పోయాయి. బలమైన ఈదురు గాలుల వల్ల తాడిచర్ల, మల్లారం ప్రధాన రహదారిపై చెట్టు పడీ పోయాయి. మల్లారం రోడ్డు పై స్తంబాలు పడటంతో కాసేపు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. మల్లారం గ్రామానికి చెందిన సృజన్, చిన్నతూండ్ల గ్రామానికి చెందిన నక్క లక్ష్మయ్య ఇంటి పై కప్పు రేకులు గాలి బీభత్సానికి ఎగిరిపోయాయి. తాడిచర్ల కొనుగోలు కేంద్రంలో వరి ధాన్యం, తూకం వేసిన బస్తాలు తడిసిపోయాయి. ఈదురు గాలులకు ఇంటి పై కప్పు రేకులు లేచి నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

# భువనగిరి, వరంగల్‌లో కాంగ్రెస్ హవా

భారీ మెజారిటీ ఇచ్చిన జనగామ జిల్లా ఓటర్లు



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి :** భువనగిరి, వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ హవా కొనసాగింది. జనగామ జిల్లాలోని మూడు నియోజకవర్గాలు భారీగా మెజార్టీ ఇచ్చాయి. ముందు ఊహించినట్లుగానే బిజెపి రెండో స్థానంలో ఉండగా బిఆర్ఎస్ మూడో స్థానానికి పరిమితమైంది. భువనగిరి పార్లమెంట్‌లో జనగామ నియోజకవర్గం ఉండగా భారీ మెజార్టీ లభించింది. మొదటి నుండి అనుకున్నట్లే అత్యధికంగా జనగామ నియోజకవర్గం నుండి కాంగ్రెస్‌కు పోలయ్యాయి. ఇక స్టేషన్‌ఘనపూర్,పాలకుర్తి నియోజకవర్గాలు వరంగల్ పార్లమెంట్‌లో ఉండగా ఆ నియోజకవర్గాల్లోనే కాంగ్రెస్ ఆధిక్యత ప్రదర్శించింది. వరంగల్ అభ్యర్థి మొదటి రౌండ్‌లో వెనకబడగా ఆ తరువాత రౌండ్ నుండి దూసుకుపోయారు. వరంగల్‌లో కడియం కావ్యకు రెండు లక్షలకు పైగా మెజార్టీ రాగా భువనగిరిలోనూ చామల కిరన్‌కుమార్‌రెడ్డికి రెండు లక్షలకు పైగా మెజార్టీ వచ్చింది. అయితే వీరి అంచనాలు తలకిందులయ్యాయి. వరంగల్ అభ్యర్థి కడియం కావ్య సుమారు 50వేల పై చిలుకు ఓట్లతో గెలిచే అవకావాలు ఉన్నట్లు ప్రచారం జరిగింది. భువనగిరి అభ్యర్థి లక్షకు పైగా ఓట్ల మెజార్టీ సాధిస్తారని ముందు నుండే ప్రచారం జరిగింది. అయితే దానికి భిన్నంగా ఇద్దరి మెజార్టీ రెండు లక్షలకు పైగా పెరిగింది. దీనితో వరంగల్, భువనగిరి ఓటర్లు పూర్తిగా కాంగ్రెస్ వైపు మొగ్గు చూపారని చెప్పాలి. భువనగిరిలో కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరన్‌కుమార్‌రెడ్డి కి 6లక్షల 23వేల పై చిలుకు పోట్లు పోలవగా బిజెపి అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌కు 4లక్షల ఒక వెయ్యికి పైగా ఓట్లు పోలయ్యాయి. ఇక బిఆర్ఎస్ అభ్య ర్థి క్యామ మల్లేశంకు 2లక్షల 56వేలకు పైగా ఓట్లు పోలయ్యాయి. బిజెపి, బిఆర్ఎస్‌కు పోలైన ఓట్లు కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరన్‌కుమార్‌రెడ్డితో పోలిస్తే కేవలం 32వేల ఓట్లు మాత్రమే అధికం. కాగ్రెస్ అభ్యర్థి మెజార్టీ రెండు లక్షల 22వేల 170 ఓట్లు . ఇక వరంగల్ పార్లమెంట్‌లోనూ ఇదే హవా కొనసాగింది. కడియం కావ్య 2లక్షలకు పైగా ఓట్ల మెజార్టీ సాధించింది. ఇలా రెండు పార్లమెంట్ నియోజకవర్గాల్లోనే కాంగ్రెస్ హవా కొనసాగింది.

**కాంగ్రెస్ సంబురాలు**

భువనగిరి, వరంగల్‌లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపొందడంతో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆద్వర్యంలో సంబురాలు చేశారు. జనగామ చౌరస్తాలో కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో బానాసంచా కాల్చి సంబురాలు జరిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, యువ నాయకులు కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ చామల కిరన్‌కుమార్‌రెడ్డి గెలుపుకోసం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కష్టపడి పనిచేశాదన్నారు. జనగామలో చామల కిరన్‌కుమార్‌రెడ్డికి అత్యధిక మెజార్టీ ఇవ్వడం జరిగిందన్నారు. బిఆర్ఎస్ నాయకులు బిజెపికి అమ్ముడుపోయి తమ ఓట్లు క్రాస్ చేసినప్పటికి అనుకున్న దానికంటే అత్యధిక మెజార్టీ సాధించామన్నారు. రెండు లక్షల 22వేల మెజార్టీ రావడం అంటే మామూలు విషయం కాదన్నారు. చామల, కడియం గెలుపు కోసం కష్టపడిన ప్రతి నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రశాంతంగా ముగిసిన లోకసభ ఎన్నికల కౌంటింగ్

ఎస్‌పి చెన్నూరి రూపేష్



**ప్రజాపక్షం/ సంగారెడ్డి ప్రతినిధి :** గత నెల 13న జరిగిన లోక్ సభ ఎన్నికలకు సంబంధించిన విజేతలను నిర్ణయించే కీలక ఘట్టం ఎన్నికల కౌటింగ్‌అని జహీరాబాద్ పార్లమెంటు నియోకవర్గానికి సంబంధించి 7 అసెంబ్లీ నియోజకవర్గాలలో జరిగిన ఓట్ల లెక్కింపు ప్రక్రియ మంగళవారం గీతం యూనివర్సిటీ నందు ప్రశాంతగా ముగిసిందని జిల్లా ఎస్పీ చెన్నూరు రూపేష్ తెలిపారు. ఎన్నికల కౌటింగ్ ప్రక్రియకు ఎలాంటి అంతరాయం కలగకుండా నియోజకవర్గాల వారిగా వేరు వేరుగా కౌంటర్లను ప్రత్యేక బ్యారికెట్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రశాంత వాతావరణంలో ఏలాంటి అల్లర్లకు ,గొడవలకు తావు లేకుండా ఓట్ల లెక్కింపు ప్రక్రియ విజయవంతంగా పూర్తి చేసుకోవడం జరిగిందని ఈ ప్రక్రియ ప్రశాంతంగా ముగియడంలో కీలకంగా వ్యవహరించిన అధికారులను సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు. అందుకు సహకరించిన సంగారెడ్డి జిల్లా ప్రజలకు ప్రజా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

## బిజెపికి ఇది గుణపాఠం

సిపిఐ నేత బాగం హేమంతరావు



**ప్రజాపక్షం/ ఖమ్మం :** పార్లమెంటు ఎన్నికల్లో వచ్చిన ఫలితాలు బిజెపి నేతల అహంకారానికి, చేతలకు చెప్పిన గుణపాఠమని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. ఎన్నికల ఫలితాల అనంతరం హేమంతరావు మాట్లాడుతూ బిజెపి 400 సీట్లను కోరి ఈ దేశ రాజ్యాంగాన్ని మార్చడంతో పాటు ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలోకి నెట్టాలని కుట్రలు చేసిందని అందుకే పరిపాలనకు సరిపడ మెజార్టీ కోరకుండా 400 సీట్లు కోరిందని ప్రజలు ఇది గ్రహించి సరైన రీతిలో వ్యవహరించారన్నారు. సిబిఐ, ఈడి లాంటి ప్రభుత్వ రంగ సంస్థలను, విపక్షాలను దెబ్బతీసేందుకు ప్రయోగించారని దీనిపై సైతం ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైందన్నారు. కాని ఇప్పటికైనా బిజెపి తన పద్ధతిని మార్చుకుంటే మంచిదన్నారు. తెలంగాణలో బిఆర్ఎస్ ఫలితంగా బిజెపి ప్రమాదకర శక్తిగా మారిందన్నారు.పలు చోట్ల బిఆర్ఎస్ బిజెపికి తన ఓట్లను మళ్లించడం వల్లే ఈ స్థాయిలో బిజెపి గెలిచిందని ఇది అత్యంత ప్రమాదకరమన్నారు. ప్రమాదకర బిజెపిని నిలువరించేందుకు కాంగ్రెస్, వామపక్షాలు మరింతగా కలిసి పనిచేయాలని హేమంతరావు సూచించారు.

## ఫలితాలు బాధ్యతను పెంచాయి

మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధిః** హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలు ఇచ్చిన మెజారిటీ తనలో మరింత బాధ్యతను పెంచిందని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో అందరి ఆశీర్వాదంతో 5 నెలల క్రితం ఎమ్మెల్యేగా గెలిచానని, కుటుంబ సభ్యులై కార్యకర్తల కృషితో ఈ ఎన్నికల్లో 23 వేల 128 ఓట్ల మెజార్టీ ఇచ్చిన అందరికి హృదయపూర్వక దన్యవాదాలు తెలియజేశారు. నియోజకవర్గ అభివృద్ధికి అన్ని రకాలుగా ప్రజలకు అందుబాటులో ఉండి సేవచేస్తున్నానన్నారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు ఆదర్శ నియోజకవర్గంగా తెలంగాణ రాష్ట్రంలో హుస్నాబాద్‌ను గల్లా ఎత్తుకునేలా చేస్తానన్నారు. ఈ ఓట్లు రావడానికి కారణమైన శ్రమించిన హుస్నాబాద్ నియోజకవర్గ నాయకులకు, మండల అధ్యక్షులు, బూత్ స్థాయి నాయకులు, క్లస్టర్ ఇంచార్జి, అనుబంద సంఘాలు, ఎన్ఎస్‌యుఐ, యూత్ కాంగ్రెస్‌లకు దన్యవాదాలు తెలియజేశారు.

## టోల్‌చార్జీ పెంపుతో అదనపు భారం



**ప్రజాపక్షం/ మందమర్రి :** జాతీయ రహదారిపై టోల్ చార్జీ 5 శాతం పెంచడంతో మంచిర్యాల జిల్లాలో వాహనదారులపై ప్రభావం చూపనుంది. జిల్లాలోని ఇందారం క్రాస్ రోడ్డు నుంచి రేపల్లివాడ వరకు పూర్తయిన 363 జాతీయ రహదారిపై మందమర్రి పట్టణ శివారులో టోల్ గేట్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వాహన పరిణామాన్ని బట్టి రూ. 90 నుండి 570 వరకు రుసుం వసూలు చేస్తున్నారు. 5 శాతం టోల్ చార్జీలు పెంచడంతో ఒక్కో వాహనదారుడిపై రూ. 15 నుండి 140 వరకు అదనపు భారం పడనుంది.

## యువకుని ఆత్మహత్య

**ప్రజాపక్షం/బోథ్ :** బోథ్ మండలంలోని కోట గ్రామానికి చెందిన జల్కే ఆకాష్(20) అనే వ్యక్తి గత కొన్ని రోజులుగా మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు బోథ్ ఎస్ఐ రాము తెలిపారు. మృతుని భార్య అనసూయ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## ర్యాలీలకు అనుమతి లేదు

**ప్రజాపక్షం/ వాంకిడి :** పార్లమెంట్ ఓట్ల లెక్కింపు పూర్తైన సందర్భంగా విజయోత్సవ ర్యాలీలకు ఎటువంటి అనుమతి లేదని మంగళవారం వాంకిడి మండలం ఎస్ఐ డి. సాగర్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ కౌంటింగ్ విజయం అనంతరం విజయోత్సవ ర్యాలీలు నిర్వహించడం, బాణసంచా కాల్చడం వంటి వాటికి ఎలాంటి పర్మిషన్ లేదన్నారు. ఎన్నికల కోడ్ ముగిసేంత వరకు రాజకీయ నాయకులు, పార్టీ కార్యకర్తలు నిబంధనలను అనుసరించి నడుచుకోవాలని, ఎవరైనా చట్టవ్యతిరేక పనులు చేస్తే వారిపై చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

## అడవి పందుల పట్టివేత



**ప్రజాపక్షం/సోన్:** నిర్మల్ జిల్లా సోన్ మండల కేంద్రంలోని చెక్ పోస్ట్ వద్ద అడవి పందులను తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు.మహారాష్ట్రలోని ఉమ్రి నుంచి నిజామాబాద్ మార్గంలో 13 అడవి పందులను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నారు.ఓ వ్యక్తి వాహనం దిగి పారిపోగా,మరొకరిని అరెస్ట్ చేసి రిమాండుకు తరలించినట్లు అధికారులు వెల్లడించారు.

## పెట్రోల్ ట్యాంకర్ ఢీ..ఒకరు మృతి

**ప్రజాపక్షం / గొల్లపల్లి :** పెట్రోల్ ట్యాంకర్ ఢీకొని యువకుడు అక్కడిక్కడే మృతి చెందిన ఘటన గొల్లపల్లి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం మర్లపేట గ్రామానికి చెందిన సాయికృష్ణ తన మోటార్ సైకిల్ మీద అత్తగారిల్లు అయిన గొల్లపల్లికి వచ్చే క్రమంలో మండల కేంద్రంలోకి రాగానే కారును ఓవర్ చేయబోయి ఎదురుగా వస్తున్న పెట్రోల్ ట్యాంకర్‌ను ఢీకొట్టడంతో తలకు తీవ్రగాయాలై అధిక రక్తస్రావం జరిగి అక్కడిక్కడే మృతిచెందాడు. ప్రమాదం జరిగిన ఘటనను చూసిన స్థానికులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.

## కళాశాలలో చేరికపై ప్రచారం

**ప్రజాపక్షం / ఇబ్రహీంపట్నం :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు మంగళవారం గోధూర్ గ్రామంలో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థుల ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాలని ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరే ప్రతి విద్యార్థికి ఫ్రీ అడ్మిషన్‌తో పాటు ఉచిత విద్యా, ఉచిత పాఠ్యపుస్తకాలు పంపిణీ, విద్యార్థిని విద్యార్థులకు ప్రభుత్వం ఉపకార వేతనం అందిస్తుందని కళాశాల అధ్యాపకులు విద్యార్థులకు విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ సంజీవ్ కుమార్ ఆదేశాల మేరకు చేపట్టినట్లు కళాశాల అధ్యాపకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో చేరికలే కొంపముంచాయా!

### బిజెపి గెలుపుకు క్రాస్ ఓటింగ్ కారణమా?

### అవినీతి నాయకుల చేరికతో డీలాపడ్డ కాంగ్రెస్

**ప్రజాపక్షం/నిర్మల్ ప్రతినిధిః** మంగళవారం జరిగిన ఎన్నికల కౌంటింగ్ ఫలితాలలో బిజెపి అభ్యర్థి గెడం నగేష్ ఘన విజయం సాధించారు..కర్ణుడిచావుకు 100 కారణాలు అన్న చందంగా కాంగ్రెస్ ఓటమికి సవాలక్ష కారణాలు..ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ గెలవాల్సిన స్థానం..కానీ ఓటమి చవి చూడడానికి కారణాలు అనేకం.. మొదటి నుండి బిజెపి అభ్యర్థిపై జిల్లా వ్యాప్తంగా వ్యతిరేకత ఉన్నప్పటికీ బిజెపి ఘన విజయం సాధించడానికి కాంగ్రెస్ పార్టీ నిర్లక్ష్యమే కరాణమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.గత కేసీఆర్ ప్రభుత్వంలో అవినీతికి పాల్పడిన పార్టీ నాయకులను కాంగ్రెస్ పార్టీ అక్కునచేర్చుకోవడంజిల్లాలోని ప్రజలకు అంతగా రుచించలేదని విశ్లేషకుల వాదన.టిఆర్ఎస్ పార్టీ నుండి బయటకు వచ్చి అసెంబ్లీ ఎన్నికలలో పోటి చేసిన అభ్యర్థికి సైతం డిపాజిట్ రాలేదు, ఇవన్నీ గమనిస్తే కాంగ్రెస్ పార్టీకి మైనస్ అయ్యాయని రాజకీయ కోవిదుల విశ్లేషణ.





**కాంగ్రెస్ కొంపముంచిన చేరికలు..**

ఎంపీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీలో కొందరు నాయకులు చేరడం కాంగ్రెస్ పార్టీ ఓటమికి కారణంగా పలువురు విశ్లేషిస్తున్నారు.జాతీయ నాయకుడు రాహుల్ గాంధీ,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ప్రత్యేకంగా నిర్మల్ జిల్లాలో బహిరంగ సభను ఏర్పాటు చేసి జిల్లాకు వరాలు ప్రకటించినప్పటికి ప్రజలు కాంగ్రెస్ పార్టీని నమ్మకపోవడానికి ముఖ్య కారణం అవినీతి మరక పడ్డ నాయకులు కాంగ్రెస్ పార్టీలోకి రావడమే అని గుసగుసలు వినిపిస్తున్నాయి.ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలోకి నాయకులు చేరడంతో కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మలేకపోయారనేది.మరొక వాదన కాంగ్రెస్లో, టిఆర్ఎస్ నాయకులు చేరడంతో అప్పటి వరకు సమిష్టిగా పోరాడిన కాం గ్రెస్ సీనియర్ నాయకులు ఒక్కొక్కరుగా దూరమయ్యారనిఆ పార్టీ సీనియర్ నాయకులు చెబుతున్నారు. దీంతో పార్టీ బలంగా ప్రజల్లోకి వెళ్లలేదని వారు భావిస్తున్నారు.

**క్రాస్ ఓటింగ్ కారణమా...**

బిజెపి అభ్యర్థి గేడం నగేష్ గెలుపు కాంగ్రెస్ పార్టీలో జరిగిన క్రాస్‌ఓటింగ్ కారణమని పలువురు భావిస్తున్నారు. గతంలో మంత్రిగా,ఎంపీగా పదవులు చేపట్టిన గేడం నగేష్ పట్ల ప్రజలలో విశ్వసనీయత లేకపోయినప్పటికి బీజేపీ,చరిస్మా,కాంగ్రెస్ క్రాస్ ఓటింగ్ తో గెలిచినట్లు కాంగ్రెస్ పార్టీ సీనియర నాయకులు విశ్లేషిస్తున్నారు.ఎన్నికలకు కొన్ని రోజుల ముందే కేసీఆర్ ప్రభుత్వంలోని నాయకులు,కార్యకర్తలు పార్టీలో చేరడంతో సులభంగా గెలుస్తామనుకొని కాంగ్రెస్ పార్టీ కాస్త నిర్లక్ష్య ధోరణి అవలంబించిందని,అంతేకాకుండా కాంగ్రెస్ పార్టీలోకి చేరిన నాయకుల వల్ల క్రాస్ ఓటింగ్ జరిగిందనేది రాజకీయ విశ్లేషకుల భావన.

**అవినీతి నాయకుల చేరికలతో డీలపడ్డ కాంగ్రెస్..**

అప్పటివరకు ఏకపక్షంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆత్రం సుగుణక్క ఎంపీగా గెలుస్తుందని రాజకీయ విశ్లేషకులు భావించినప్పటికీ కాంగ్రెస్‌లోకి అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న నాయకులు చేరడంతోనే కాంగ్రెస్ పార్టీ డీలపడ్డట్లు రాజకీయ కోవిదుల విశ్లేషణ.కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని ఉన్న సీనియర్ నాయకులు కాస్త దూరమయ్యారని,ప్రజలు సైతం కాంగ్రెస్‌ని నమ్మలేదని వారు భావిస్తున్నారు.దీంతో కాంగ్రెస్‌ఓటమి అవివార్యమైందని ప్రజలు,రాజకీయనాయకులుగుసగుసలాడుతున్నారు. ఏదేమైనప్పటికీ బిజెపిగెలుపును స్వాగతిస్తున్నారు.

# పెద్దపల్లిలో గడ్డం వంశీకృష్ణ గెలుపు

**ప్రజాపక్షం/మంచిర్యాల :** పెద్దపల్లి పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ గెలుపొందారు. బిజెపి అభ్యర్థి గోమాస శ్రీనివాస్‌పై ఒక లక్షా 30 వేల ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. కాగా బిఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ మూడవ స్థానంలో నిలిచారు. మంచిర్యాల జిల్లాలో గల మూడు అసెంబ్లీ సెగ్మెంట్లు అయిన మంచిర్యాల అసెంబ్లీ నియోజకవర్గంలో 1,38,064 మంది పురుషులు, 1,40,648 మంది మహిళలు, 26 మంది ఇతరులు , 28 మంది ఎన్ఆర్ఐలు , 365 మంది సర్వీసు ఓట్లు, 4386 మంది దివ్యాంగులు ఓట్లు ఉన్నారు. బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో 87,283 మంది పురుషులు, 89,219 మంది మహిళలు, 12 మంది ఇతరులు, ఇద్దరు ఎన్ఆర్ఐలు, 172 మంది సర్వీసు ఓటర్లు, 2702 మంది దివ్యాంగులు, చెన్నూర్ అసెంబ్లీ సెగ్మెంటులో 96,019మంది పురుషులు, 97,752 మంది మహిళలు, ఏడుగురు ఇతరులు, ఎనిమిది మంది ఎన్ఆర్ఐలు, 140 మంది సర్వీసు ఓటర్లు, 3162 మంది దివ్యాంగులు ఉన్నారు. కాగా మంచిర్యాల నియోజకవర్గంలో 1,69,591 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే బెల్లంపల్లి నియోజకవర్గంలో 1,25,255 మంది ఓటర్లు, చెన్నూర్ నియోజకవర్గంలో 1,32,787 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాగా మంచిర్యాల జిల్లాలో మూడు నియోజకవర్గాల పరిధిలో 4,27,633 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోగా కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ తన సమీప బిజెపి అభ్యర్థి గోమాస శ్రీనివాస్‌పై లక్షా 30 వేల ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు.





**ఆసిఫాబాద్ జిల్లాలో....**

ఆసిఫాబాద్ కొమురంభీం జిల్లాలో ఆదిలాబాద్ పార్లమెంటు సభ్యునిగా బిజెపి అభ్యర్థి గొడం నగేష్ తన సమీప కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణపై 71,325 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఆసిఫాబాద్ జిల్లాలోని రెండు అసెంబ్లీ సెగ్మెంట్‌లు అయిన సిర్పూర్‌లో పురుషులు 1,14,522 మంది, మహిళలు 1,14,567, ఇతరులు 12 మంది మొత్తం 2,29,101 మంది ఓట్లు ఉన్నారు. ఆసిఫాబాద్ అసెంబ్లీ సెగ్మెంటులో 1,12,788 మంది పురుషులు, 1,14,404 మంది స్త్రీలు, 16 మంది ఇతరులు ఉండగా మొత్తం 2,27,208 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో సిర్పూర్ నియోజకవర్గం నుండి 1,56,098 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆసిఫాబాద్ నియోజకవర్గం నుండి 1,52,706 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

## రోడ్డు ప్రమాదాల నియంత్రణకు కృషి

ఎస్ఐ శ్రావణ్ కుమార్




**ప్రజాపక్షం /సుల్తానాబాద్ :** రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పకడ్బందీగా చర్యలు తీసుకుంటామని ఎస్సై శ్రావణ్ కుమార్ అన్నారు, ఇటీవల సుల్తానాబాద్ పట్టణంలో లారీ బీభత్సంతో ఒకరు మృతి చెందగా మరొకరు హాస్పటల్లో చికిత్స పొందుతున్న విషయం మనందరికీ తెలిసిందే.రోడ్డు ప్రమాదాలను అరికట్టే విధంగా మంగళవారం ప్రమాదాలు జరిగే స్పాట్‌లను గుర్తించి నివారణ చర్యలు చేపట్టారు. వాహనాలు వేగం నియంత్రణకు దుబ్బ పల్లి నుండి చిన్నకల్వల వరకు ప్రమాదాలు జరిగే ముఖ్య కూడలి దుబ్బపల్లి,గర్రెపల్లి, కట్నపల్లి,స్వప్న కాలనీ, అంబేద్కర్ చౌరస్తా, పూసల రోడ్ , స్పాట్ ను గుర్తించి బార్కెట్స్ ఏర్పాటు చేశారు. ప్రతి వాహనదారుడు తన వాహనంయొక్క అన్ని పత్రాలు వాహనంలో లోన్ పెట్టు కోవాలి అని ఎస్సై శ్రావణ్ కుమార్ తెలిపారు, రోడ్డు ప్రమాదాల సంఖ్యను గణనీయంగా తగ్గించే విధంగా చర్యలు చేపడతామని ప్రతి రోజు వాహనం తనికి తో పాటు డ్రంకెన్ డ్రైవ్ కూడా జరుగుతుందీ అన్నారు. స్పీడు నియంత్రణ కోసం మలుపుల దగ్గర సూచికలు, రేడియం స్టిక్కర్లతో బోర్డులు, బ్లింకింగ్ లైట్స్ ఫ్లెక్సీ లు ఏర్పాటు చేస్తామని రహదారిపై వాహనాలు నిలిపి ఉండడం వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉన్నందున నియంత్రణకు పెట్రోలింగ్ నిర్వహిస్తూ రోడ్డుపై ఎలాంటి వాహనాలు నిలవకుండా చర్యలు తీసుకుంటామని, అలాగే రోడ్డుకు ఇరువైపులా ఉన్న చిరు వ్యాపారులకు రోడ్ సేఫ్టీ వాట్సప్ గ్రూప్ క్రియేట్ చేయడం జరిగిందని.. ఇలాంటి ప్రమాదం జరిగిన వెంటనే గ్రూప్ తెలియజేస్తే తక్షణమేప్రమాదంజరిగిన సంఘటనకు పోలీస్ సిబ్బంది చేరుకుంటారని, అలాగే రోడ్డుకు ఇరువైపునున్న సీసీ కెమెరాలు పునరుద్ధికి చర్యలుచేపడుతున్నామనితెలియజేశారు. ఉన్నత పోలీస్ అధికారులు, మీడియా మిత్రుల తో పాటుగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న చిరు వ్యాపారులు ఉన్నారు.

# కేంద్రంలో బిజెపి రావడం దురదృష్టకరం

ఎన్ఎఫ్ఐడబ్ల్యు రాష్ట ఉపాధ్యక్షురాలు నళినిరెడ్డి

**ప్రజాపక్షం/నిర్మల్/అదిలాబాద్:** సిపిఐ కార్యాలయంలో భారత మహిళ సమాఖ్య ఎన్ఎఫ్ఐడబ్యూలు ఆధ్వర్యంలో 70వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎన్ఎఫ్ఐడబ్యూ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మూడుపు నళిని రెడ్డి మహిళ సంఘం జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ దేశానికి స్వతంత్ర సిద్ధించి 77 ఇయర్స్ అయినప్పటికీ నేటికి మహిళల హక్కుల్ని ఏ ప్రభుత్వాలు కాపాడలేకపోతున్నాయని బ్రిటిష్ లాగానే బిజెపి కేంద్రంలో మోడీ ప్రభుత్వం అదే విధంగా కొనసాగించడం చాలా దురదృష్టంగా భావిస్తున్నామని దేశంర్ల అనేక రాష్టాలో మణిపూర్ అయితే ఏంది చత్తీగడ్ ఝార్ఖండ్ దేశంలో అనేక రాష్ట్రాల్లో దేశ వ్యాప్తంగా హత్యలు మానభంగాలు,అత్యాచారాలు మహిళలకు బిజెపి ప్రభుత్వం పై మహిళలు పొరాడిల్సిన అవసరం అసనమైందనేది అందుకే మహిళలు రిజర్వేషన్ కొరకు చట్టసభల్లో 33 శాతం కావాలని పార్లమెంట్ మెంబర్ అయిన మాజీ గీత ముఖర్జీ అనే ఉద్యమాలతోటి ఈ మహిళా సంఘంని బలోపేతం చేయడానికి అనేక కృషి చేసిందని రిజర్వేషన్ కొరకు అనేక ఉద్యమాలు చేసిన చరిత్ర మతోన్మాదం పేరుతోటి బిజెపి రాజ్యం వెళుతుందని సమానత్వం సమాజం కొరకే మహిళలు పోరాడుతున్నారని రానున్న రోజులలో మహిళల హక్కుల కొరకు మరిన్ని ఉద్యమాలు చేయాలని ప్రస్తుతం ఝార్ఖండ్,ఛతీస్గడ్,మణిపూర్ లో జరిగిన సంఘటనలకు ప్రపంచమే తలదించుకునే విధంగా బిజెపి ప్రభుత్వం కుట్రలు అనిందని ఆయన ప్రజలు దేవుని పేరు మీద చెప్పి రాజకీయాలు నమ్మొద్దు అని ఎవరి మతం పేరుతోటి వారు పొతారని ఎవరిష్టం వారికే వర్తిస్తారని కానీ బీజేపీ మాత్రం హిందుత్వం అని పేరు మీద రాజకీయం చేయడం విడ్డూరంగా ఉందని ముడుపు నళిని రెడ్డి విమర్శించారు.ఈ కార్యక్రమంలో మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అమీని ఖాన్,కృష్ణవేణి, షబానా, పుష్ప, అరుణ రాణి తదితరులు పాల్గొన్నారు.



## పెద్దపల్లి కోటలో కాకా వారసుడి గెలుపు

**ప్రజాపక్షం/ జగిత్యాల జిల్లా ప్రతినిధి :** పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులుగా యువ నాయకులు గడ్డం వంశీకృష్ణ ఎన్నిక కావడం పట్ల జగిత్యాల జిల్లా సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షులు ఎన్నం కిషన్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు గట్టు గంగారాం, గాదె ప్రభాకర్, బుర్ర రమేష్, కనుకయ్య, చల్ల తిరుపతి, గడ్డం నారాయణ, దమ్మ లక్ష్మ ణ్ తదితరులు హర్షం ప్రకటించారు. పెద్దపల్లి స్థానం నుండి కాకా వెంకటస్వామి, ఆయన కుమారుడు ప్రస్తుత చెన్నూరు ఎమ్మెల్యే వివేక్, ఇప్పుడు మనవడు వంశీకృష్ణలు మూడు తరాల వ్యక్తులు ఎంపిలుగా గెలవడం పెద్దపల్లి గడ్డం వంశానికి కంచుకోటగా నిలిచి పోయిందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి జగిత్యాలలో మాట్లాడుతూ కాకా వారసుడిగా ఎన్నికల్లో పోటీ చేసిన మొదటిసారి భారీ విజయాన్ని వంశీకృష్ణ సొంతం చేసుకోవడం పట్ల కాంగ్రెస్ నాయకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మండు వేసవిలో ఎంపి అభ్యర్థి గెలుపు కోసం విస్తృత ప్రచారం నిర్వహించడం మూలంగా వంశీకృష్ణకు భారీ మెజార్టీ వచ్చిందన్నారు. వంశీకృష్ణ గెలుపుతో పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం అభివృద్ధి చెందడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని కిషన్‌రెడ్డి ఆశా భావం వ్యక్తం చేశారు.

## హుజురాబాద్‌లో కాంగ్రెస్‌కు మెజార్టీ

అన్ని తానై నడిపించిన వొడితెల ప్రణవ్.

పనిచేయని కౌశిక్‌రెడ్డి మంత్రం



**ప్రజాపక్షం / హుజురాబాద్ :** మంగళవారం వెలువడినటువంటి లోక్ సభ ఫలితాల్లో ఆశించిన ఫలితం రాకపోయినా బిజెపి, బిఆర్ఎస్ కుట్రలను తిప్పి కొట్టి గట్టి పోటీ ఇచ్చామని హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ వొడితెల ప్రణవ్ అన్నారు. హుజురాబాద్ నుండి అద్భుతమైన మెజార్టీ ప్రజలు ఇచ్చారని దీనికి నియోజకవర్గ ప్రజలందరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు. హుజురాబాద్‌లో స్థానిక ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఉన్నా కూడా బిఆర్ఎస్ పార్టీ కంటే ఎక్కువగా ఓట్లు కాంగ్రెస్ పార్టీకి వేసినందుకు, పార్టీపై, నాపై ఎల్లప్పుడు ఆశీర్వాదాలు ఉండాలని కోరుకుంటూ, ఎంపి అభ్యర్థి గెలుపు కోసం కృషి చేసిన ప్రతి ఒక్క కాంగ్రెస్ పార్టీ సైనికులకు అభినందనలు తెలియజేస్తూ , రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టబోయే ఏ పథకాన్ని అయినా హుజురాబాద్ గడపగడపకు అందిస్తానని తెలిపారు. మరొకసారి హుజురాబాద్ నుండి మంచి మెజార్టీ ఇచ్చినందుకు పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు.

## ఉపాధి కూలీపై తేనేటీగల దాడి

**ప్రజాపక్షం / మల్లాపూర్ :** మండల కేంద్రంలోని ఉపాధి హామీ పథకంలో భాగంగా పని చేస్తున్న కూలీలపై ఒక్కసారిగా తేనేటీగలు దాడి చేయడంతో కూలీలు బెంబేలెత్తిపోయారు. మంగళవారం గ్రామానికి ఆనుకుని ఉన్న కోపి అడవి ప్రాంతంలో పని చేస్తున్న క్రమంలో చెట్టుపై ఉన్న తేనేటీగలు కూలీలపై దాడి చేయడంతో సుమారు 90 మంది కూలీలు పరుగులు తీశారు. అయినప్పటికీ వారిపై దాడి చేశాయి. తేనేటీగల దాడిలో చందనగిరి లత , సిర్రం వెంకటి, మోరపు జలపతి, గంగారాజంలపై అధికంగా దాడి చేశాయి. గాయాల బాధతో అల్లాడిపోయారు. కాగా స్థానికులు గమనించి వెంటనే ప్రయివేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రమాదం తప్పిందని వైద్యులు తెలిపారు. కాగా తేనేటీగలు దాడి చేసిన ప్రదేశాన్ని పంచాయతీ కార్యదర్శి భూమేష్ ఈజిఎస్ సిబ్బందితో కలిసి పరిశీలించి బాధితులను పరామర్శించారు.

## గొల్లపల్లి మండలంలో కాంగ్రెస్ సంబరాలు



**ప్రజాపక్షం / గొల్లపల్లి :** ఎన్నికల ఫలితాలు విడుదలైన తరుణంలో పెద్దపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఎంపి అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ భారీ మెజార్టీతో గెలుపొందడం జరిగింది. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో మొత్తం 21 రౌండ్ల లెక్కింపు జరగగా కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీ కృష్ణ 1,31,364 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. మొత్తంగా బిజెపి అభ్యర్థి గోమాస శ్రీనివాస్‌కు 3,44,223, బిఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు 1,93,356 ఓట్లు సాధించగా కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ 4,75,587 ఓట్లు సాధించారు. విజయాన్ని పురస్కరించుకుని గొల్లపల్లి మండలంలోని గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు.

## అప్రమత్తంగా ఉండండి

**ప్రజాపక్షం / జగిత్యాల జిల్లా ప్రతినిధి :** జగిత్యాల జిల్లాలోని తిప్పన్నపేట ఆరోగ్య మందిర్‌ను జగిత్యాల జిల్లా ఉప వైద్యాధికారిశ్రీనివాస్ మంగళవారం సందర్శించారు. వర్షా కాలం ప్రారంభమవుతున్నందున వ్యాధులు ప్రబలకుండా ఆరోగ్య సిబ్బంది ప్రజలను అప్రమత్తం చేయాలని శ్రీనివాస్ సూచించారు. గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అలాగే ఆరోగ్య సిబ్బంది సూచించిన విధంగా ప్రజలు అంటు వ్యాధులు దరిచేరకుండా నడుచుకోవాలని జిల్లా ఉప వైద్యాధికారి కోరారు.

**BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR WARANGAL,**

**ARB.NO. 218 of 2024**

Between:

**KAPIL CHITS (KAKATIYA) PRIVATE LIMITED., Parkal Branch,** R/o. WARANGAL. **.... Disputant**

**AND**

**Mr ANIL BACHALA & others ... Opponents**

1. Mr. ANIL BACHALA, S/o. Kistaiah, aged about: 27years, Occ: BADILI WORKER IN SCCL K.T.K 5 IN CLINE AT BHOOPALPALLY, R/o. H.NO - 2-32/2, ANDUGULAPET, MANDHAMARRI - 504231, ADHILABAD, TELANGANA.
3. Mr. NIRANJAN JUPAKA, S/O. DEENA DAYAKAR, aged about 37 years, Occ: General Mazdoor In K.T.K 5 In Cline At Bhoopalpally, R/o. BLOCK NO 47, Q.NO 1484 ,1000 QTRS, BHUPALPALLY - 506169, JAYASHANKAR, TELANGANA.
4. Mr. SRAVAN MALYALA, S/O.LACHAIAH, aged about 25 years, Occ: General Mazdoor In K.T.K 5 In Cline SCCL At Bhoopalpally, R/o. H.NO. 17-343/1, JAWAHAR COLONY, BHUPALPALLY-506169, JAYASHNAKAR, TELANGANA.
5. Mr. KIRAN KUMAR ARELLI, S/O. BABU, aged about 36 years, Occ: General Mazdoor In K.T.K 5 in Cline At Bhoopalpally, R/o. BLOCK NO.36 Q.NO. 1328, 1000 QUARTERS, BHUPALPALLY - 506169, JAYASHANKAR, TELANGANA.

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Several times notices were issued to you, But you have failed to receive the same. The above dispute is posted on **14-06-2024** for your appearance. On that day you have to appear in person at **11.00 A.M.** Before the Deputy Registrar referred above. Other wise the case will be decided ex-parte.

**DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATION, WARANGAL.**

# కెసిఆర్, వినోద్ రికార్డు బద్దలు కొట్టిన బండి

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధిః** బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కుమార్ మరోసారి ప్రభంజనం సృష్టించారు. బిజెపి గెలిచిన 8 స్థానాల్లో అత్యదిక ఓట్ల శాతాన్ని సాధించి టాప్‌గేర్‌లో నిలిచారు. మొత్తం 13 లక్షల 3 వేలకు పైగా ఓట్లు పోలవగా అందులో 45 శాతం ఓట్లు సాధించడం గమనార్హం. తెలంగాణలో గెలిచిన బిజెపి అభ్యర్థులందరి కంటే ఎక్కువ శాతం ఓట్లు సాధించడం విశేషం. మరోవైపు కరీంనగర్ పార్లమెంటు చరిత్రలో కనీవినీ ఎరగని రీతిలో అత్యధిక మెజార్టీ సాధించారు. 2006 ఉప ఎన్నికల్లో బిఆర్ఎస్ అధినేత కెసిఆర్‌కు 2 లక్షల ఒక వేయి 581 ఓట్లు రాగా 2014లో వినోద్ కుమార్‌కు 2 లక్షల 5 వేల 7 ఓట్లు వచ్చాయి. ఇప్పటి వరకు ఇవే అత్యధిక ఓట్లు, తాజా ఫలితాలతో బండి సంజయ్ ఆ రికార్డులను బద్దలు కొట్టి కరీంనగర్ చరిత్రలో మరో కొత్త రికార్డు నెలకొల్పారు. ఏకంగా 2 లక్షల 25 వేల 209 ఓట్లు సాధించి కరీంనగర్ ఆల్ టైం రికార్డును కైవసం చేసుకున్నారు. 2019లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో బండి సంజయ్‌కు 89 వేల 508 ఓట్ల మెజార్టీ కట్టబెట్టిన ప్రజలు ఈ సారి అనూహ్యంగా అంతకు మూడు రెట్లు కట్టబెట్టి తమ అభిమానాన్ని చాటుకోవడం విశేషం, కరీంనగర్ పార్లమెంటు ఎన్నికల్లో మొత్తం 17 లక్షల 97 వేల 150 మంది ఓటర్లుండగా 13 లక్షల 3 వేల 690 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. పోస్టల్ బ్యాలెట్ సహా తొలి రౌండ్ నుంచే బండి సంజయ్ ఆదిక్యత కనబర్చారు. మొత్తం 24 రౌండ్లకు గాను 22 రౌండ్లలో స్పష్టమైన ఆదిక్యత కనబరుస్తూ వచ్చారు. సిరిసిల్ల అసెంబ్లీ నియోజకవర్గంలో తొలుత వెనుకబడినప్పటికీ క్రమేపీ మెజార్టీ సాధిస్తూ వచ్చారు. అంతిమంగా 2 లక్షల 25 వేల 209 ఓట్లు సాధించి అఖండ విజయాన్ని అందుకున్నారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ అభ్యర్థుల విషయానికొస్తే బండి సంజయ్ తన ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్, బిఆర్ఎస్ అభ్యర్థులు రెండో స్థానం కోసం పోటీపడాల్సిందేనంటూ పదే పదే చెప్పుకొచ్చారు. ఆయన చెప్పినట్లుగా ఈ రెండు పార్టీల అభ్యర్థులు తొలి నుంచి చివరిదాకా రెండో స్థానం కోసమే నువ్వా నేనా అన్నట్లుగా పోటీ పడడం విశేషం. చివరిదాకా రెండు పార్టీలు పోటీ పడినప్పటికీ కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్ 27.41 శాతం ఓట్లు (359907 ఓట్లు) సాధించి రెండో స్థానంలో నిలిచారు. బిఆర్ఎస్ అభ్యర్థి మాజీ ఎంపి వినోద్ 21.49 శాతం ఓట్లతోనే (282163) సరిపెట్టుకోవడం విశేషం. ఎన్నికల ఫలితాలు వెలువడగానే బిజెపి కార్యకర్తలు, బండి సంజయ్ అభిమానుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఓవైపు వర్షపు చినుకులతో బండి సంజయ్‌ను ఆశీర్వదిస్తున్న సమయంలో వేలాది మంది కార్యకర్తలు కరీంనగర్ వీధుల్లోకి తరలివచ్చి సంబరాలు చేసుకున్నారు. ఎస్సారార్ కాలేజీ వద్దకు భారీగా తరలివచ్చిన కార్యకర్తలు బాణసంచా పేలుస్తూ ఘన స్వాగతం పలికారు. కొందరు కార్యకర్తలు బండి సంజయ్‌ను భుజాలపైకి ఎత్తుకుని చిందులు వేస్తూ తమ ఆనందాన్ని పంచుకున్నారు. కార్యకర్తల ఆనందోత్సవాలు, భారీగా తరలివచ్చిన సంజయ్ అభిమానులతో కరీంనగర్, జగిత్యాల రోడ్డు కిక్కిరిసిపోయింది.



## 4 నుంచి 8 కి పెరిగిన
# బిజెపి ఎంపిల బలం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో బిజెపి ఎంపిల బలం 4 నుంచి 8కి పెరిగింది. బిజెపి అనుకున్న డబుల్ డిజిట్ లక్ష్యం మాత్రం నేరవేరలేదు. బిజెపి అభ్యర్థులకు మద్దతుగా ప్రధాని నరేంద్ర మోదీ, పలువురు కేంద్ర మంత్రులు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులుతో పాటు ఆపార్టీ జాతీయ నాయకులు ప్రచారంతో ఉదరగొట్టారు. .దీంతో సార్వత్రిక ఎన్నికల్లో డబుల్ డిజిట్ స్థానాలను కైవసం చేసుకోబోతున్నామని బిజెపి నాయకులు పూర్తి ధీమా వ్యక్తం చేశారు. అయితే ఎన్నికల తుది ఫలితాల్లో మాత్రం సింగిల్ డిజిట్‌కే పరిమితం కావడం ఆ పార్టీ శ్రేణు కొంత నిరాశకు గురైనప్పటికీ గత ఎన్నికలలో గెలిచిన స్థానాలను రెట్టింపు చేసుకోవడంతో మంగళవారం హైదరాబాద్‌లోని నాంపల్లి బిజెపి రాష్ట్ర కార్యాలయంలో పార్టీ నేతలు కార్యకర్తలు సంబురాల్లో మునిగితేలారు.

**8కి పెరిగిన బిజెపి బలం ...** గత సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి అభ్యర్థులు 4 స్థానాల్లో గెలుపొందగా, ఈ ఎన్నికల్లో 8 స్థానాలను కైవసం చేసుకుంది. గత 4 సిట్టింగ్ స్థానాలతో పాటు అదనం గా మరో 4 స్థానాల్లో ఆ పార్టీ అభ్యర్థులు విజయం సాధించారు. కరీంనగర్‌లో బండి సంజయ్, నిజామాబాద్‌లో అర్వింద్ కుమార్, సికింద్రాబాద్‌లో కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, అదిలాబాద్‌లో నగేశ్‌కు గెలుపొందగా, ఈ సారి కొత్తగా మల్కాజ్‌గిరిలో ఈటెల రాజేందర్, చెవేళ్లలో కొండా విశ్వేశ్వర రెడ్డి, మెదక్‌లో రఘునందన్‌రావు, మహబూబ్ నగర్‌లో డి.కె.అరుణలు గెలుపొందడంతో రాష్ట్రంలో బిజెపి ఎంపిల సంఖ్య 8కి పెరిగింది.

## ఫోన్‌ట్యాపింగ్ కేసులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హైకోర్టు నోటీసులు

**హైదరాబాద్ :** గతంలోని కేసీఆర్ .ప్రభుత్వ హయాంలో పలువురు నాయకులతోపాటు న్యాయమూర్తుల ఫోన్లను టాప్ చేయడాన్ని హైకోర్టు తీవ్రంగా పరిగణించింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు డిజిపి ఇంటిలిజెన్స్ విభాగాలకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణ వచ్చే నెల మూడో తేదీకి వాయిదా వేసింది. న్యాయమూర్తుల ఫోన్లు టాపింగ్ అవుతున్నాయంటూ వచ్చిన వార్తలను హైకోర్టు పిటిషన్ గా పరిగణించి మంగళవారం చీఫ్ జస్టిస్ అలోక్ అరాదే ఆధ్వర్యంలోని డివిజన్ బెంచి విచారించింది.

ఎస్‌బీఐ అదనపు ఎస్పీ (సస్పెండెడ్) భుజంగరావు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా రాజకీయ ప్రత్యర్థులు, ప్రైవేటు వ్యక్తులతోపాటు హైకోర్టు న్యాయమూర్తుల ఫోన్‌లను ట్యాప్ చేస్తున్నట్లు దర్యాప్తులో వెల్లడించినట్టు పత్రికల్లో వార్తలు వచ్చాయి.

# రావి నారాయణరెడ్డి చిరస్మరణీయుడు

### 118 వ జయంతి సభలో సిపిఐ నేతలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం ఫాసిస్ట్ నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ జరిపిన ప్రజా ఉద్యమాల్లో విప్లవాగ్ని రగిలించి వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని విశ్వమే విస్తుపోయేలా నడిపిన విప్లవవీరుడు రావి నారాయణరెడ్డి తెలంగాణ ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడని సిపిఐ నేతలు కొనియాడారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటయోధుడు, ప్రముఖ కమ్యూనిస్టు నేత రావి నారాయణరెడ్డి 118 వ జయంతి వేడుకలను హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్ భవన్, ఆఎన్‌ఆర్ ఆడిటోరియంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్ అధ్యక్షులు సురవరం సుధాకర్‌రెడ్డి, సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి, ఈటి నరసింహ, తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్ కార్యదర్శి కందిమళ్ల ప్రతాప్‌రెడ్డి, కోశాధికారి ఉజ్జిని రత్నాకర్‌రావు తదితరులు రావి నారాయణరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సురవరం సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాట యోధులు మగ్ధూం మొహియుద్దీన్, బద్దం ఎల్లారెడ్డి తదితరులతో కలసి నిజాం పాలనకు, రజాకార్లకు వ్యతిరేకంగా గెరిల్లా యుద్ధాలు ప్రారంభించి, వీరోచితంగా పోరాటాలు నిర్వహించి రావి నారాయణరెడ్డి నిజాం వెన్నులో చలి పుట్టించాడన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలలో నాటి తెలంగాణ సాయుధ పోరాట యోధులను స్మరించుకోకపోవడం, రాష్ట్ర గేయంలో తెలంగాణ సాయుధ పోరాటం గురించి ఒక జ్ఞాపిక లేకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారికంగా ఉన్న లేకపోయినా తెలంగాణ సాయుధ పోరాటం ప్రజల హృదయాలలో శాశ్వతంగా ఉంటుందని సురవరం సుధాకర్‌రెడ్డి అన్నారు. డాక్టర్ కె.నారాయణ మాట్లాడుతూ కేవలం తెలంగాణ లోనేకాకుండా రావి నారాయణరెడ్డి పేరు దేశమంతా మార్మోగిందని, 1952 మొదటి పార్లమెంట్ ఎన్నికల్లో రావి నారాయణరెడ్డి కమ్యూనిస్టు పార్టీ తరపున నల్లగొండ జిల్లా పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ కంటే అధిక మెజారిటీతో గెలుపొందారని తెలిపారు. రాష్ట్రాలు విడిపోయిన తెలుగు ప్రజలు విడిపోలేదని, తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవాలను తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత కూడా గత ప్రభుత్వం అధికారికంగా జరపకపోవడం, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలలో రావి నారాయణరెడ్డి వంటి వీరుల చరిత్ర ప్రస్తావించకపోవడం బాధాకరమన్నారు. పొరుగు రాష్ట్రాలు మహారాష్ట్ర, కర్ణాటక తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవాలను అధికారికంగా నిర్వహిస్తున్నాయని, తెలంగాణలో కూడా తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవాలను సెప్టెంబర్ 11 నుండి 17 వరకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని నారాయణ కోరారు. చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ రావి నారాయణరెడ్డి ఒక వ్యక్తి కాదు ఒక శక్తి అని, స్వాతంత్ర సమర యోధుడు, మానవతావాది, నిజాయితీతో నిఖార్సుగా నిలబడ్డ ఆదర్శ కమ్యూనిస్టు, తెలంగాణ సాయుధ పోరాటానికి చిరునామా అని కొనియాడారు. తెలంగాణ సాయుధ పోరాటంతోనే హైదరాబాద్ రాష్ట్రం భారత్‌లో విలీనమైందన్నారు. కందిమళ్ల ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ రావి నారాయణరెడ్డి ప్రజా పోరాట నాయకుడిగా ఎదిగి, తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొని, కమ్యూనిస్టు పార్టీ నిర్మాణంలో కీలకపాత్ర పోషించారని, ఆయన త్యాగాలు రానున్న తరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్.ఛాయాదేవి, రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు, బి.స్టాలిన్, ట్రస్ట్ సభ్యులు జైనీ రమేష్, ఎస్.వెంకటేశ్వర్‌రెడ్డి, ఆరుట్ల సుశీల, చెన్నకేశవులు, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు కె.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహ, నేతలు ఉప్పలయ్య, లక్ష్మి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

### రావి నారాయణరెడ్డికి సిపిఐ నేతల నివాళి

రావి నారాయణరెడ్డి జయంతి సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్దుంభవన్‌లో పలువురు సిపిఐ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘననివాళి అర్పించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు పశ్య పద్మ, కార్యవర్గ సభ్యులు ఎన్.జ్యోతి, ఉస్తెల సృజన, కౌన్సిల్ సభ్యులు జె.లక్ష్మి తో పాటు పలువురు నాయకులు రావి నారాయణరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రావి నారాయణరెడ్డి పార్టీకి చేసిన సేవలను గుర్తు చేసుకొన్నారు.



# బిఆర్‌ఎస్‌కు ఘోర పరాభావం

### లోక్‌సభలో ప్రాతినిధ్యం కోల్పోయిన గులాబీ
### ఎన్నికల ఫలితాల్లో 'కారు చిత్తు'
### కోలుకోలేని దెబ్బ...నైరాశ్యంలో నేతలు
### 'కంటోన్మెంట్' ఉపఎన్నికల్లోనూ తప్పని ఓటమి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిఆర్‌ఎస్‌కు కోలుకోలేని దెబ్బపడింది. లోక్‌సభ ఎన్నికల్లో గులాబీ ఘోరపరాభావాన్ని చవిచూసింది. కనీసం బోణి కూడా చేయలేకపోయింది. వరుస విజయాల పరంపరగా నిలిచిన కెసిఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రాతినిధ్యం వహించే మెదక్ లోక్‌సభ స్థానాన్ని కూడా బిఆర్‌ఎస్ కోల్పోయింది. టిఆర్‌ఎస్ ఆవిర్భవించినప్పటి నుంచి ఇప్పటి వరకు లోక్‌సభ ఎన్నికల్లో ఖాతా తెరవకపోవడం ఇదే ప్రథమం. 16స్థానాల్లో బిఆర్‌ఎస్ మూడవ స్థానానికే పరిమితమైంది. లోక్‌సభ ఎన్నికల్లో బిఆర్‌ఎస్ అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు విస్తృతంగా ఎన్నికల ప్రచారాన్ని చేపట్టి, బస్సు యాత్ర చేపట్టినా ఫలితం లేకుండాపోయింది. లోక్‌సభ ఎన్నికల్లో కోలుకోలేని దెబ్బపడడంతో బిఆర్‌ఎస్ వర్గాల్లో నైరాశ్యం నెలకొన్నది. మెదక్, జహీరాబాద్, వరంగల్, ఖమ్మం, మహబూబ్‌నగర్, మహబూబాబాద్, చేవేళ్ల, నాగర్‌కర్నూర్, పెద్దపల్లి సిట్టింగ్ స్థానాలను బిఆర్‌ఎస్ నిలుపుకోలేకపోయింది. కనీసం ఈ స్థానాల్లో గులాబీ గట్టి పోటీ కూడా ఇవ్వలేకపోయింది. చాలా చోట్ల కౌంటింగ్ కేంద్రాల నుంచి బిఆర్‌ఎస్ అభ్యర్థులు మధ్యలోనే వెళ్లిపోయారు. ఈ ఎన్నికల్లో బిఆర్‌ఎస్ ఏమాత్రం ప్రభావాన్ని చూపకపోగా తన ప్రాతినిధ్యాన్ని సైతం కోల్పోయింది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో టిఆర్‌ఎస్‌కు 41.7 శాతం ఓట్లు పోలవ్వగా, ప్రస్తుతం కేవలం 16.69 శాతం ఓట్లకు పడిపోయింది.

### ''హీరో నుంచి జీరో''

2001 ఏప్రిల్‌లో టిఆర్‌ఎస్ ఆవిర్భవించింది. అప్పటినుంచి ఎంపి స్థానాల్లో అనేక విజయాలు సాధించిన బిఆర్‌ఎస్, ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో మొదటిసారి పార్లమెంట్‌లో ఆ పార్టీ ఖాతా తెరవలేకపోయింది. 2004 లోక్ సభ ఎన్నికల్లో కరీంనగర్ లోక్‌సభ నుంచి కెసిఆర్, ఆదిలాబాద్ నుంచి మదుసూదన్‌రెడ్డి టక్కల, హన్మకొండ నుంచి బోయినపల్లి వినోద్‌కుమార్, మెదక్ నుంచి ఆలె నరేందర్ గెలుపొందారు. (6.68 శాతం ఓట్లు), 2009 సార్వత్రిక ఎన్నికల్లో (3.99 శాతం ఓట్లు ) మహబూబ్‌నగర్ ఎంపిగా కెసిఆర్, మెదక్ లోక్‌సభ నుంచి విజయశాంతి గెలుపొందారు. ఆతర్వాత 2014లో (13.68 శాతం ఓట్లు) 11ఎంపిలు, 2018లో (46.9 శాతం ఓట్లు ) 9స్థానాలు గెలుపొందారు.

### సిట్టింగ్‌నూ కోల్పోయిన బిఆర్‌ఎస్

కంటోన్మెంట్ శాసనసభ సిట్టింగ్ స్థానాన్ని కూడా బిఆర్‌ఎస్ కోల్పోయింది. ఇటీవల సిట్టింగ్ ఎంఎల్‌ఎ లాస్యనందిత రోడ్డు ప్రమాదంలో మరణించారు. దీంతో ఉపఎన్నికల్లో బిఆర్‌ఎస్ లాస్యనందిత సోదరి నివేదితను పోటీలో దింపింది. ఈ స్థానాన్ని కూడా బిఆర్‌ఎస్ ఓడిపోయింది. శాసనసభ ఎన్నికల్లో ఆ పార్టీ 39 స్థానాలను గెలుపొందగా, ఇందులో ఇప్పటికే ముగ్గురు ఎంఎల్‌ఎలు బిఆర్‌ఎస్‌ను వీడిన విషయం తెలిసిందే. తాజాగా కంటోన్మెంట్ స్థానం కూడా కోల్పోవడంతో ప్రస్తుతం బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎల సంఖ్య 35కు చేరింది.

# సమానత్వం, శాంతి, అభివృద్ధి ధ్యేయంగా భారతజాతీయ మహిళాసమాఖ్య ఆవిర్భావం

### ఎన్ఎఫ్ఐడబ్ల్యు జాతీయ కార్యదర్శి డాక్టర్ రజిని



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దేశంలో మహిళల పట్ల ఏర్పడినటువంటి చులకన భావాన్ని, అసమానతలను తొలగించి; సమానత్వాన్ని, శాంతిని, అభివృద్ధిని, సాధించాలనే ధ్యేయంతో 6 జూన్ 1954లో భారత జాతీయ మహిళా సమాఖ్య ఏర్పడిందని ఎన్ఎఫ్ఐడబ్ల్యు జాతీయ కార్యదర్శి డాక్టర్ రజిని పేర్కొన్నారు. మంగళవారం హిమాయత్‌నగర్‌లోని మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షురాలు సృజన అధ్యక్షతన మహిళా సమాఖ్య 70వ వార్షికోత్సవానికి రజిని ముఖ్యఅతిథిగా హాజరై జెండా ఆవిష్కరించారు. అనంతరం రజని మాట్లాడుతూ మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా, బాల్య వివాహాల నిషేధానికి , వరకట్న నిషేధం కొరకు నిత్యవసర వస్తువుల ధరలు తగ్గించాలని, స్త్రీలపై అత్యాచారాలను అరికట్టాలని పోరాడిన సంఘం ఎన్ఎఫ్ఐడబ్ల్యు అని తెలిపారు. స్త్రీకి విద్యా, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి ఆర్థిక స్వాలంబన ఏర్పాటు చేయాలని, మూడవ వంతు రిజర్వేషన్లు అమలు చేయాలని పోరాటాలు చేస్తుందన్నారు. మహిళలు తల్లిగా, ఉద్యోగిగా రెండు బాధ్యతలు నిర్వర్తిస్తారు కనుక, మాతా శిశు సంరక్షణ బాధ్యత సామాజిక బాధ్యతగా గుర్తించి సౌకర్యాలు, సెలవులు కల్పించాలని ఎన్ఎఫ్ఐడబ్ల్యు పోరాడుతుందన్నారు. మహిళా సమాఖ్య సీనియర్ నాయకురాలు పశ్య పద్మ మాట్లాడుతూ ఎంతోమంది మహిళల త్యాగాల ఫలితంగా ఏర్పడ్డ మహిళా సమాఖ్య ఎన్నో విజయాలను సాధించిందన్నారు. స్వాతంత్రోద్యమం నాటి నుంచి నేటి వరకు మహిళలు ఎదుర్కొంటున్న అన్ని రకాల సమస్యలపై నిరంతరం పోరాటాలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి మహిళా సమాఖ్య ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ మండ సదా లక్ష్మి సహాయ కార్యదర్శి ఎండి ఫైమీద, కోశాధికారి జె.లక్ష్మి ఉపాధ్యక్షురాలు బండి జంగమ్మ. రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ప్రమీల. మాధవి. రొయ్యల గిరిజ. హైమావతి. మహాలక్ష్మి. షహనా, అంజుమ్, శ్రీదేవి, నరసమ్మ, జ్యోతి, కమలమ్మ, స్వరూప, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# మూడు నుంచి ఎనిమిది స్థానాలు

### కంటోన్మెంట్‌లో విజయం సాధించాం
### టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రజాతీర్పును కాంగ్రెస్ గౌరవిస్తుందని ఎంఎల్‌సి, టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్‌గౌడ్ అన్నారు. తెలంగాణ, దేశ ఓటరులందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. గాంధీభవన్‌లో మంగళవారం కాంగ్రెస్ సీనియర్ నేతలు వి.హనుమంతరావు, హర్కర వేణుగోపాల్, పుష్పలీల, సునీతరావు, కైలాష్, మెట్టుసాయి, సంగిశెట్టి జగదీశ్‌లతో కలిసి మహేశ్ కుమార్ గౌడ్ మీడియాతో మాట్లాడారు. గతంలో కాంగ్రెస్ మూడు లోక్‌సభ స్థానాలు ఉంటే, ఇప్పుడు ఎనిమిది స్థానాలు వచ్చాయన్నారు. కంటోన్మెంట్‌లో శ్రీగణేశ్‌ను గెలిపించారంటే రేవంత్ పాలనను ప్రజలు హర్షిస్తున్నట్టేనన్నారు. ఎగ్జిట్ పోల్స్ ఎగ్జాట్ పోల్స్ కాలేకపాయాయన్నారు. తాము మొదటి నుంచి అదే చెప్పామన్నారు. తెలంగాణ ప్రజలు విలక్షణమైన ఓటింగ్ సరళి అనుసరించారన్నారు. బిఆర్‌ఎస్‌లోపై స్థాయిలో నాయకులు, కింది స్థాయిలో కార్యకర్తలు మూకుమ్మడిగా బిజెపికి ఓట్లు వేశారని ఆరోపించారు. బిజెపిని గెలిపించేందుకు బలహీనమైన అభ్యర్థులను బరిలో నిలిపారని విమర్శించారు. రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పని అయిపోయిందని ప్రచారం చేశారని, భవిష్యత్ అంత రాహుల్ గాంధీదే అని ప్రజలు భావిస్తున్నారని తెలిపారు. ఎంపి ఎన్నికల్లో పార్టీ విజయానికి పనిచేసిన కింది స్థాయి కార్యకర్తలు, మహిళలకు అందరికీ ఈ సందర్భంగా మహేశ్ కుమార్‌గౌడ్ ధన్యవాదాలు తెలిపారు. ఊహకు అందకుండా ఎపి ఫలితాలు వచ్చాయన్నారు. కెసిఆర్ పాలన మాదిరి జగన్ పాలన సాగిందన్నారు. రాచరిక పాలనకు ఎప్పుడు ప్రజలు వ్యతిరేకిస్తారన్నారు. అభ్యర్థుల ఎంపికలో ఎక్కడ తప్పిదాలు జరగలేదన్నారు. ప్రజల ఆకాంక్షలు, కోరిక మేరకే తమ పాలన ఉంటుందన్నారు. ఫలితాలపై తప్పని సరిగా సమీక్షలు ఉంటాయన్నారు. తప్పిదాలు ఉంటే, సరిదిద్దుకుంటామన్నారు.

**మోదీని ప్రజలు నమ్మలేదు : హనుమంతరావు**

పదేళ్లలో ప్రధాని నరేంద్రమోదీ ఏం చేయలేదని, ఇచ్చిన హామీలు నిలబెట్టుకోలేదని హనుమంతరావు విమర్శించారు. ఆప్‌కి బార్ 400 సౌ పార్ అన్న మోదీని ప్రజలు నమ్మలేదన్నారు. ఉత్తరప్రదేశ్‌లో 44 సీట్లు కూటమి గెలుస్తుంది అంటే మోదీని ప్రజలు తిరస్కరించినట్టేనన్నారు. దేశ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని రాజ్యసభ సభ్యులు ఎం.అనిల్ కుమార్‌యాదవ్ అన్నారు. దేశ ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించి మోదీ ప్రధాని పదవికి నైతిక భాధ్యత వహించి రాజీనామా చేయాలన్నా రు. కాంగ్రెస్‌కి మద్దతు పలికి ప్రజలు 8 స్థానాలు గెలిపించారన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు కలిసి రావాలి : మంత్రి కొండా సురేఖ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రకృతిని ప్రేమిస్తూ, ప్రకృతిని పరిరక్షిస్తూ, ప్రకతితో కలిసి జీవనం సాగిస్తేనే మానవాళికి మనుగడ వుంటుందని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మంత్రి సురేఖ పర్యావరణ ప్రేమికులు, ప్రజలకు తన సందేశమిచ్చారు. ఈ విశ్వంలో ప్రత్యేకమైన శీతోష్ణస్థితి పరిస్థితులు కలిగి జీవించడానికి అనువైన ఒకే ఒక గ్రహమైన భూమిని జాగ్రత్తగా కాపాడుకోవడం మన విధి అని మంత్రి కొండా సురేఖ అన్నారు. అకాల వర్షాలు, కరువు కాటకాలు, వరదలు, పలు జీవజాతుల అంతర్ధానం, భూతాపం, సముద్రమట్టాల పెరుగుదల, రుతువుల్లో అవాంఛనీయ మార్పులు వంటి ప్రతికూల పరిస్థితులు మానవాళిని ప్రమాదంలోకి నెడుతున్నాయన్నారు. ప్రభుత్వ కార్యాచరణకు తోడు ప్రజలు కూడా పర్యావరణ పరిరక్షణకు పూనుకున్నప్పుడే ఆశించిన లక్ష్యాలు సాధ్యమవుతాయన్నారు. 'ప్రపంచ పర్యావరణ దినోత్సవ' స్ఫూర్తిని ఏడాది పొడవునా ప్రదర్శిస్తూ, పచ్చదనం పెంపుదలకు, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కలిసి రావాలని మంత్రి సురేఖ ప్రజలకు పిలుపునిచ్చారు.

# రాష్ట్రంలో కాంగ్రెస్‌కు మెరుగైన ఫలితాలు

### భారీ మెజారిటీలు సాధించిన కాంగ్రెస్ అభ్యర్థులు
### పెరిగిన ఓటు బ్యాంకు



**ప్రజాపక్షం /హైదరాబాద్:** లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ మెరుగైన ఫలితాలను సాధించింది. గత 2019 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ 3 స్థానాలలో గెలువగా ఈసారి ఎన్నికల్లో 8 నియోజకవర్గాలను కైవసం చేసుకుంది. 2019 ఎన్నికల్లో పోలైన ఓట్లలో కాంగ్రెస్‌కు 29.48 శాతం ఓట్లు రాగా ఈసారి 40.10 శాతం ఓట్లను సాధించింది. రాష్ట్రంలో గెలిచిన అన్ని లోక్‌సభ స్థానాల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థులు భారీ మెజారిటీ సాధించడం గమనార్హం. ఇందుకు కాంగ్రెస్‌కు మిత్రపక్షంగా ఉన్న సిపిఐ, సిపిఐ(ఎం) తదితర పార్టీల బలం తోడైంది. కమ్యూనిస్టుల ప్రభావం కలిగిన 7 లోక్‌సభ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు భారీ మెజారిటీలు వచ్చాయి. దేశంలోనే అత్యధిక మెజారిటీ సాధించిన స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలిచిన నల్లగొండ నియోజకవర్గం రెండవ స్థానంలో నిలిచి దేశ ప్రజల దృష్టిని ఆకర్షించింది. నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి దాదాపు 5.51 లక్షల ఓట్ల మెజారిటీని సాధించి రెండవ స్థానంలో నిలిచారు. అదే విధంగా కాంగ్రెస్ అభ్యర్థులు ఖమ్మంలో రఘురామ్ రెడ్డి 4.56 లక్షల మెజార్టీని, వరంగల్‌లో కడియం కావ్య 2.02 లక్షల మెజార్టీని, మహబూబాబాద్‌లో అభ్యర్థి బలరాం నాయక్ 3.24 లక్షల మెజారిటీని, భువనగిరిలో కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి 1.95 లక్షల మెజారిటీతో, పెద్దపల్లిలో గడ్డం వంశీ కృష్ణ 1.31 లక్షల మెజారిటీతో, నాగర్ కర్నూలలో మల్లు రవి 85 వేల పైచిలుకు మెజార్టీతో విజయం సాధించారు. కాగా ఒక్క జహీరాబాద్‌లోనే కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్ షెట్కర్‌కు 45 వేలకు పైచిలుకు తక్కువ మెజారిటీ వచ్చింది. ఇదిలా ఉండగా రఘువీర్‌రెడ్డి తండ్రి, కాంగ్రెస్ పార్టీ రాజకీయ ఉద్దండులు కుందూరు జానారెడ్డి అనుసరించిన ఎన్నికల వ్యూహం నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గంలో ఫలించిందని రాజకీయ పరిశీలకులు అంటున్నారు.

**రికార్డు బద్దలు కొట్టిన రఘువీర్‌రెడ్డి...**పార్లమెంట్ ఎన్నికల ఫలితాల్లో నల్లగొండ అభ్యర్థి అత్యధిక మెజారిటీ సాధించి, రెండు తెలుగు రాష్ట్రాల్లోనే అత్యధిక మెజారిటీ సాధించిన వ్యక్తిగా రికార్డు నమోదు చేసుకున్నారు. గతంలో జగన్ పేరుపై ఉన్న ఈ రికార్డును ఇప్పుడు రఘువీర్‌రెడ్డి అధిగమించారు. నల్లగొండ లోక్‌సభస్థానం నుంచి దాదాపు 5.51లక్షలకుపైగా మెజారిటీ సాధించి తెలుగు రాష్ట్రాల్లో భారీ మెజారిటీ సాధించిన వ్యక్తిగా రికార్డు తన ఖతాలో వేసుకున్నారు. 2011లో జగన్ కడప లోక్‌సభ ఉప ఎన్నికల్లో భాగంగా 5.43 లక్షల మెజారిటీ సాధించి, తెలుగు రాష్ట్రాల్లో అత్యధిక మెజారిటీ సాధించిన ఎంపిగా రికార్డు తన పేరుపై నమోదు చేసుకోగా ఈ ఎన్నికల్లో రఘువీర్‌రెడ్డి ఆ రికార్డును బ్రేక్ చేశారు. ఇదిలా ఉండగా ఈ రికార్డులు నమోదు చేసిన ఇద్దరు కూడా కాంగ్రెస్ సీనియర్ నాయకుల వారసులే కావడం గమనార్హం. ఒకరు మాజీ సిఎం, దివంగత నేత వైఎస్.రాజశేఖర్‌రెడ్డి కుమారుడు కాగా, మరోకరు కాంగ్రెస్ సీనియర్ నేత కందూరు జానారెడ్డి కుమారుడు. అంతేగాక నల్లగొండ పార్లమెంట్ స్థానంలో ఇప్పటివరకు జరిగిన ఎన్నికల్లో అత్యధిక మెజారిటీ సాధించింది కూడా రఘువీర్‌రెడ్డి కావడం విశేషం. 1952లో జరిగిన తొలి పార్లమెంట్ ఎన్నికల్లో నల్గొండ నుంచి కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థి రావి నారాయణరెడ్డి 3,09,162 ఓట్ల ఆధిక్యత సాధించారు.

## బిజెపికి రాజకీయ ఓటమి

(మొదటి పేజీ తరువాయి)

మండిపడ్డారు. కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల ప్రణాళికపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పచ్చి అబద్ధాలు ప్రచారం చేయడాన్ని కూడా ప్రజలు బాగా గమనించారని అన్నారు.

**టిడిపి, జెడి(యు)లను కలుస్తాం..**
**ప్రభుత్వ ఏర్పాటుకు ప్రయత్నిస్తాం : రాహుల్**

'ఇండియా' కూటమి బుధవారంనాడు తమ పూర్వ మిత్రులను కలుస్తుందనీ, ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు కలిసి రావాల్సిందిగా ఆహ్వానిస్తుందనీ కాంగ్రెస్‌పార్టీ నాయకుడు రాహుల్‌గాంధీ చెప్పారు. మల్లికార్జున ఖర్గేతోపాటు ఆయన పత్రికాగోష్టిలో మాట్లాడుతూ, తెలుగుదేశంపార్టీ, జనతాదళ్ (యు) పార్టీల నాయకులను కలుసుకుంటామనీ, ప్రభుత్వం ఏర్పాటుకు కలిసి రావాలని అడుగుతామన్నారు. ఎన్‌డిఎ కూటమికి, 'ఇండియా' కూటమికి మధ్య ఉన్న తేడా సుమారుగా 60 స్థానాలు మాత్రమేననీ, అందువల్ల వారి సహకారం అడుగుతామన్నారు. 2019లో యునైటెడ్ ప్రోగ్రెసివ్ ఎలయెన్స్ (యుపిఎ) కూటమిలో చంద్రబాబు ఒక భాగస్వామిగా ఉన్నారు. బిజెపికి, టిడిపికి మధ్య కేవలం ఎన్నికల ముందుగా మాత్రమే ఒప్పందం కుదిరింది. ఐతే ఓట్ల లెక్కింపు జరుగుతున్న తరుణంలో కూడా ఎన్నికల నిపుణులు తమ చర్చల్లో, 'ఇండియా' కూటమివల్ల మరిన్ని ప్రయోజనాలు కలుగుతాయని భావించినట్లయితే చంద్రబాబునాయుడు తనవిధేయతను 'ఇండియా' కూటమివైపే మళ్ళించే అవకాశం ఉందని కూడా సంకేతాలు ఇచ్చారు. ఎన్‌డిఎ కూటమికి 292 స్థానాలు లభించగా, 'ఇండియా' కూటమికి 232 స్థానాలు లభించాయి. మోదీ ప్రచారంలో కోరినవిధంగా ఆ పార్టీకి మెజారిటీని ప్రజలు ఇవ్వలేదు. ''ఇండియా కూటమి ప్రతిపక్షంలో కూర్చోవాలని నిర్ణయించుకుందా? లేక ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి ప్రయత్నాలు చేయాలని అనుకుంటోందా?'' అని పాత్రికేయులు ప్రశ్నించగా రాహుల్ గాంధీ స్పందిస్తూ, బుధవారంనాడు బహుశా 'ఇండియా' కూటమి సమావేశం జరుగుతుందనీ, ఆ సమావేశంలో తగిన నిర్ణయం తీసుకుంటామనీ అన్నారు. ''మేం మా కూటమిలోని భాగస్వామ్యపార్టీలను గౌరవిస్తాం, వారితో సంప్రదించకుండా, అభిప్రాయాలు సేకరించకుండా పత్రికాగోష్టిలో మా అంతట మేముగా ఒక ప్రకటన చేయలేం'' అని రాహుల్‌గాంధీ అన్నారు. 'ఇండియా' కూటమి తీసుకున్న నిర్ణయం ప్రకారమే తాము నడుచుకుంటామన్నారు. ఇదే ప్రశ్నను మల్లికార్జున ఖర్గేను కూడా ప్రశ్నించగా, కొత్త భాగస్వాములకోసం అన్వేషణ గురించి ఆయన సూచనాప్రాయంగా చెప్పారు. కాగా, దేశ రాజ్యాంగాన్ని కాపాడేందుకే ఈ ఎన్నికల్లో ప్రధానంగా పోరాటం జరిగిందని రాహుల్‌గాంధీ అన్నారు. దేశ ప్రజలు రాజ్యాంగాన్ని కాపాడుకోవడం కోసమే ఏకమయ్యారని తాను భావిస్తున్నానన్నారు. దేశంలో పేదలు, అణగారిన వర్గాలే తమ పక్షాన నిలబడ్డారన్నారు. కాంగ్రెస్‌పార్టీ, ఎన్‌డి కూటమి భారతదేశానికి సరికొత్త రూపు ఇవ్వగలదని, పేదల పక్షాన రాజకీయాలు చేస్తుందని అన్నారు. ''ఈ ఎన్నికల్లో ప్రజలు ప్రధానంగా ఈ దేశాన్ని నడిపించడానికి నరేంద్రమోడీ మాకు అక్కరలేదని చెప్పారని, అమిత్ షా తమకు అవసరంలేదని చెప్పారన్నారు. ఈ సందర్భంగా రాజ్యాంగాన్ని రక్షించేందుకు అండగా నిలబడినందుకు ఉత్తర ప్రదేశ్ ప్రజలకు రాహుల్‌గాంధీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. కాంగ్రెస్‌పార్టీ 'ఇండియా' కూటమి పార్టీలను గౌరవిస్తుందనీ, తమ కూటమి ఎక్కడ పోరాటం చేసినాగానీ ఒక్కటిగా ఏకమై పోరాటం చేస్తుందని ప్రకటించారు. ఇంతకీ వేనాడ్, రాయ్ బరేలీ రెండు చోట్లా గెలిచినందువల్ల ఏ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తారని, ఏ నియోజకవర్గానికి రాజీనామా చేస్తారని ప్రశ్నించగా ఈ విషయంలో ఇంకా తాను ఒక నిర్ణయం తీసుకోలేదని రాహుల్‌గాంధీ చెప్పారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com

## కార్యకర్తలకు కృతజ్ఞతలు : రంజిత్‌రెడ్డి



ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి : చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి, బిజెపి అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిల మధ్య హోరాహోరీగా పోటీ సాగింది. 7 రౌండ్ పూర్తయ్యే సరికి బిజెపి అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి 90,205 ఓట్ల ఆధిక్యంలో కొనసాగుతున్నా సమయంలోనే కాంగ్రెస్ అభ్యర్థి గడం రంజిత్‌రెడ్డి కౌంటింగ్ కేంద్రం నుంచి వెనుతిరిగారు. ఈ సందర్భంగా రంజిత్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ నా గెలుపు కోసం కష్టపడిన ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు కృతజ్ఞతలు తెలిపారు. కారణం ఏదైనా ఓటమికి బాధ్యత వహిస్తున్నానని తెలిపారు. నూతనంగా ఎంపిక కాబోతున్న బిజెపి కొండ విశ్వేశ్వర్‌రెడ్డికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు


# ప్రజాపక్షం మహానగరి

హైదరాబాద్ — రంగారెడ్డి

హైదరాబాద్ బుధవారం | 05 జూన్, 2024



## ఘనంగా స్పీకర్ జన్మదిన వేడుకలు



ప్రజాపక్షం/నార్సింగి : తెలంగాణ అసెంబ్లీ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ జన్మదిన వేడుకలు మంగళవారం ఆయన స్వగృహములో ఘనంగా జరిగాయి. రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధి సంస్థ ఛైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్, నార్సింగి మున్సిపల్ కోకాపేట కౌన్సిలర్ జి.శివారెడ్డి, మైలారం శ్రీనివాస్, గణేష్ పాల్గొని స్పీకర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సభాపతి ఆయురారోగ్యాలతో జీవించాలని, అదే విధంగా తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపించాలని ఆకాంక్షించారు.

## తెలంగాణ సాయుధ పోరాటయోధుడు నారాయణరెడ్డి



ప్రజాపక్షం/అబ్దుల్లాపూర్‌మెట్ : తెలంగాణ సాయుధ పోరాటయోధుడు రావి నారాయణ రెడ్డి జీవితచరిత్రను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని సిపిఐ రాష్ట్ర సమితి నాయకులు యం.యాదిరెడ్డి అన్నారు. సిపిఐ అధ్వర్యంలో పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని కుంట్లూర్‌లోని రావినారాయణరెడ్డి నగర్‌లో పార్టీ కార్యాలయంలో మంగళ వారం నిర్వహించినా రావినారాయణరెడ్డి జయంతి వేడుకలకు ఆయన హాజరై నారాయణరెడ్డి ఫొటోకు పూల మాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సిపిఐ అధ్వర్యంలో తెలంగాణలో భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటం చేసి పేదలకు లక్షలాంది ఎకరాల భూములు రావి నారాయణరెడ్డి పంచిపెట్టినారన్నారు. తన సొంత భూమిని 700 ఎకరాలను భూమిలేని పేద ప్రజలకు పంపిణీ చేసినా గొప్ప త్యాగశీలి అన్నారు. దేశంలో మొదటి పార్లమెంటు భవనం ప్రారంచిన ఘనత అయనకే దక్కిందన్నారు. సిపిఐ రథసారధిగా నిరవతరం ప్రజల పక్షాన పోరాటం చేసినా తెలంగాణ సాయుధ పోరాట యెధుడు రావి నారాయణరెడ్డి జీవిత చరిత్రను నేటి యువత తెలుసుకోవాలన్నారు. ఆయన ఆశయసాధనకు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ కౌన్సిలర్ పబ్బతి లక్షణ్, మాజీ కౌన్సిలర్ హరిసింగ్ నాయక్, నర్సింహ్మా, ప్రసాద్, నారాయణ, యాదగిరి, వెంకటేష్, నిరంజన్, అరుణ, దేవమ్మ, చందన, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## ఎపి ఫలితాలపై స్థానిక టిడిపి శ్రేణుల సంబరాలు



ప్రజాపక్షం/షాద్‌నగర్: ఆంధ్రప్రదేశ్ శాసన సభ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయం సాధించడంతో స్థానిక తెలుగుదేశం పార్టీ శ్రేణుల సంబరాలు అంబరాన్ని అంటాయి. మంగళవారం షాద్‌నగర్ ముఖ్యకూడలిలో మాజీ ఎంపిపి చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ శ్రేణులు సంబరాలు అంబరాన్ని అంటే విధంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున బాణా సంచాలు కాల్చి ఒకరికొకరు స్వీట్లు తినిపించుకొని సంబరాల్లో మునిగిపోయారు. ఈ సందర్భంగా చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ శాసన సభ ఎన్నికల్లో తెలుగు ప్రజలు తెలుగుదేశానికి పట్టం కట్టడం ఎంతో సంతోషించదగ్గ విషయమని పేర్కొన్నారు. వైసిపి అరాచకాలకు స్వస్తి చెప్పి తెలుగుదేశం పార్టీకి విజయం కట్టబెట్టడం గర్వంగా ఉందని అన్నారు. ఎన్నికల కౌంటింగ్ ప్రారంభమైనప్పటి నుండి తెలుగుదేశం పార్టీ ముందంజలో వెళ్తుండటం ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు. తెలుగు ప్రజల సమస్యల పరిష్కారం కోసం నారా చంద్రబాబునాయుడు నిరంతరం కృషి చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు గంధం ఆనంద్, వెంకటయ్య గౌడ్, అన్మారి వెంకటయ్య, భాస్కర్ గౌడ్, యాదయ్య గౌడ్, భూపతిరెడ్డి, రమేష్, శ్రీను, సాయికుమార్, కమ్మదనం కుమార్, డి.అనంతయ్య, బక్కని శ్రీను, ఎంసి రాజు, బక్కని కృష్ణయ్య, కుంటల యాదయ్య, లింగారం రమేష్, చాపలు సత్యనారాయణ, వీరేష్ గౌడ్, వెంకటయ్య గౌడ్, షాబాద్ నర్సింలు, గంటల శంకరయ్య, రవి, అశోక్ గౌడ్, చెన్నయ్యలు పాల్గొన్నారు.

## సిఎం సొంతజిల్లాలో కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ

సంబరాల్లో బిజెపి శ్రేణులు



ప్రజాపక్షం/కొత్తూరు: పార్లమెంట్ సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ కూటమికి పాలమూరు ప్రజలు దిమ్మతిరిగే సమాధానం ఇచ్చారు. మంగళవారం పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్‌లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన బుద్ది చెప్పడంతోపాటు భారతీయ జనతా పార్టీకి పట్టం కట్టారు. దాంతో షాద్‌నగర్, కొత్తూరు, కేశంపేట, జిల్లేడు చౌదరిగూడ, నందిగామ మండలాల్లో బిజెపి శ్రేణులు సంబరాల్లో మునిగిపోయారు. ముఖ్య కూడళ్ల వద్ద పెద్ద ఎత్తున బాణా సంచాలు కల్చి ఒకరికొకరు స్వీట్లు తినిపించుకొని సంబరాల్లో మునిగిపోయారు. ఈ సందర్భంగా బిజెపి నేతలు మాట్లాడుతూ తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సొంత జిల్లాలో ఒకవైపు ఎంఎల్‌సి, మరోవైపు పార్లమెంట్ స్థానాలను కొల్పోవడం చూస్తుంటే కాంగ్రెస్ పార్టీపై ప్రజల్లో ఎంతమేరకు వ్యతిరేకత ఉందో అర్థమవుతుందని అన్నారు. దేశ వ్యాప్తంగా బిజెపికి భారీ స్థాయిలో ఓట్లు వేసి ప్రధాన మంత్రిగా మళ్లీ నరేంద్రమోదీని చేసే అవకాశం ప్రజలు ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు. బిజెపిని ఓడించేందుకు కుట్రలు చేసినా..ఎన్ని ప్రయత్నాలు చేసినా చివరకు ధర్మమే విజయం సాధించిందని గుర్తు చేశారు. బిజెపిపై నమ్మకం పెట్టుకొని ఓట్లు వేసిన ప్రతి ఒక్కరికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. అదే విధంగా కేశంపేట మండల కేంద్రంలో బిజెపి నాయకలు పెద్ద ఎత్తున సంబరాల్లో మునిగిపోయారు. బాణా సంచాలు కాల్చి భారత్ మాతకీ జై అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేతలు కక్కునూరి వెంకటేష్ గుప్తా, చెంది మహేందర్‌రెడ్డి, అశోక్, శ్రీనివాస్, రాఘవేందర్ గౌడ్, సోప్పరి నర్సింహ్మా, కుమ్మరి నర్సింహ్మా, యుగేందర్, పల్లె అంజయ్య, శివాజీ, ఉదయ్ గౌడ్, విఠల్ గౌడ్, శేఖర్, తట్టేపల్లి నర్సింహ్మా, కృష్ణ, శ్రీనివాస్, మల్లేష్, ఐలయ్య, రాఘవేంద్రచారి, శేఖర్‌రెడ్డి, రఘువేంద్రరెడ్డి, రావుల శ్రీనివాస్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రేటర్‌లో సత్తాచాటని బిఆర్ఎస్

### కంటోన్మెంట్ సిట్టింగ్ స్థానంలో ఓటమిపాలు

### డీలా పడిన శ్రేణులు

ప్రజాపక్షం/హైదరాబాద్ : గ్రేటర్ హైదరాబాద్‌లో లోక్‌సభ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ తుడించిపెట్టుకపోయింది. కనీసం ఒక్క స్థానాన్ని కూడా నిలబెట్టుకోలేకపోయింది. గత లోక్‌సభ ఎన్నికల్లో వచ్చిన చెవెళ్ల నియోజకవర్గం కూడా ఈసారి గల్లంతైంది. అంతేకాకుండా కంటోన్మెంట్ సిట్టింగ్ స్థానాన్ని సైతం కోల్పోయింది. కంటోన్మెంట్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థి శ్రీగణేశ్ విజయం సాధించడంతో సిట్టింగ్ స్థానంలో సైతం ఓటమిపాలైంది. లోక్‌సభ నియోజకవర్గాలలో మూడవ స్థానంతో సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి బిఆర్ఎస్‌కు వచ్చింది. హైదరాబాద్, సికింద్రాబాద్, మల్కాజిగిరి, చెవెళ్ల లోక్‌సభ స్థానాలు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోకి వస్తాయి. గత శాసనసభ ఎన్నికల్లో గ్రేటర్ హైదరాబాద్‌లోని 24 శాసనసభ నియోజకవర్గాలలో బిఆర్ఎస్ 16, ఎంఐఎం 7, బిజెపి ఒక్క స్థానాల్లో విజయం సాధించాయి. శాసనసభ ఎన్నికల్లో అధికారం కోల్పోవడంతో బిఆర్ఎస్ ఒక్కసారిగా బలహీనపడింది. అప్పటి నుంచి బిఆర్ఎస్‌కు వరుస దెబ్బలు తగులుతున్నాయి. గ్రేటర్ హైదరాబాద్ నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి , డిప్యూటి మేయర్ శ్రీలత రెడ్డి, ఖైరతాబాద్ ఎంఎల్‌ఎ దానం నాగేందర్‌లు వరుసగా పార్టీని వీడారు. శాసనసభ ఎన్నికల్లో 16 స్థానాల్లో విజయం సాధించినా ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో తీవ్ర పరాభావం ఎదురవడంతో బిఆర్ఎస్ శ్రేణులు తీవ్ర విస్మయానికి గురవుతున్నాయి. మూడు లోక్‌సభ స్థానాల్లో ఎక్కడ కూడా బిఆర్ఎస్ మెరుగైన ప్రదర్శన చేయలేకపోయింది. గత లోక్‌సభ ఎన్నికల్లో చెవెళ్ల నియోజకవర్గంలో బిఆర్ఎస్ విజయం సాధించింది. ప్రస్తుత లోక్‌సభ ఫలితాల్లో కనీసం ఒక్క స్థానంలో కూడా విజయం సాధించకపోవడంతో బిఆర్ఎస్‌కు మింగుడుపడని పరిస్థితి నెలకొంది. మూడు నియోజకర్గాలలో మూడు, నాలుగవ స్థానాలకు పరిమితం కావడం బిఆర్ఎస్ భవితవ్యం ప్రశ్నార్థకం అయ్యే పరిస్థితులు నెలకొన్నాయని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. అంతేకాకుండా కంటోన్మెంట్ సిట్టింగ్ ఎంఎల్‌ఎ స్థానంలో ఓటమిపాలుకావడం పార్టీ శ్రేణుల మానసిక స్థైర్యాన్ని మరింత దెబ్బతీసిందని రాజకీయా విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



## జనసేన సంబరాలు

ప్రజాపక్షం/షాద్‌నగర్: ఎపి శాసనసభ సార్వత్రిక ఎన్నికల్లో జనసేన వ్యవస్థాపక అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ విజయం సాధించడంతో స్థానిక జనసేన నేతలు రాజునాయక్, ఎండి అష్రఫ్ హర్షం వ్యక్తంచేశారు. మంగళవారం షాద్‌నగర్‌లో బాణాసంచా కాల్చి పెద్దఎత్తున సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాసన సభ ఎన్నికల్లో జనసేనకు కేటాయించిన 21స్థానాల్లో మంచి ఫలితాలు రావడం, అందుకు సహకరించిన తెలుగుదేశం, బిజెపి పార్టీలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే పవన్ కళ్యాణ్‌కు భారీమెజార్టీ కట్టబెట్టిన పిఠాపురం నియోజకవర్గ ప్రజలకు ధన్యవాదలు తెలిపారు. కార్యక్రమంలో జర్పుల రాజునాయక్, మహ్మద్ అశ్రఫ్, పవన్ నాయక్, పార్టీ సభ్యులు నాగరాజు, దాసరి శ్రీను, బిచ్చు నాయక్, జగన్ నాయక్, అరవింద్, శ్రీకాంత్, అంజి, మైపాల్, నాని, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



## స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి

### ఎంఎల్‌సి నవీన్‌కుమార్‌రెడ్డి



ప్రజాపక్షం/షాద్‌నగర్: స్థానిక సంస్థల ఎంఎల్‌సి నాగర్‌కుంట నవీన్‌కుమార్ రెడ్డి శ్రీ భవాని మాత అమ్మవారి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట గ్రామ శివారులో ఉన్న భవాని మాత దేవాలయంలో ఎంఎల్‌సి నవీన్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆలయ పూజారులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం ఫలికారు. ఈ సందర్భంగా నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంపిటిసిలు, జడ్పిటిసిలు, ఎంపిపిలు, కౌన్సిలర్లు తమకు ఓటు వేసి గెలిపించినందుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధుల సమస్యలను పరిష్కరించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని వివరించారు. వారి సమస్యలను శాసన మండలిలో ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళెంకు ప్రయత్నిస్తానని తెలిపారు. ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానని వివరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు బెంది శ్రీనివాస్‌రెడ్డి, కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్, శివాచారి, మాజీ సర్పంచ్ సాయిప్రసాద్, రాజు, దినేష్ సాగర్, గణేష్, రఘుగౌడ్‌లతో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

# కంటోన్మెంట్‌లో కాంగ్రెస్ ప్రభంజనం



ప్రజాపక్షం/హైదరాబాద్ : సికింద్రాబాద్ కంటోన్మెంట్ రాజకీయాల్లో కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం సృష్టించింది. ఉప ఎన్నికలో బిఆర్ఎస్ అభ్యర్థి నివేదితపై కాంగ్రెస్ అభ్యర్థి శ్రీగణేష్ 9725 ఓట్ల భారీ మెజారిటీతో గెలుపొందారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఒక్క అసెంబ్లీ స్థానం కూడా కైవసం చేసుకోలేకపోయిన కాంగ్రెస్ పార్టీ కంటోన్మెంట్‌ను కైవసం చేసుకోవడం విశేషమని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఉప ఎన్నిక ఫలితంలో కాంగ్రెస్ అభ్యర్థి శ్రీగణేష్ విజయంలో ముమ్మాటికీ తెర ముందు ఉప ఎన్నిక ఇంచార్జ్, కాంగ్రెస్ యువ నాయకుడు రఘునాథ్ యాదవ్ ఉండగా, తెర వెనుకాల నుండి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కృషి, పట్టుదల పూర్తిస్థాయిలో ఎంతో ఉందని పార్టీ వర్గాలు చెప్పాయి. చిన్న పెద్ద తేడా లేకుండా పట్టుదలతో కష్టపడితే రాజకీయాలలో చక్రం తిప్పవచ్చని రఘునాథ్ యాదవ్ నిరూపించారని కాంగ్రెస్ పార్టీ స్థానిక నాయకులు అంటున్నారు. సాయన్న కూతురు సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎంఎల్‌ఎ లాస్య నందిత హఠాత్తుగా మరణించడంతో ఈ నియోజకవర్గానికి ఉప ఎన్నికల నగారా మోగింది. కాంగ్రెస్ అభ్యర్థిగా శ్రీగణేష్‌ను ప్రకటించగా, బిఆర్ఎస్ లాస్య నందిత సోదరి నివేదితను, బిజెపి నుంచి వంశ తిలక్‌లను అభ్యర్థులుగా ప్రకటించాయి. అలాంటి సమయంలో సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాలతో కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు రఘునాథ్ యాదవ్‌ను రంగంలోకి దింపింది. ఓవైపు ఎంఎల్‌ఎ లాస్య నందిత మరణంతో ఆమె సోదరికి సానుభూతి ఉండగా, ఎన్నికకు 15 రోజుల ముందు కంటోన్మెంట్ ఇంచార్జ్‌గా వచ్చిన యువ నాయకుడు రఘునాథ్ యాదవ్, మొదటి రోజు నుంచే కంటోన్మెంట్‌లోని కిందిస్థాయి కార్యకర్తల నుండి రాష్ట్ర నాయకుల వరకు అందరిని కలుపుకుపోతూ కాంగ్రెస్ బలాన్ని పెంచారు. బిఆర్ఎస్ మాజీ మంత్రుల నుంచి ఎన్ని అడ్డంకులు వచ్చినా, ఎన్ని అవమానాలు ఎదురైనా అన్నింటిని ఎదుర్కొని ధైర్యంగా కంటోన్మెంట్ ప్రజలతో కులమతాలు, వర్గాలకు అతీతంగా రఘునాథ్ యాదవ్ దగ్గరయ్యారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సలహాలు, సూచనలు తీసుకుని దాదాపు 15 రోజులు రఘునాథ్ యాదవ్ తన అనుచరులతో తీవ్రంగా కష్టపడి, కార్యకర్తలకు అవసరమున్న పుడల్లా పక్కనే ఉంటూ, వారికి ధైర్యాన్ని నింపారు. ఎన్నికలకు వారం రోజుల ముందు నుంచే ప్రణాళికలు, గెలుపునకు కావలసిన వ్యూహాలు సిద్ధం చేసుకుని కంటోన్మెంట్ రాజకీయ చరిత్రనే చక్రం తిప్పారు.



## మల్కాజ్‌గిరిలో ఎగిరిన కాషాయం జెండా

### బిఎన్ రెడ్డి కార్పొరేటర్ లచ్చిరెడ్డి



ప్రజాపక్షం/ వనస్థలిపురం: మల్కాజ్గిరి పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి అభ్య ర్థి ఈటెల రాజేందర్ గెలుపొందడం సంతోషదాయకమని, బిజెపి కాశయ్య జెండాను మల్కాజ్గిరిలో ఎగరవేశామని బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. దేశవ్యాప్తంగా లోక్శభ ఎన్నికల ఫలితాల్లో మల్కాజ్గిరి పార్లమెంట్ లోక్సభ స్థానం నుంచి ఈటెల రాజేందర్ ను ఆకాంక్షిస్తూ బి.ఎన్.రెడ్డి నగర్ లోని ఎన్జీవోస్ కాలనీ వద్ద బిజెపి పార్టీ అధ్వర్యంలో సంబరాలు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ లచ్చిరెడ్డి మాట్లాడుతూ ఉద్యమకారుడు, తెలంగాణ ముద్దుబిడ్డ మాజీ మంత్రివర్యులు ఈటెల రాజేందర్ ను ప్రజలు ఆశీర్వదించి గెలిపించిన ప్రతి ఒక్కరికి, కార్యకర్తలకు అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈటెల గెలుపుతో ప్రతి నియోజకవర్గంలో అభివృద్ధిని పెంచుకోవడానికి అవకాశాలు మరింత మెరుగుపడ్డాయని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ అధ్యక్షులు నవ కిషోర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ విష్ణువర్ధన్ రావు, దాస్య అంజనేయ స్వామి ఆలయ చైర్మన్ రాజిరెడ్డి కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు దామోదర్ రెడ్డి, చింత రంజన్ , శ్రీశైలం, మల్లారెడ్డి, రవికుమార్, నారాయణరావు, రఘు రామ్ నేత, నర్సింహారెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, శ్రీధర్ రావు, ప్రేమ్ నగర్ తదితరులు పాల్గొన్నారు.

## మన్సూరాబాద్‌లో విజయోత్సవ సంబరాలు



ప్రజాపక్షం/హయత్ నగర్ : మల్కాజిగిరిలో ఈటెల విజయకేతనం సందర్భంగా జిహెచ్ఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి ఆధ్వర్యంలో మనసురాబాద్‌లో విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. మన్సూరాబాద్ డివిజన్, శ్రీరామ్‌నగర్ కాలనీ, కార్పొరేటర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యక్ష ప్రసారం ప్రొజెక్టర్ స్క్రీన్ ద్వారా జిహెచ్ఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి కార్యకర్తలతో కలిసి పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు వీక్షించారు. మల్కాజిగిరిలో ఈటెల రాజేందర్ విజయం తథ్యమని కార్యకర్తలతో కలిసి బాణాసంచా కాల్చి, స్వీట్లు పంచారు. ఈటెల రాజేందర్‌లకు విజయాన్ని అందించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతర కార్యకర్తలతో కలిసి నృత్యాలు చేస్తూ సంతోషం వ్యక్తం చేశారు.

# ప్రశాంతంగా ముగిసిన కౌంటింగ్

### రిటర్నింగ్ అధికారి కలెక్టర్ శశాంక

### అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు



ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి : పార్లమెంట్ ఎన్నికల లో చివరి ఘట్టమైన ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గంలో ప్రశాంతంగా ముగిసింది. పార్లమెంటు నియోజకవర్గంలోని మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, చేవెళ్ల, పరిగి, వికారాబాద్, తాండూరు అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో పోలైన ఓట్లను చేవెళ్ల మండలం గొల్లపల్లి గ్రామంలోని బండారి శ్రీనివాస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య మంగళవారం లెక్కింపు జరిపారు. రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ శశాంక నేతృత్వంలో వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, ఇతర ఉన్నతాధికారులు కౌంటింగ్ ప్రక్రియను ఆద్యంతం పర్యవేక్షణ జరిపారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు రాజేందర్ కుమార్ కటారియా, కౌంటింగ్ పరిశీలకులు మృణాళిని సావంత్‌లు ఓట్ల లెక్కింపు తీరును పరిశీలించారు. ముందస్తు ప్రణాళికతో పకడ్బందీ ఏర్పాట్లు చేసిన ఫలితంగా ఎలాంటి అవాంతరాలకు తావులేకుండా ఓట్ల లెక్కింపు ప్రక్రియ సాఫీగా పూర్తయ్యింది. ఉదయం 5.00 గంటల నుండే కౌంటింగ్ కోసం సన్నాహాలు చేపట్టారు. ఎన్నికల పరిశీలకులు, అభ్యర్థులు, వారి ఏజెంట్ల సమక్షంలో కలెక్టర్ నేతృత్వంలో కౌంటింగ్ సిబ్బంది మూడవ రాండమైజేషన్ నిర్వహించి, ఆ జాబితా ప్రకారంగా సిబ్బందికి ఓట్ల లెక్కింపు బాధ్యతలు కేటాయించారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించిన మీదట, ఇవిఎంలలో నమోదైన ఓట్లను లెక్కిస్తూ రౌండ్ల వారీగా ఫలితాలను వెల్లడించారు. కౌంటింగ్ సూపర్వైజర్లు, సహాయకులు, సూక్ష్మ పరిశీలకులతో పాటు స్ట్రాంగ్ రూంల నుంచి ఇవిఎంలను కౌంటింగ్ హాళ్లకు తరలించేలా అవసరమైన సిబ్బందిని ఏర్పాటు చేశారు. ఎన్నికల సంఘం నిబంధనలను పాటిస్తూ, ఓట్ల లెక్కింపు జరుపుతూ ఫలితాలు వెల్లడించారు. పోస్టల్ బ్యాలెట్లతో పాటు, పార్లమెంటు సెగ్మెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు పూర్తి కాగా, అన్ని అంశాలను సరిచూసుకున్న మీదట రిటర్నింగ్ అధికారులు ఒక్కో రౌండ్ వారీగా ఫలితాలను వెల్లడించారు. మొత్తం 43మంది అభ్యర్థులు పోటీ చేయగా, ఒక్కో అభ్యర్థి వారీగా పోల్ అయిన ఓట్ల వివరాలను ప్రకటించారు. మహేశ్వరం, రాజేంద్రనగర్, అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు 20 రౌండ్లలో పూర్తి చేయగా, శేరిలింగంపల్లి 23 రౌండ్లు, చేవెళ్ళ 22 రౌండ్లు, పరిగి 22 రౌండ్లు, వికారాబాద్ 21 రౌండ్లు, తాండూరు 20 రౌండ్లలో కౌంటింగ్ జరిపిన మీదట రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ శశాంక తుది ఫలితాలను అధికారికంగా ప్రకటించారు. బిజెపి అభ్యర్థిగా పోటీ చేసిన కొండా విశ్వేశర్‌రెడ్డికి పోస్టల్ బ్యాలెట్లను కలుపుకుని మొత్తం 8,09,882 ఓట్లు వచ్చాయని, రెండవ స్థానంలో నిలిచిన కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజీత్ రెడ్డికి 6,36,985 ఓట్లు పోల్ అయ్యాయని వివరించారు. దీంతో బిజె పి అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి 1,72,897 ఓట్ల మెజారిటీతో గెలుపొందారని కలెక్టర్ ప్రకటించారు. బిఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన కాసాని జ్ఞానేశ్వర్‌కు 1,76,968 ఓట్లు వచ్చాయని వివరించారు. నోటాకు 6,423పోల్ అయ్యాయని, 221 ఓట్లు వివిధ కారణాల వల్ల చెల్లుబాటు కాలేదని పేర్కొన్నారు. చేవెళ్ల పార్లమెంటు అభ్యర్థిగా గెలుపొందిన కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి పరిశీలకుల సమక్షం లో కలెక్టర్ ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. రిటర్నింగ్ అధికారి కలెక్టర్ శశాంక పోలీస్ డిసిపి శ్రీనివాస్, ఇతర ఉన్నతాధికారులు కౌంటింగ్ కేంద్రంలోనే ఉండి, ఓట్ల లెక్కింపు పూర్తయ్యేంత వరకు పర్యవేక్షణ జరిపారు. కౌంటింగ్ కేంద్రంతో పాటు పరిసర ప్రాంతాలలో పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసి, 144 సెక్షన్ నిషేధాజ్ఞలు అమలు చేశారు. కౌంటింగ్ కేంద్రం లోనికి ఇతరులెవరిని అనుమతించలేదు. కౌంటింగ్ సిబ్బందితోపాటు వివిధ బాధ్యతలు నిర్వర్తించిన సిబ్బందికి ఎంట్రీ పాసులు జారీ చేసినప్పటికీ, వారిని సైతం క్షుణ్ణంగా తనిఖీలు చేసి కౌంటింగ్ విధులకు పంపించారు. సెల్ ఫోన్ లు, వీడియోలు, కెమెరాలను నిషేధించారు. పకడ్బందీ ఏర్పాట్ల నడుమ అభ్యర్థులు, వారి ఏజెంట్ల సమక్షంలో పారదర్శకంగా, ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనలకు అనుగుణంగా ఓట్ల లెక్కింపు పూర్తి చేసి పార్లమెంటు ఎన్నికల నిర్వహణ ప్రక్రియను విజయవంతంగా ముగించడంలో జిల్లా యంత్రాంగం సఫలీకృతమైంది. ఎలాంటి ఆటంకాలు లేకుండా జిల్లాలో ఎన్నికల కౌంటింగ్ సాఫీ గా నిర్వహించడానికి సహకరించిన వారందరికీ రిటర్నింగ్ అధికారి కలెక్టర్ శశాంక కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికలను విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేసిన అధికారులను, సిబ్బందిని అభినందించారు.



# ఎపిలో టిడిపి విజయం...
# తెలుగు తమ్ముళ్లలో జోష్



ప్రజాపక్షం/హైదరాబాద్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలుగుదేశం సాధించిన ఘన విజయం సాధించడం పట్ల నగర తమ్ముళ్లలో జోష్ నింపింది. పార్టీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి. సాయిబాబా హర్షం వ్యక్తం చేశారు. ఫలితం ముందుగా ఊహించిందేనని, అవినీతి అరాచక గుండా పాలనను ప్రజలు ముక్త కంఠం తో ఎదిరించారని అన్నారు. ఈ సందర్భంగా హైదరాబాదు జిల్లా పార్టీ కార్యాలయంలో ఎన్‌టిఆర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. అనంతరం బాణాసంచా కాల్చారు. నాయకులు, కార్యకర్తలు మిఠాయిలు పంచుకొని, చంద్రబాబు నాయకత్వం వర్ధిల్లాలి అని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమానికి పొలిట్ బ్యూరో సభ్యులు అరవింద్ కుమార్ గౌడ్ హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు చంద్రబాబు నాయకత్వంపై నమ్మకానికి అరవింద్ కుమార్‌గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణలో కూడా తెలుగుదేశం పార్టీని ప్రజలు విశ్వసిస్తున్నారని, రానున్న రోజుల్లో తెలంగాణలో కూడా తెలుగుదేశం బలమైన శక్తిగా ఎదుగుతుందని ఆశాభావం వ్యక్తం చే శారు. ఈ కార్యక్రమంలో నగర పార్టీ ప్రధాన కా ర్యదర్శులు నల్లెల కిషోర్, బాలరాజు గౌడ్, నాయకు లు పరశురామ్, ఎస్. ప్రకాష్, యాదగిరిరావు, మేడిపల్లి శ్యామ్, గండికోట విజయ్ కుమార్, అడ్డగుట్ట విజయ్, డి.చంద్రమోహన్ గౌడ్, ఎన్.జగదీష్ గౌడ్, ఎం. రాజు, వంశీకృష్ణ, సురేందర్ సింగ్, భవాని శ్రీనివాస్ పాల్గొన్నారు.



## బిజ్వారంలో కాంగ్రెస్ సంబురాలు

ప్రజాపక్షం / మల్దకల్ : నాగర్ కర్నూల్ పార్లమెంటు ఎన్నికల్లో సందర్భంగా ఎంపీ అభ్యర్థి మల్లురవి విజయం పట్ల కాంగ్రెస్ నేతలు, శ్రేణులు మంగళవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం దగ్గర స్వీట్లు పంచి, బాణాసంచాలతో సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియరః నాయకులు వై. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ నాగర్ కర్నూల్ పార్లమెంటు ఎన్నికల్లో ఫలితాల్లో మల్లు రవి భారీ విజయం సాధించారన్నారు. అదేవిధంగా దేవుని మతాలరు అడ్డం పెట్టుకొని బిజెపి గెలవాలనుకుంది. మత రాజకీయాల్ని చేసి దేశాన్ని అమ్మేస్తున్న వారికి ప్రజలు బుద్ధి చెప్పారు. ప్రజలు , ప్రజాసామ్య శక్తులు కలిసి సియంతృత్వ పాలనకు స్వస్తి పలికాయి. దేశంలో రాహూల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు డి సత్య రెడ్డి, శుద్ధ వెంకటేశ్వర రెడ్డి, అమృత వాణికిరణం రాజు, ఆటో తిమ్మప్ప, లబ్బరి దేవదాస్, రజాక్, ఆటో బాబు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ సీనియర్ నాయకుల శుభాకాంక్షలు..

జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల పరిధిలోని బిజ్వారం గ్రామంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వై. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గతంలో రెండు సార్లు ఎంపిక గా గెలిచిన అనుభవం ఉందని నాగర్ కర్నూల్ పార్లమెంట్ ఓటర్లు కులమతాలకు అతీ తంగా ఎస్‌సి. ఎస్‌టీ. బిసి. మైనార్టీ ప్రజలు అందరూ ఒక్కటై మల్లు రవిని పార్లమెంట్ మెంబర్ గా ఓటేసి గెలిపించి న ప్రతి ఓటరుకు హృదయా పూర్వకంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు డి సత్యారెడ్డి, తెలుగు కృష్ణమూర్తి, కొంకల గౌకరన్న, మెకానిక్ గోవిందు, శ్రీనివాస్ గౌడ్, వడ్డే గోపాల్, అమృత రాజు, బండి తిమ్మన్న, కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.



### రాజోలిలో..

ప్రజాపక్షం / రాజోలి : నాగర్ కర్నూల్ పార్లమెంటు స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవి గెలుపొందడం పై మండల కాంగ్రెస్ కార్యకర్తలు మిఠాయిలు పంచుకొని, బాణాసంచాతో సంబరాలు జరుపుకున్నారు. అనంతరం తూర్పు గార్లపాడు గ్రామంలో మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, సీఎం రేవంత్ రెడ్డికి జై కొడుతూ ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గోపాల్ రెడ్డి, దేవదాసు, అయ్యపు, రెడ్డి, ఎం దేవదాసు, వెంకటేష్, బాబు, ప్రేమ రాజు, బ్రహ్మేష్, ప్రభాకర్, గిడ్డన్న తదితరులు పాల్గొన్నారు.

## డికె అరుణకు బిసి కుల సంఘాల అభినందనలు

ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి : మహబూబ్‌నగర్ లోక్‌సభ అభ్యర్థి గా విజయం సాధించిన డికె అరుణని అభినందిస్తూ బీసీ కుల సంఘాల కన్వీనర్, వెంకట కృష్ణ ప్రసాద్ యాదవ్, బీజెపి తరపున ప్రచారం నిర్వహించిన ప్రముఖ ఎన్ఆర్ఐ డా.వినోద్ కుమార్ యాటలు ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. వెనుకబడిన కులాల అభివృద్ధి బిజెపి తోనే సాధ్యమని ప్రజలు నమ్మడం వల్లనే గెలిపించడం జరిగిందని అన్నారు. డికే అరుణ కి వున్నా పరిపాలన అనుభవం, ప్రజల పట్ల వున్నా సేవాభావం నియోజకవర్గ ప్రజలను ఎంతో ప్రభావితం చేసిందని అన్నారు. ఓబీసీల అభివృద్ధికి పార్లమెంటు లో పోరాటం చేస్తానని డికే అరుణ హామీ ఇచ్చారని, ఆ హామీని నెరవేరుస్తారని భావిస్తున్నాం అని తెలిపారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలలో బిజెపి తరపున అధిక సంఖ్యలో బీసీలను గెలిపించుకుంటామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఈ జిల్లా నుంచి బీసీ ని మంత్రిని చేయాలని డిమాండు చేశారు. బీసీ కులాల అభివృద్ధి కోసం త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేస్తామని అన్నారు.

## బిజ్వారంలో బిజెపి సంబురాలు



ప్రజాపక్షం / మల్దకల్ : మహబూబ్ నగర్ పార్లమెంటు స్థానాన్ని బిజెపి అభ్యర్థి డీకే అరుణమ్మ సోమవారం ఎన్నికల ఫలితాల్లో సంచలన విజయం కైవసం చేసుకున్న సందర్భంగా బిజ్వారం బిజెపి పార్టీ నాయకులు రాగి మాన్ తిమ్మా రెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలకు స్వీటు పంచుతూ బాణసంచాలతో ఘనంగా సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రధానమంత్రి కావాలని ఆయన కోరారు. అదే విధంగా పోటాపోటీగా సాగిన ఓట్ల లెక్కింపులో మొదటి నుండి అరుణ తన ఆధిపత్యం ప్రదర్శించారు. అన్ని రౌండుల్లో ఎక్కడ తగ్గిదే లేదు అంటూ ఓట్లను సాధించారన్నారు. అనంతరం కడపటి వార్తలు అందేసరికీ డీకే అరుణ విజయం సాధించారు. ఫలితాన్ని అధికారికంగా ప్రకటించనున్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ నాయకులు పాయినాథ్ రెడ్డి, తెలుగు ప్రతాప్, కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.



## పెబ్బేరులో కాంగ్రెస్ నేతల సంబురాలు

ప్రజాపక్షం / పెబ్బేరు : నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి మల్లురవి గెలుపొందడంపై మంగళవారం సాయంత్రం పెబ్బేరు మండలంలోని సుభాష్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. వనపర్తి జిల్లా బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అక్కి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో మిఠాయి పంచుకొని బాణాసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల కాంగ్రెస్ కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## తెలంగాణలో విజేతలు వీరే

ప్రజాపక్షం / హైదరాబాద్ : తెలంగాణలోని 17 ఎంపి స్థానాలు, సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎన్నికల ఫలితాలు వెల్లడయ్యాయి. కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి శ్రీ గణేష్ విజయం సాధించారు. ఇక లోక్‌సభ విజేతలు, పార్టీల వారీగా ఇలా ఉన్నాయి. 1. హైదరాబాద్ : (ఎంఐఎం) అసదుద్దీన్ ఓవైసి.. 2. నల్గొండ : (కాంగ్రెస్) కే. రఘువీర్ రెడ్డి. . 3. ఖమ్మం : (కాంగ్రెస్) రఘురాం రెడ్డి.. 4. వరంగల్ : (కాంగ్రెస్) కడియం కావ్య.. 5. మహబూబాబాద్ : (కాంగ్రెస్) బలరాం నాయక్.. 6. నాగర్ కర్నూల్ : (కాంగ్రెస్) మల్లు రవి.. 7. భువనగిరి : (కాంగ్రెస్) చామల కిరణ్ కుమార్.. 8. జహీరాబాద్ : (కాంగ్రెస్) సురేష్ సెట్కార్.. 9. పెద్దపల్లి : (కాంగ్రెస్) గడ్డం వంశీకృష్ణ.. 10. ఆదిలాబాద్ : (బిజెపి) గోడం నగేష్.. 11.నిజామాబాద్: (బిజెపి) ధర్మపురి అరవింద్.. 12. కరీంనగర్: (బిజెపి) బండి సంజయ్ కుమార్.. 13. మల్కాజ్ గిరి : (బిజెపి) ఈటల రాజేందర్.. 14. మహబూబ్ నగర్:( బిజెపి ) డికె. అరుణ.. 15. చేవెళ్ల : (బిజెపి) కొండా విశ్వేశ్వర్ రెడ్డి.. 16. మెదక్: (బిజెపి) ఎం. రఘునందన్ రావు.. 17. సికింద్రాబాద్ : (బిజెపి) జి. కిషన్ రెడ్డి.

## జిల్లాలో ఓట్ల లెక్కింపు ప్రశాంతం
### జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్

ప్రజాపక్షం/హైదరాబాద్ : హైదరాబాద్ జిల్లాలో ఓట్ల లెక్కింపు ప్రశాంతంగా జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్ తెలిపారు. మంగళవారం జిల్లాలో లోక్‌సభ ఓట్ల లెక్కింపు 13 ప్రాంతాలలో 16 సికింద్రాబాద్, హైదరాబాద్ లోక్‌సభ, సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికల లెక్కింపు జరిగిందన్నారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా పలు ప్రాంతాల్లో నేరుగా లెక్కింపు ప్రక్రియను ఆయన పరిశీలించారు. జిల్లాలో ఓట్ల, లెక్కింపు ప్రశాంతంగా నిర్వహించిన అధికారులకు, సిబ్బందికి ఆయన అభినందలు తెలిపారు. లెక్కింపు సందర్భంగా ఎన్నికల కమిషన్ నియమించిన పరిశీలకుల సహకారం మరువలేనిదన్నారు. పోలీస్ అధికారులకు, సిబ్బందికి కూడా ఆయన అభినందనలు చెప్పారు.

## టిడిపి కూటమికి మంత్రి తుమ్మల శుభాకాంక్షలు

ప్రజాపక్షం/హైదరాబాద్ : ఆంధ్రప్రదేశ్ లో కొత్తగా కొలువుదీరనున్న తెలుగుదేశం కూటమి ప్రభుత్వానికి తెలంగాణ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుభాకాంక్షలు తెలిపారు. కూటమికి అఖండ విజయాన్ని చేకూర్చిన తెలుగు ప్రజలకు ఆయన అభినందనలు తెలిపారు. భౌతికంగా రెండు రాష్ట్రాలుగా విడిపోయినప్పటికీ... మానసికంగా ఎప్పటికీ కలిసిఉండి... మన రెండు రాష్ట్రాల పురోగతిలో తెలుగు ప్రజల ఆకాంక్ష లు నెరవేర్చేందుకు పరస్పరం సహకరించుకుంటూ కలిసికట్టుగా ముందుకు సాగాలని తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. తెలుగు జాతి కీర్తిపతాకాన్ని ప్రపంచపటంలో ఎప్పుడు కూడా ప్రథమస్థానంలో ఉంచేందుకు ఇరు ప్రభుత్వాలు ప్రయత్నంచేయాలని తుమ్మల ఆకాంక్షించారు. తెలంగాణ, ఎపి ప్రభుత్వాలు తెలుగు ప్రజలకు మంచిచేసే అంశాల్లో కలిసికట్టుగా ముందుకెళ్తాయని పేర్కొన్నారు.



## ఎన్‌టిఆర్ ట్రస్ట్ భవన్ వద్ద సంబురాలు



ప్రజాపక్షం/హైదరాబాద్ : ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీ, జనసేన, బిజెపి కూటమి భారీ మెజారిటీతో గెలుపొందిన సందర్భంగా మంగళవారం ఎన్‌టిఆర్ భవన్ వద్ద తెలుగు తమ్ముళ్లు ఉత్సవాలు నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద తరలివచ్చి ఎత్తున బాణాసంచాకల్చారు. మిఠాయిలు పంచుకొని, పరస్పరం అభినందనలు చెప్పుకున్నారు. ఈ సందర్భంగా పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీ ఎంఎల్‌ఎ బక్కని నర్సింహులు మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాలలో, అలాగే భారత దేశంలో, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలకు ఆనందం కలిగించే రోజు అన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా అడుగుపెట్టేందుకు ప్రజలు గెలుపు తీర్పు ఇచ్చారన్నారు. ఇరు రాష్ట్రాలలో ఉన్న తెలుగుదేశం పార్టీ నాయకులకు, అక్కడా ఇక్కడా ధర్మం కొరకు పోరాడిన అధికారులకు, మహిళా సోదరులకు చంద్రబాబు తరపున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలిట్‌బ్యూరో సభ్యులు అరవింద్ కుమార్ గౌడ్, పార్టీ నాయకులు బంటు వెంకటేశ్వర్లు, మాజీ ఎంఎల్‌ఎ కాట్రగడ్డ ప్రసూన, సామ భూపాల్ రెడ్డి, జాతీయ పార్టీ అధికార ప్రతినిధి నన్నూరి నర్సి రెడ్డి, అజ్మీరా రాజునాయక్, గడ్డి పద్మావతి, జివిజి నాయుడు, శ్రీనివాసా నాయుడు, సూర్యదేవర లత, డాక్టర్ ఎ.ఎస్. రావు, మీడియా కమిటీ ఛైర్మన్ తెలుగుదేశం ప్రకాష్ రెడ్డి, పాల్గొన్నారు.

## గ్రూపు-1 పరీక్షల వాయిదాకు హైకోర్టు నిరాకరణ

ప్రజాపక్షం/హైదరాబాద్ : ఈనెల 9న జరగనున్న గ్రూపు1 ప్రిలిమ్స్ పరీక్షను వాయిదా వేసేందుకు హైకోర్టు నిరాకరించింది. కేంద్ర ప్రభుత్వం అసిస్టెంట్ సెంట్రల్ ఇంటిలిజెన్స్ ఆఫీసర్ గ్రేడ్1, ఎగ్జిక్యూటివ్ పోస్టులకు స్క్రీనింగ్ పరీక్ష ఉన్నందున గ్రూప్1 ప్రిలిమ్స్‌ను వాయిదా వేయాలంటే దాఖలైన పిటీషన్లపై ఉత్తర్వులు జారీ చేసేందుకు నిరాకరించింది. ప్రిలిమ్స్ పరీక్షల నిర్వహణ కోసం ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిన కారణంగా వాటిని వాయిదా వేయడానికి ఉత్తర్వులు ఇవ్వలేమని జస్టిస్ కార్తీక్ స్పష్టం చేశారు పిటీషన్ పై విచారణ ముగిస్తున్నట్టు ప్రకటించారు. కేంద్రం నిర్వహించే పరీక్షకు హాజరయ్యేది 700 మంది మాత్రమేనని, ప్రిలిమ్స్ కు హాజరయ్యే అభ్యర్థులు సుమారు నాలుగు లక్షల వరకు ఉన్నారని, పరీక్షలు వాయిదా వేయడానికి వీల్లేదని సర్వీస్ కమిషన్ న్యాయవాది చేసిన వాదనను ఆమోదించారు.

## కట్టమైసమ్మ చెరువు రక్షణకు తీసుకున్న చర్యలు చెప్పండి
### ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

ప్రజాపక్షం/హైదరాబాద్ : మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం కట్టమైసమ్మ చెరువు పరిరక్షణకు తీసుకునేందుకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు తెలియజేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశించింది. ఏర్పాట్లపై పూర్తిస్థాయి నివేదికను సమర్పించాలంది. కట్టమైసమ్మ చెరువు ఎఫ్టిఎల్, బఫర్ జోన్స్‌ఆ లో ఆక్రమణలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలంది. ఈ మేరకు హైకోర్టు సోమవారం జీహెచ్ ఎంసీని ఆదేశించింది. ఏవమైనా సంస్థల సహకారం తీసుకుని వాకింగ్ ట్రాక్ నిర్మాణం, చెరువు చుట్టూ రక్షణకు ఏర్పాట్లకు ప్రయత్నాలు చేయాలని. తదుపరి విచారణ నాటికి పూర్తి వివరాలతో స్థాయీ నివేదికను సమర్పించాలని ఉత్తర్వులు జారీ చేసింది. కుత్బుల్లాపూర్ మండలం సూరారం గ్రామంలోని కట్టమైసమ్మ రక్షణకు చర్యలు తీసుకోకపోవడాన్ని సవాలు చేస్తూ హైదరాబాద్కు చెందిన న్యాయవాది ఎస్ మల్లేశ్వర రావు నాలుగేళ్ల క్రితం ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిని చీఫ్ జస్టిస్ ఆలోక్ ఆరాదే, జస్టిస్ జె అనిల్ కుమార్లెతో కూడిన డివిజన్ బెంచ్ సోమవారం విచారించింది. చెరువు రక్షణకు సంబంధించి తీసుకుంటున్న చర్యలపై జీహెచ్‌ఎంసీ నివేదిక సమర్పించింది. చెరువు ఎఫ్.టి. ఎల్. ప్రాంతాన్ని గుర్తించామని, 1697 ఎకరాలు ఉందని, 212 ఎకరాలు బఫర్ జోన్ ఉందని తెలిపింది చెరువులో ఎలాంటి ఆక్రమణలు జరగలేదని పేర్కొంది .చెరువు చుట్టూ లింక్ లింక్ చైన్ మెస్లో కంచె ఏర్పాటు చేసినట్లు తెలిపింది కార్పొరేట్ కంపెనీల బాధ్యత కింద్ర వాకింగ్ ట్రాక్కు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపింది వీటన్నింటినీ జీహెచ్‌ఎంసీ పం స్తోందని తెలిపింది. ఈ దికను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం చెరువు రక్షణకు ఆదేశాలు జాగీ చేస్తూ పిటిష్ప విచారణను మూసిఎ సింది చెరువు అభివృద్ధిపై తీసుకున్న చర్యలపై స్థాయీ నివేదికను మూడు నెలల్లో హైకోర్టు రిజిస్ట్రీకి సమర్పించాలని ఆదేశించింది.

## హైపవర్ కమిటీ నివేదికపై సమయం కోరిన ప్రభుత్వం
### జీవో 111 అమలు రద్దు వ్యవహారంపై హైకోర్టు విచారణ

ప్రజాపక్షం/హైదరాబాద్ : హైదరాబాద్ లోని జంటజలాశయాలైన హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ పరీవాహక ప్రాంత పరిరక్షణకు ఉద్దేశించిన జీవో 111 ఎత్తివేతకు సంబంధించి గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైపవర్ కమిటీ నివేదికపై వివరణ ఇచ్చేందుకు మరింత సమయం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టును కోరింది. హైపవర్ కమిటీ నివేదిక సమర్పించిందా ? లేదా ? ప్రస్తుత పరిస్థితి ఏంటో తెలుసుకుని చెప్పాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. జీవో 111ను రద్దు చేసి సదరు నిషేధిత ప్రాంతంలో పర్యావరణహితంగా అభివృద్ధి చేస్తామని పేర్కొంటూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం నూతన జీవో 69ను జారీచేసింది. ఆ ప్రాంతంలో తీసుకోవాల్సిన చర్యలకు సంబంధించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో హైపవర్ కమిటీ ఏర్పాటు చేసింది. జీవో 111 రద్దును వ్యతిరేకిస్తూ హైకోర్టులో అప్పటికే పెండింగ్లో ఉన్న పిటిషన్లలో పిటిషనర్లతోపాటు కొత్త పిటిషన్లు దాఖలు కావడంతో హైపవర్ కమిటీ నివేదిక వచ్చే వరకు జీవో 111 రద్దుకు సంబంధించి ఎలాంటి చర్యలు తీసుకోబోమని. నిర్మాణాలకు సంబంధించి గతంలో ఉన్న ఆంక్షలు, నిషేధాలను సడలించబోమని ప్రభుత్వం హైకోర్టుకు హామీ ఇచ్చింది. తాజాగా సోమవారం జీవో 111కు సంబంధించిన దాదాపు 12 పిటిషన్లపై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిన్ అనిల్కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున అదనపు అడ్వకేట్ జనరల్ ఇమ్రాన్ ఖాన్ వాదనలు వినిపిస్తూ. కమిటీ నివేదిక పచ్చే వరకు జీవో రద్దుపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని గతంలో ఇదే ధర్మాసనం ఆదేశించిందని.. సదర అదేశాల ప్రకారం ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని.. జీవో 111 యథాతథంగా కొనసాగుతోందని నివేదించారు. అసలు కమిటీ నివేదిక ఇచ్చిందా? ప్రస్తుత పరిస్థితి. ఏమిటని ధర్మాసనం ప్రశ్నించింది. నివేదికకు సంబంధించిన వివరాలు తెలుసుకునేందుకు నాలుగువారాల సమయం ఇవ్వాలని ఏఏజీ కోరడంతో తదుపరి విచారణను హైకోర్టు నాలుగువారాలకు వాయిదా వేసింది

## ఓవర్గం నిరాశ... మరోవర్గం సంతోషం

ప్రజాపక్షం/వెల్దండ : నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎన్నికల ఫలితాల్లో అధికార కాంగ్రెస్‌పార్టీ ఘనవిజయం సాధించిందికాని మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానంనుంచి ఆపార్టీకిచెందిన ఏఐసిసికార్యదర్శి చల్లావంశీచంద్‌రెడ్డి అతితక్కువ మెజార్టీ 3636 ఓట్ల తేడాతో ఓటమిపాలయ్యారు. కాగా ఆయన స్వగ్రామం నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం శేరి అప్పారెడ్డిపల్లి అయితే నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సెగ్మెంట్‌నుంచి డాక్టర్ మల్లురవి ఘనవిజయం సాధించారు. ఆయన అభిమానులు, కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు వెల్దండలో సంబరాల్లో మునిగిపోయారు. కాని చల్లావంశీచంద్‌రెడ్డి అనుచరులు, అభిమానులు నిరాశతో వేడుకలకు దూరంగా ఉన్నారు. తమనేత ఓటమినివారంతా జీర్ణించుకోలేకపోతున్నారు. కావాలనే కొందరు పనిగట్టుకొనిపోయి మహబూబ్‌నగర్ పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో వంశీని సర్వశక్తులువడ్డినట్లు పార్టీ నాయకులే బాహటంగా ఆరోపణలు గుప్పిస్తున్నారు. వంశీచంద్‌రెడ్డి గెలుపొందితే తమ ఉనికిని కోల్పోయే ప్రమాదం అని తెలిసిన ఆనాయకులులోలోపల సంబరపడిపోతున్నారు. నిన్న మొన్నటివరకు వంశీచంద్‌రెడ్డి విమర్శనస్త్రాలు గుప్పించిన నాయకులుపైకి కొందరుశ్రేణులు పెదవివిరుస్తున్నారు.

## ఎపిని ప్రజలు గెలిపించారు : చంద్రబాబు



అమరావతి: కూటమి ప్రభుత్వం.. కలిసికట్టుగా రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తుందని టిడిపి అధినేత చంద్రబాబు అన్నారు. ఎన్నికల్లో ఘన విజయం సాధించిన తర్వాత ఆయన మీడియాతో మాట్లాడారు. 'ఎపిని ప్రజలు గెలిపించారు.. నా హృదయం ఉప్పొంగింది. మరోసారి ప్రజా సేవ చేసే అవకాశం కల్పించిన ప్రజలకు కృతజ్ఞతలు. ఎపి భవిష్యత్తుపై నిబద్ధతతో ఉన్న మోదీ, అమిత్ షా, నడ్డాకు ధన్యవాదాలు. పవన్, జనసేన నేతలు, పురందేశ్వరి, బిజెపి నేతలకు శుభాకాంక్షలు. ఘనవిజయంలో భాగస్వామ్యులైన కార్యకర్తల కృషిని మరిచిపోలేను. కూటమి విజయానికి శుభాకాంక్షలు తెలిపిన మోదీకి అభినందనలు. ఎన్డీయేకు ఎపి ప్రజల తరఫున శుభాకాంక్షలు. ప్రజలు ఎంతో నమ్మకంతో కీలక బాధ్యతలు అప్పగించారు. ఈ విజయం కూటమిపై ప్రజల నమ్మకానికి ప్రతిబింబం'' అని చంద్రబాబు వ్యాఖ్యానించారు.

## జడ్పిటిసి శుభాకాంక్షలు



ప్రజాపక్షం/వంగూర్ : నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ మల్లురవి విజయం సాధించడంతో జడ్పిటిసి కెవిఎన్‌రెడ్డి, ఎంపిపి భీమమ్మలాలుయాదవ్ మంగళవారం డాక్టర్ మల్లురవిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

## మల్లురవి గెలుపుతో సంబరాలు



ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి : నాగర్‌కర్నూల్ పార్లమెంట్‌సభ్యునిగా 94వేలకుపైగా ఓట్ల మెజార్టీతో గెలుపొందడంతో నాగర్‌కర్నూల్ పట్టణకేంద్రంలో ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలువేశారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి.ఉదయ్ కుమార్ చేతులమీదుగా ఎంపిగా గెలుపొందిన ధృవీకరణపత్రాన్ని మంత్రి జూపల్లి, కల్వకుర్తి ఎంఎల్‌ఎ కసిరెడ్డినారాయణరెడ్డి , అచ్చంపేట ఎంఎల్‌ఎ వంశీకృష్ణ, నాగర్‌కర్నూల్ ఎంఎల్‌ఎ రాజేష్‌రెడ్డి, జడ్పివైస్‌చైర్మన్ బాలాజి సింగ్, మాజీ ఎంఎల్‌ఎ సంపత్‌కుమార్‌తో కలిసి అందుకున్నారు. ఈసందర్భంగా ఎంపి మల్లురవి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, కాంగ్రెస్ సీనియర్ నాయకులు అందరూకలిసి నాకు ఎంపి టికెట్‌కేటాయించి నాకు మద్దతు తెలిపినందుకు ప్రత్యేక కృతజ్ఞతలుతెలిపారు. అత్యధిక మెజార్టీతో గెలిపించిన నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ప్రజానీకానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. చిన్నవయసులో పార్లమెంట్ అభ్యర్థిగా పోటీచేసి కాంగ్రెస్‌పార్టీకి గట్టిపోటి ఇచ్చిన బిజెపి అభ్యర్థి పోతుగంటిభరత్‌ప్రసాద్‌కు ఆయన అభినందనలు తెలిపారు.



## వెల్దండలో కాంగ్రెస్ విజయోత్సవ సంబరాలు

ప్రజాపక్షం/వెల్దండ : నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థిగా డాక్టర్ మల్లురవి భారీ మెజార్టీతో గెలుపొందడంతో కాంగ్రెస్‌పార్టీశ్రేణులు శ్రీశైలం హైదరాబాద్ జాతీయ రహదారిపై సంబరాలు నిర్వహించుకున్నారు. ఈసందర్భంగా భారీగా బాణాసంచాపేల్చి ఒకరికొకరుస్వీట్లు తినిపించుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షులు మోతిలాల్‌నాయక్, డైరెక్టర్ మట్ట వెంకటయ్యగౌడ్, గున్నేళ్లశ్రీనివాస,నాయకులు కృష్ణముదిరాజ్, హరికిషన్‌నాయక్, గుద్దటినారాయణ, రామచంద్రనాయక్, పంతునాయక్, కృశరపువెంకటయ్య, వెంకటేష్‌ముదిరాజ్, మహిళా నాయకురాలు రాణి, నరేష్, పంతునాయక్, లక్ష్మ ణస్వామి,నరేష్, కీమ్యానాయక్, రాములు,బస్వమోనిశివ, మట్ట భరత్, కాంగ్రెస్‌పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## పోలీసులపైదాడి ఇద్దరిపై కేసు నమోదు

ప్రజాపక్షం/అచ్చంపేట : పోలీసులపైదాడిచేసిన సంఘటనలో ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదుచేసిన సంఘటన పదరపోలీస్‌స్టేషన్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం రాత్రి పదర మండలకేంద్రంలో మద్యందుకాణం వద్ద ఇద్దరు వ్యక్తులు గొడవపడుతున్నారు. ఇది గమనించిన వైన్స్‌షాపు నిర్వాహకులు 100కు ఫోన్‌చేశారు. దీంతో విధుల్లో ఉన్న కానిస్టేబుల్ ఖలీల్, రాజశేఖర్ ఘటనస్థలికి చేరుకొని గొడవపడుతున్న వారిద్దరిని అదుపుచేసేందుకు ప్రయత్నించారు. ఇందులో భాగంగా మరో కానిస్టేబుల్ వీడియోలు తీశాడు. దీని గమనించిన ఇద్దరు యువకులు వినోద్, విజయ్ అనే ఇరువురు తామూ స్థానికులమని విర్రవీగుతూ కానిస్టేబుల్‌పైదాడి చేశారు. విధుల్లో ఉన్న కానిస్టేబుల్‌పై దాడిచేయడంతో కేసు నమోదుచేసినట్లు పదర ఎస్ఐ రాజు తెలిపారు. వారిని అదుపులోకి తీసుకొని అచ్చంపేట మెజిస్ట్రేట్‌ముందు మంగళవారం హాజరుపర్చామని న్యాయమూర్తి 14రోజుల రిమాండు విధించినట్లు తెలిపారు.

## నేటినుంచి సర్జికల్‌క్యాంపు

ప్రజాపక్షం/అచ్చంపేట : ఈనెల 5,6తేదిలలో పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో సర్జికల్ క్యాంపు నిర్వహించబడుతుందని అందరూ దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఎంఎల్‌ఎ డాక్టర్ వంశీకృష్ణ తెలిపారు. గతంలో ఎప్పుడూ చేయలేదని సివికెసంస్థ ఆధ్వర్యంలో తాను ఎంఎల్‌ఎ అయి ఉండి కూడా తన భార్య అమ్రాబాద్ జడ్పిటిసి డాక్టర్ అనుధార ఆధ్వర్యంలో ఈక్యాంపు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈక్యాంపులో అన్నిరకాల సర్జికల్ ఆపరేషన్లు చేయటం జరుగుతుందన్నారు. ఈక్యాంపు అవసరాన్నిబట్టి మరో రెండుమూడురోజులు పెంచే అవకాశం ఉందని తెలిపారు.



## పిల్లలు కనిపిస్తే కరిచేస్తున్నాయ్
### కుక్కలతో ప్రాణాలకే ముప్పు

ప్రజాపక్షం/వనపర్తి టౌన్ : వీధి కుక్కల దాడిలో 8 నెలల బాబు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన మంగళవారం వనపర్తి పట్టణ కేంద్రంలోని 11వ వార్డులో జరిగింది. 11వ వార్డుకు చెందిన గోపాల్ రెడ్డి కురుమాడు యశ్వంత్ ఆడుకుంటుండగా వీధి కుక్కలు చుట్టు ముట్టి దాడి చేశాయి. గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు కుక్కలను చెదరగొట్టి బాబును ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి వెళ్లి మెరుగైన చికిత్స అందించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ ఇలా వరుసగా వీధి కుక్కల దాడిసంఘటనలతో చిన్నారుల తల్లిదండ్రులు హడలిపోతున్నారు. పిల్లలు మొదలుకొని మహిళలు, వృద్ధుల వరకు ఇలా వీధి కుక్కలు ఎవరిని వదలడం లేదు. మనిషి కనిపిస్తే చాలు కరిచి పడేస్తున్నాయి. పగబట్టినట్లే ప్రవర్తిస్తూ కండలలు పీకేస్తున్నాయి. నిత్యం ఏదో ఒక చోట జనాలు కుక్క కాటుకు బలవుతున్న పరిస్థితి , మున్సిపాల్టీ అధికారులు వీధి కుక్కల నియంత్రణను గాలికి వదిలేసింది. తూతూ మంత్రంగా చర్యలు చేపడుతున్నారని వాపోయారు.

## ఈటలకు ముదిరాజ్ సంఘ నేతల సత్కారం



**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** మల్కాజిగిరి ఎంపిగా భారీ మెజారిటీతో గెలుపొందిన బిజెపి అభ్యర్థి ఈటెల రాజేందర్‌ను ముదిరాజ్ సంఘ రాష్ట్ర నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముదిరాజ్ సంఘ నేతలు పొట్ల కాయల వెంకటేశ్వర్లు ముదిరాజ్, శ్రీనివాసరాజ్, ప్రేమ్ విమల్, పృథ్వీ రాజ్, నీరజ తదితరలు ప్రజల అభిమానంతో ఈటెల మరిన్న పదవులు సాధించాలని ఆకాంక్ష వ్యక్తం చేసారు. దశాబ్దానికి పైగా ప్రజా జీవితంలో ఉంటూ ప్రజల అభివృద్ధి కోసం నిరంతరం శ్రమించే వ్యక్తిగా ఈటెల పేరొందాడని, దాని ఫలితమే ఎంపిగా సాధించిన విజయమన్నారు. ఈ సందర్భంగా ఈటెల మాట్లాడుతూ తాను ఎంపిగా మల్కాజిగిరి ప్రాంత వాసులకు అన్ని వేళలా అందుబాటులో ఉంటూ గత ప్రజా ప్రతినిధులకు భిన్నంగా ప్రగతి పథంలోకి తీసుకొని వెళతానన్నారు.

## కూటమి గెలుపు తెలుగు వారందరికీ అంకితం



**ప్రజాపక్షం/దుండిగల్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెదేపా, జనసేనా, బిజెపి కూటమి అధిక సీట్లలో మెజార్టీ సాధిస్తుండటంతో సూరారం శ్రీ కట్ట మైసమ్మ తల్లి దేవాలయం లో మొక్కు చెల్లించుకున్నారు. కుత్బుల్లాపూర్ తె.దే.పా అభిమానులు నాయకులు అనంతరం కట్ట మైసమ్మ తల్లి ప్రత్యేక పూజలు చేసి అమ్మవారి కి 101 కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు చెల్లించి బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్న తెదేపా నాయకులు ఈ కార్యక్రమంలో బొడ్డు రవి పుట్టా నరేందర్ కుమార్ తెలుగుదేశం పార్టీ నాయకులు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఎకెఆర్ స్టడీ సర్కిల్‌లో డిఎస్‌ఐపై అవగాహన సదస్సు



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** ఈ నేడు డీస్సీకి ప్రిపేర్ అయ్యే అభ్యర్థుల కోసం ఈ నెల 5వ తేది ఉదయం 9గంటల నుండి సాయంత్రం ఏడు గంటల వరకు కరెంట్ అఫైర్స్, సిలబస్ పై ఉచిత అవగాహన సదస్సు నిర్వహిస్తున్నాట్లు ఏకేఆర్ సర్కిల్ డైరెక్టర్ బివి రమణ తెలిపారు. ఈ అవగాహన సదస్సు కు ప్రముఖులు హజరవుతారని అర్హత సాధించిన విద్యార్థులు , సాధింభోయే విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అయాన సూచించారు. ,ఈ అవగాహన కార్యాక్రమం శివరాంనగర్ కాలనీలోని హనుమన్ టెంపుల్ పక్కన గల హాల్లో ఈ ఉచిత శిబిరం ఉంటుందని అయన పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9441022571 నెంబర్ను సంప్రదించాలని సూచించారు.

## ఘనంగా స్పీకర్ జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి:** వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రజా భావన్‌లో తెలంగాణ శాసన సభ స్పీకర్ ప్రసాద్‌కుమార్ జన్మదిన వేడుకలును పట్టణ అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి అధ్వర్యంలో ఘనంగా గజమాలతో సత్కరించి మిఠాయిలు తినిపించకొని శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతు ఇంకా మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. శ్రీఅనంతపద్మనాభ స్వామిదేవలయంలో, అలంపల్లి ధర్గలో మొథడిస్ట్ చర్చిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కార్యక్తలు తదితరులు పాల్గోన్నారు.

## కొండ విశ్వేశ్వర్‌రెడ్డి గెలుపుతో వికారాబాద్‌లో సంబరాలు



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ జిల్లా కేంద్రంలో బిజేపి అభ్యర్థి కొండవిశ్వేశ్వర్‌రెడ్డి1లక్ష74వేల మెజార్టీతో గెలుపోందినరు. వికారాబాద్ జిల్లాఅధ్యక్షులు మాధవరెడ్డి ,వడ్లనందు ,అధ్వర్యంలో మిఠాయిలు పంచుకుంటూ టపాకాలు పేలుస్తూ సంబరాలు చేసుకున్నా ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇదే స్పూర్తితో జిల్లా అధ్యక్షలుతో కలిసి వచ్చే ఎన్నికల్లో మున్సిపల్ , యంపిటిసి , జేడ్పిటిసి , బిజేపి అభ్యర్థులను గెలిపించుకోంటమన్నారు. బిజేపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గోన్నారు.

## గుండె పోటుతో ఉపాధి హామీ కూలీ మృతి

**ప్రజాపక్షం / కొడంగల్ :** గుండె పోటుతో ఉపాధి హామీ కూలీ మృతి చెందిన కొడంగల్ నియోజకవర్గంలోని దుద్యాల్ మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు దుద్యాల గ్రామానికి చెందిన గొల్ల లక్ష్మయ్య(48) రోజు మాదిరిగానే మంగళవారం ఉదయం ఉపాధి హామీ కూలీ పనికి వెళ్లగా పని చేస్తు కాస్త నీరసంగా ఉందని చెట్టు నీడన కూర్చోవడానికి వెళ్లగా అక్కడే కుప్పకూలీవడంతో తోటీ కూలీలు గమనించి ఆసుప్రతికి తరలిస్తుండగానే మార్గమద్యలో మృతి చెందినట్లు తెలిపారు. మృతునికి ఒక భార్య కూతురు, కుమారుడు ఉన్నట్లు పేద కుటుంబం కావడంతో ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు, కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు.

## ఎఎస్ రావు నగర్‌లో టిడిపి విజయోత్సవ వేడుకలు



**ప్రజాపక్షం/చర్లపల్లి:** ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీ విజయోత్సవం సాధించిన సందర్భంగా ఏఎస్ రావు డివిజన్ పరిధిలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి నీరుకొండ సతీష్‌బాబు ఆధ్వర్యంలో సంబురాలు జరుపుకున్నారు.ఈ సందర్భంగా ఎన్‌టిఆర్ విగ్రహనికి పూలమాలలు వేసి పాలాభిషేకం చేశారు.ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నాయకులు టిజికె మూర్తి,రాములు యాదవ్,సతీష్‌కుమార్,నవీన్,ఎస్‌వి రావు,అప్పారావు,శ్రీనివాస్, రమేష్, వెంకటేష్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో గేదెలు, ఆవులు మృతి



**ప్రజాపక్షం / కొడంగల్ :** విద్యుత్ షాక్‌తో గెదెలు అవులు మృతి చెందిన సంఘటన కొడంగల్ మండల పరిధిలోని సంగాయిపల్లి గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు గ్రామానికి చెందిన నర్సిరెడ్డి, బుచ్చిరెడ్డిలకు చెందిన రెండు గెదెలు, బల్వంత్‌రెడ్డి, నారాయణరెడ్డిలకు చెందిన రెండు ఆవులు రోజు మాదిరిగానే సంజీవ్‌రెడ్డి పోలంలో మేత మేయడానికి వెళ్లడంతో అక్కడ ఇటీవలే భారీ ఈదురు గాలులకు విద్యుత్ స్థంబం కిందపడిపోవడం జరిగిందన్నారు. గ్రామస్థుల పిర్యాధుతో విద్యుత్ శాఖ అధికారులు అట్టి స్థంబానికి కరెంటు సప్లయ్ తీసివేసి రిఫేరు చేసేందుకు చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో అక్కడి లైన్‌మెన్ అయిన మహిపాల్ నిర్లక్ష్యం కారణంగా ప్రమాదం జరిగిందని బాధితులు ఆరోపించారు. ఈ ఘటనపై విధ్యుత్ శాఖ ఏఈ, ఏడిఏ నవీన్‌కుమార్‌లు ఆరా తీసి నిర్లక్ష్యం వహించిన వారిపై యాక్షన్ తీసుకోవడంతో పాటు బాధితులను ఆదుకుంటామని తెలిపారు.

# ఓటర్ల రుణం తీర్చుకొంటా : ఈటల



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** తనపై విశ్వాసంతో గెలిపించిన ఓటర్లకు అనుగుణంగా ఎంపిగా పని చేస్తూ రుణం తీర్చుకొంటానని మల్కాజిగిరి ఎంపిగా విజయం సాధించిన బిజెపి అభ్యర్థి ఈటెల రాజేందర్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం నుండి రాష్ట్రానికి నిధులు తీసుకొని వస్తూ రాష్ట్ర అభివృద్ధితో పాటు మల్కాజిగిరి ప్రాంతాన్ని ప్రగతి పథంలో నడిపిస్తూ దేశంలోనే ఆదర్శవంత నియోజకవర్గంగా తీర్చి దిద్దుతానన్నారు. మంగళవారం జరిగిన ఓట్ల కౌంటింగ్‌లో విజయం సాధించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. దేశంలో మోడీ నేతృత్వంలో కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మరో సారి అధికారం రాబోతున్నట్లు అన్నారు. స్వేచ్ఛా స్వాతంత్రం, ప్రగతి ఆత్మగౌరవం కోసం బిజెపికి మల్కాజిగిరి ఓటర్లు పట్టం కట్టారన్నారు. గత రెండు దశాబ్దాల కాలంలో బిజెపి హయాంలో ప్రభుత్వం పేద, ధనిక వర్గాల మధ్య ఉన్న అంతరాలను తగ్గించారని, యువతకు ఉద్యోగ అవకాశాలతో పాటు స్వయం ఉపాధి కోసం ఆర్థిక సహకారం అందించే లక్ష్యంగా అనేక పథకాలను అమలు చేసారన్నారు. ఓట్ల కౌంటింగ్‌లో తనకు ఏ రౌండ్‌లోనూ మెజరిటీ తగ్గకుండా ఓట్లు వేయటం అమిత సంతోషం కలిగించిందన్నారు. తన ఎన్నికల ప్రచారంలో సహకరించిన పార్టీ నేతలు, కార్యకర్తలు, ప్రజలందరికి ధన్యవాదాలు తెలిపారు.

## ఈటలకు సర్టిఫికెట్ అందించిన రిటర్నింగ్ అధికారి గౌతం



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** మల్కాజిగిరి పార్లమెంటు స్థానంలో ఘన విజయం సాధించిన బిజెపి అభ్యర్థి ఈటెల రాజేందర్‌కు మేడ్చల్ జిల్లా కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి గౌతం పోట్రు అధికారికంగా గెలుపొందినట్లు ప్రకటించారు. కలెక్టరేట్ కార్యాలయంలో మంగళవారం రాత్రి ఈటెల రాజేందర్‌కు ఎంపిగా అధికారిక ధృవీకరణపత్రాన్ని పార్టీ నేతలు, అధికారుల సమక్షంలో అందచేసారు. మల్కాజిగిరి స్థానంలో 19 లక్షల 19 వేల 131 ఓట్లు పోలయ్యాయని, విజయం సాధించిన బిజెపి అభ్యర్థి ఈటెల 9 లక్షల 91 వేల 042 ఓట్లు వచ్చాయని, కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతారెడ్డి 5 లక్షల 99 వేల 567 ఓట్లు వచ్చాయని, బిఆరెస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి 3 లక్షల 486 ఓట్లు వచ్చాయని ఎన్నికల అధికారి గౌతం పేర్కొన్నారు.

## బస్సు, బైకుడీ : వ్యక్తి మృతి

### ప్రమాదంలో బైక్ డ్రైవర్ మృతి
### బస్సు డ్రైవర్‌కు స్వల్పగాయాలు
### బస్సులో ఉన్న ప్రయాణికులు సురక్షితం





**ప్రజాపక్షం/కోట్‌పల్లి:** ఎదురేదురుగా వస్తున్న బస్సు బైక్ డీకొనడంతో బైక్‌పై ఉన్న వ్యక్తికి బలమైన గాయాలు తగలడంతో తాండూర్ తరలిస్తుండగా మార్గ మద్యలో మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కుక్కింద గ్రామానికి చెందిన వ్యక్తి కొనింటి అంజయ్య 45 రామాపూర్ నుండి కోట్‌పల్లి వైపుగా వస్తుండగా కోట్‌పల్లి నుండి 50మంది ప్రమాణికులతో వికారాబాద్‌కు వెలుతున్న ఆర్టీసీ బస్సు లింగంపల్లి చౌరస్తా వద్ద ఢీకొనడంతో పక్కనే ఉన్న కాల్వర్టులోకి బస్సు, బైక్ జారీ పడినాయి ఈ ప్రమాదంతో బస్సులో ఉన్న ప్రమాణికులకు ఎలాంటి గాయాలు కాలేవు. బస్సు డ్రైవర్‌కు మాత్రమే స్వల్పగాయాలు అయ్యాయి. బైక్ మీద ఉన్న వ్యక్తికి తలకు బలమైన గాయాలు తగలడంతో తాండూర్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమద్యలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతిని మామ మహేఫ్ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యప్తు చేస్తునట్లు ఎస్ఐ తెలిపారు.



# నష్టపోయిన రైతులను ఆదుకుంటాం!






**ప్రజాపక్షం / కొడంగల్ :** కొడంగల్‌లో నష్టపోయిన రైతులను అన్ని రకాలుగా అదుకుంటామని కొడంగల్ వ్యవసాయ అధికారి శంకర్‌నాయక్ అన్నారు. పట్టణంలోని ఓంట్రేడింగ్ ఫర్టీలైజర్ షాపు యాజమాన్యం రైతులకు ఇచ్చిన వరి సీడ్ నాసిరకంగా ఉందంటు యాజమాన్యం చెప్పిన విధంగా పంట దిగుబడి రాలేక వేల కొద్ది రూపాయాలను దండుకున్నారని ఆరోపిస్తు న్యాయం చేయాలని సోమవారం షాపు ముందు రైతులు ధర్నా రాస్తారోకో నిర్వహించారు. దీనిపై స్పందించిన వ్యవసాయ అధికారులు షాపు యాజమాన్యానికి షోకాజ్ నోటీసులు అందిస్తామన్నారు. అదేవిధంగా గత రెండు రోజుల క్రితం మరి కొంత మంది రైతులు కాలం చెల్లిన మందులు విక్రయించారని దీనిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదు చేశారు. దీనిపై కూడా జిల్లా వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు నోటీసులు అందిస్తున్నామన్నారు. ఒక రకం వరి సీడ్ పండిస్తే ఎకరాకు 100 బస్తాల దిగుబడి వస్తుందని రైతులను నమ్మించి మోసం చేయడంపై దారుణమన్నారు. కంపెనీ అధికారులతో చర్చించి ప్రతి ఒక్క రైతుకు న్యాయం చేస్తామని తెలిపారు. కొడంగల్‌లో నకిలి పత్తి విత్తనాలు జోరుగా సాగుతున్నాయని దీనిపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని రైతులు ఆసహానం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాలలో రైతులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టి రైతులను చైతన్య వంతులుగా చేయాల్సిన బాధ్యత అధికారులు తీసుకోవడంలో విఫలం అవుతున్నారని మండిపడుతున్నారు. పంట సాగులపై ఎదైన సమస్య వచ్చి కొడంగల్‌లోని కార్యాలయానికి వస్తే కార్యాలయంలో ఏ ఒక్క అధికారి అందుబాటులో ఉండటం లేదని అవేదన వ్యక్తం చేస్తున్నారు. సిఎం రేవంత్‌రెడ్డి సోంత నియోజకవర్గ కేంద్రంలో అధికారులు సమయ పాలన పాటించకపోవడం సిగ్గు చేటని తీవ్ర విమర్శలు చేస్తున్నారు.

## కోల్పోయిన సిఎం రేవంత్ సిట్టింగ్ స్థానం

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** సిఎం రేవంత్‌రెడ్డి అధికారం చేపట్టే వరకు సిట్టింగ్ స్థానంగా ఉన్న మల్కాజిగిరి పార్లమెంటు సిట్టింగ్ స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ తాజా పార్లమెంటు ఎన్నికల్లో కోల్పోయింది. ఎలాగైనా తన సిట్టింగ్ స్థానాన్ని తిరిగి కాంగ్రెస్ పార్టీయే దక్కించుకోవాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి హోదాలో ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఎన్నికల ప్రచారంలో నేతలకు ఎప్పటికప్పుడు మార్గదర్శకం చేస్తూ స్వయంగా పలు అసెంబ్లీ సెగ్మెంట్లలోనూ రోడ్ షోలతో ప్రచారం చేసినా ఫలితం దక్కలేక పోయింది. అయినప్పటికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన పట్నం సునీతారెడ్డి 5 లక్షల 99 వేల 567 రెండవ స్థానాన్ని దక్కించుకోవటం కాస్త ఊరట కలిగించిందనే చెప్పచ్చు. కాంగ్రెస్ అభ్యర్థిని నామినేషన్ల కంటె కేవలం మూడు రోజుల ముందు ప్రకటించటం, పోటీలో ఉన్న సునీతారెడ్డి స్థానికేతర అభ్యర్థిగా ఉండటం పరాజయానికి కారణమైంది.

## జాతీయ లోక్‌అదాలత్ వాల్ పోస్టర్ ఆవిష్కరణ

**ప్రజాపక్షం/చర్లపల్లి:** లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలని జి ల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్,ప్రధాన న్యాయమూర్తి వి బాల భా స్కర్ రావు అన్నారు.ఈ నెల నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ వాల్ పోస్టర్‌ను బాల భాస్కర్‌రావు,కార్యదర్శి సీనియర్ న్యాయమూర్తి కిరణ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు.అన్ని పోలీస్ స్టేషన్లలో గోడ పత్రికలను డిస్ప్లే చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అధికారులు పి నర్సింహారెడ్డి,డెవిడ్ రాజు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మల్కాజిగిరిలో సంబురాలు



**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** మల్కాజిగిరి ఎంపిగా బిజెపికి చెందిన ఈటెల రాజేందర్ ఘన విజయం సాధించటంతో మల్కాజిగిరి అసెంబ్లీ పరిధిలో వాడ వాడల్లో పలు కూడళ్లలో సంబురాలు మంగళవారం జరుపుకొన్నారు. మౌలాలి హనుమాననగర్ ప్రాంతంలో బిజెపికి చెందిన మోహన్ యాదవ్, మహేష్ యాదవ్, వేణు శేఖర్ రాజు, సతీష్,ధనరాజ్ యాదవ్, సురేష్, సతీష్, వేణు, మేకల దీప్తి, అఖిల్ భరత్‌యాదవ్, రాజు, కృష్ణ, హరీష్ తదితరులు నూతన ఉత్సాహంతో స్వీట్లు పంచుతూ సంతోషం వ్యక్తం చేసారు. మల్కాజిగిరి ప్రాంతంలో స్థానిక కార్పొరేటర్ శ్రవణ్ కుమార్ ఆధ్వర్యంలో సంబరాలు చేసుకొన్నారు.



## చర్లపల్లిలో టిడిపి నాయకులు సంబురాలు



**ప్రజాపక్షం/చర్లపల్లి:** తెలుగు దేశం పార్టీకి పూర్వ వస్తుందని మేడ్చల్ జిల్లా టిడిపి కార్యదర్శి,కంటెస్టెంట్ కార్పొరేటర్ రుద్రగోని రాంచందర్‌గౌడ్ అన్నారు. ఆంధ్ర ప్రదేశ్‌లో సాధారణ ఎన్నికల్లో అఖండ విజయం సాధించి చంద్రబాబు నాయుడు నాల్గవ ముఖ్యమంత్రి కానుండంతో చర్లపల్లి డివిజన్ పరిధిలోని పెద్ద చర్లపల్లి చౌరస్తాలో రుద్రగోని రాంచందర్‌గౌడ్,జి రాములుయాదవ్‌తో కలసి కేట్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. అనంతరం టపాకాయలు కాల్చారు.కె ప్రేంకుమార్‌గౌడ్,ఆర్ వెంకటేష్‌గౌడ్, కాసలు నందం గౌడ్,సత్యంయాదవ్,ఆర్ నాథం,పి శ్రీనివాస్,కె కృష్ణారావు,కొండ జంగా రెడ్డి,ఉమాశంకర్‌గౌడ్,శ్రీకాంత్‌గౌడ్,ఉత్తిష్ణ,రామయ్యతదితరులుపాల్గొన్నారు.

**వివేకానందనగర్ కాలనీలో...**

తెలుగుదేశం పార్టీ ఆంధ్రప్రదేశ్‌లో విజయం సాధించిన సందర్భంగా టిడిపి నాయకులు ఉత్తిష్ణ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. అనంతరం టపాకాయలు కాల్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రుద్రగోని రాంచందర్‌గౌడ్,నాగారం నాయకులు కొండ జంగారెడ్డి,ఉమాశంకర్ గౌడ్,రామయ్య తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాలతో పత్తి రైతు చిత్తు!

**ప్రజాపక్షం / కొడంగల్ :** విత్తనాలు లేనిదే... పంట లేదు.. వ్యవసాయానికి ప్రదానమైనవి విత్తనాలు.. విత్తనం నాటకుంటే అసలు పంటలే లేవు.. విత్తనాల పైనే రైతుల జీవితాలు ఆధారపడి సాగుతున్నాయి కాని అలాంటి విత్తనాలే నట్టేట ముంచుతున్నాయి. కొడంగల్ నియోజకవర్గంలో నకిలి పత్తివిత్తనాల జోరు గుట్టుచప్పుడు సాగుతున్న అధికారులలో చలనం లేకపోలేదని రైతులు బహిరంగంగా గుసగుసలాడుతున్నారు. కార్ణటక సరిహద్దు ప్రాంతాల నుంచి అక్రమంగా తరలివస్తున్న విత్తనాల దందాకు అడ్డుకట్ట పడటం లేదని పలువురు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. సీజన్ కాకముందే చాపకింద నీరులా నకిలి పత్తి విత్తనాల దందా జోరుగా సాగిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.కొడంగల్ నియోజకవర్గంలో అమాయక రైతులను ఆసరా చేసుకుని కొంత మంది దళారులు నకిలి పత్తి విత్తనాలను అంటగడుతు అందిన కాడికి దోచుకుతింటున్న పట్టించుకునే నాథుడే కరువైయ్యాడని రైతులు లబోదిబోమంటున్నారు. కొంత మంది స్థానికంగా ఏజెంట్లను ఏర్పాటు చేసుకుని దర్జాగా నకిలి దందా చేసుకుంటున్నారు. పటిష్ట లోపం కారణంగా ఏటా వానకాలం సీజన్‌లో నకిలీ దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. కొడంగల్ సరిహద్దులో గల కార్ణటక నుంచి నకిలి పత్తి విత్తనాలు దళారులు వందల క్వింటాళ్లు దిగుమతి చేసుకుని నేరుగా రైతుల వద్దకు వెళ్లి వారికి మాయ మాటాలు చెప్పి పంటకు ముందుగానే డబ్బులను ఆశ జూపి పోలం ఎంత ఉంది..? ఈ సీజన్‌లో పత్తి ఎంత వేస్తున్నారు...? ఎన్ని విత్తనాలు కావాలి..? అనే అంశాలను ఆరా తీసి రైతులకు అంటగడుతున్నారని



పట్టుబడిన నకిలీ పత్తివిత్తనాల సంచులు(పాతపోటో)

వాపోతున్నారు. తోలకరి జల్లులు పడకముందే విత్తనాలు మీ ఇంటి కాడికి వస్తాయని మీరు ఎలాంటి చింత చేయాల్సిన పని లేదు అంటు మోసపూరితమైన మాటాలు చెబుతున్నాట్లు సమాచారం. నకిలి విత్తనాలను అరికట్టేందుకు అధికారులు పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నప్పటికి దళారులు పంథా మార్చి రైతులకు నేరుగా సరఫరా చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. మారుమూల గ్రామాలలో ఈ దందా యథేచ్ఛగా కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. కొడంగల్ రైతుల అమాయకత్వం నిరక్షరాస్యతను ఆసరాగా చేసుకుని నకిలీ, లూజ్ విత్తనాలు జోరుగా సాగుతున్నాయని కూడా చెప్పవచ్చు. మరి ముఖ్యంగా గ్రామాల్లో ఏజెంట్లను ఏర్పాటు చేసుకుని వారి ద్వారా గ్రామాలలో అమ్ముతున్నట్లు విశ్వసనీయ సమాచారం, నకిలి పత్తి విత్తనాలపై విస్తృత ప్రచారం చేయాల్సిన వ్యవసాయ శాఖ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దళారులు అడిగినంత డబ్బులు ఇస్తుండటం, అడినవన్ని డబ్బులు సమాకూర్చుతుండటం పై రైతులు కూడా వారి వైపు మొగ్గుచూపుతున్నారని ఇప్పటికైన అధికారులు గ్రామ క్షేత్ర స్థాయిలో సదస్సులు నిర్వహించి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని వాపోతున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి సోంత నియోజకవర్గంలోనే నకిలి విత్తనాల జోరు సాగుతుంటే ఇక రాష్ట్రంలో పరిస్థితి ఎలా ఉంటుందోనని మరికొంత మంది మీడియా వేదికగా అధికారుల తీరుపై తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. సాధారణంగా రైతులు తాము పండించిన పంటనే విత్తనాలుగా వాడి మళ్లీ పంటలు పండిస్తుంటారు. కొడంగల్‌లో ఇటీవలే హస్నాబాద్ గ్రామంలోని ఓ దళారి ఏజెంట్ నివాసంలో 20 ప్లాస్టిక్ సంచులలో దాదాపు 9.72 క్వింటాళ్ల నకిలి పత్తివిత్తనాలను పోలీసులు స్వాదీనం చేసుకున్నారు. అదేవిధంగా పట్టణంలోని ఓ బడా వ్యాపారి దుకాణంలో కాలం చెల్లిన నకిలి పత్తివిత్తనాల ను విక్రయించడంపై రైతులు పోలీసులకు పిర్యాదు చేశారు. కొడంగల్ ఇంత దారుణాలు చోటు చేసుకుంటున్న వ్యవసాయ అధికారులు మాత్రం ఎక్కడ కనిపించడం లేదని రైతులకు ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ కార్యాలయానికి వెళితే అక్కడ ఉదయం 10 గంటలు అయిన కార్యాలయం తెరచుకోదని మధ్యాహ్నం వేళల్లో వెళితే ఏ అధికారి కూడా అందుబాటులో ఉండటం లేదని రైతులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన జిల్లా స్థాయి అధికారులు స్పందించి రైతులు మోసపోకుండా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## రోడ్డు ప్రమాదం విద్యార్థి మృతి

**పజాపక్షం/చర్లపల్లి:** రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి చెందిన సంఘటన చర్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.సిఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం కుషాయిగూడ సాయి నగర్ కాలనీకి చెందిన కాటెపల్లి వివేకానంద రెడ్డి(16) తన స్నేహితులు రిత్విక్,శివలతో కలసి చక్రీపురం నుండి చిన్న చర్లపల్లికి ద్విచక్ర వాహనం(టిఎస్ 10ఈఎస్ 9752)పై వస్తుండగా మోడి అపార్ట్‌మెంట్ వద్ద తన స్నేహితుడు శివ అతి వేగంగా నిర్లక్షంగా నడిపి ఏపి 21 టిటి 7163 టాటా ఏస్ వాహానానికి ఢీకొట్టాడు.వివేకానందరెడ్డి ఎడమ కాలు,బ్యాక్ బోన్‌కు గాయలు కావడంతో సూర్య ఆర్థో హస్పిటల్‌కు తరిలించారు.చికిత్స పొందుతూ అతను మృతి చెందాడని పోలీసులు తెలిపారు.బంధువులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

## మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ

### వృథాగా పోతున్న తాగునీరు



**ప్రజాపక్షం/ములకలపల్లి:** ములకలపల్లి మండలంలోని జగన్నాధపురం గ్రామంలో రామాలయం వద్ద మిషన్ భగీరథ పైపు లీకై గత నాలుగు రోజులుగా నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. ఈ భగీరథ ప్రవాహాన్ని ఆపేవారే లేరా అని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. గ్రామంలో గత నాలుగు రోజులుగా వరద నీరు ప్రవహిస్తున్న గ్రామ పంచాయితీ అధికారులు కనీసం స్పందించడం లేదని, అదే విధంగా మిషన్ భగీరథ అధికారులు సైతం స్పందించకపోవడంతో వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైపు లైన్‌కు మరమ్మత్తులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# క్రీడ

## రోహిత్‌శర్మ భావోద్వేగం!



టీమిండియా హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ పదవి కాలం టి20 ప్రపంచకప్ 2024తో ముగియనుండటంపై కెప్టెన్ రోహిత్ శర్మ భావోద్వేగానికి గురయ్యాడు. టీమిండియా హెడ్‌కోచ్‌గా కొనసాగాలని తాను రాహుల్ ద్రవిడ్‌ను ఒప్పించే ప్రయత్నం చేశానన్నాడు. కానీ ఆయన అంగీకరించలేదని చెప్పాడు. టీ20 ప్రపంచకప్ 2024లో భాగంగా టీమిండియా బుధవారం ఐర్లాండ్‌తో తొలి మ్యాచ్ ఆడనుంది. ఈ మ్యాచ్ నేపథ్యంలో మంగళవారం మీడియాతో మాట్లాడిన రోహిత్ శర్మను టీమిండియా హెడ్‌కోచ్‌గా ఈ టోర్నీతో రాహుల్ ద్రవిడ్ పదవి కాలం ముగియడంపై ప్రశ్నించగా భావోద్వేగానికి గురయ్యాడు. రాహుల్ ద్రవిడ తనకు పెద్ద రోల్ మోడల్ అని, అతని కోచింగ్‌ను పూర్తిగా ఆస్వాదించానని తెలిపాడు. 'టిమిండియా హెడ్ కోచ్‌గా కొనసాగాలని ద్రవిడ్‌ను ఒప్పించే ప్రయత్నం చేశాను. కానీ ఆయన సుముఖంగా లేడు. కానీ వ్యక్తిగతంగా నేను ఆయన కోచింగ్‌ను ఆస్వాదించాను. ఇంతకు మించి నేను ఏం మాట్లాడలేను. అసలు మేం ఆయన పదవి కాలం ముగియడం గురించే ఆలోచించ లేదు. ఆయనతో నా ప్రయాణం చాలా సుదీర్ఘమైనది. నేను ఆయన సారథ్యంలో ఆడాను. మాకు ఆయన ఓ బిగ్ రోల్ మోడల్. ఆయనేం సాధించాడో మాకు బాగా తెలుసు. కెరీర్‌లో చాలా ధృఢ సంకల్పాన్ని ప్రదర్శించారు. ఆయనతో ప్రతీ క్షణాన్ని నేను ఆస్వాదించాను' అని రోహిత్ శర్మ చెప్పుకొచ్చాడు. ఇక టీమిండియా హెడ్ కోచ్‌గా రాహుల్ ద్రవిడ్ పదవి కాలం ఈ టీ20 ప్రపంచకప్‌తో ముగియనుంది. ఇప్పటికే బీసీసీఐ తదుపరి టీమిండియా హెడ్ కోచ్ పదవి ఎంపిక ప్రక్రియను మొదలు పెట్టింది. దరఖాస్తులను కూడా ఆహ్వానించింది. అయితే దరఖాస్తుల గడువు ముగిసిన తర్వాత బీసీసీఐ టీమిండియా హెడ్ కోచ్ పదవి గురించి ఎలాంటి ప్రకటన చేయలేదు. కనీసం దరఖాస్తుల విషయాన్ని కూడా వెల్లడించలేదు. మరోవైపు టీమిండియా హెడ్ కోచ్‌గా గౌతమ్ గంభీర్ పేరు ఖరారు చేశారని, అతి త్వరలోనే అధికారిక ప్రకటన వస్తుందని నేషనల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. గౌతమ్ గంభీర్ సైతం టీమిండియా హెడ్ కోచ్ పదవిని స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపాడు. 'భారత జట్టుకు కోచ్‌గా పనిచేయడం నాకిష్టం. అంతకు మించిన గౌరవం లేదు. మన జాతీయ జట్టుకు హెడ్ కోచ్‌గా పనిచేయడం అంటే ఎంతో గౌరవమైన బాధ్యత. 140 కోట్ల మంది భారతీయులకు ప్రాతినిథ్యం వహిస్తున్నట్లు. ప్రపంచవ్యాప్తంగా కూడా ప్రత్యేకమైన గుర్తింపు. టీమిండియాకు ప్రాతినిథ్యం వహించడం కన్నా మించిన పదవి ఏది లేదు.'అని ఓ కార్యాక్రమంలో గంభీర్ వెల్లడించాడు.

## హిట్‌మ్యాన్‌పై కన్నేసిన ఆ మూడు జట్లు!

ఐపిఎల్ 2025 సీజన్‌లో కెప్టెన్ రోహిత్ శర్మ ముంబయి ఇండియన్స్ తరఫున బరిలోకి దిగే సూచనలు కనిపించడం లేదు! ఎందుకంటే ఇప్పటికే అతడు ముంబయి ఫ్రాంఛైజీపై అసంతృప్తిగా ఉన్నట్లు ఆ మధ్య జోరుగా ప్రచారం సాగింది. సుదీర్ఘ కాలం పాటు ఆ జట్టును ముందుకు నడిపించిన హిట్‌మ్యాన్ ఐదు సార్లు విజేతగా కూడా నిలబెట్టాడు. కానీ జట్టు యాజమాన్యం మాత్రం ఐపిఎల్ 2024లో అతడిని కెప్టెన్సీ నుంచి తప్పించి హార్దిక్ పాండ్యాకు బాధ్యతలను అప్పగించింది. అయినా కూడా అతడు ప్లేయర్‌గా కొనసాగాడు. కానీ 2025 సీజన్‌కు మాత్రం అతడు ముంబయి తరఫున ఆడే ఛాన్స్ లేదని ప్రస్తుతం మరోసారి వార్తలు వినిస్తున్నాయి. ఇదే సమయంలో అతడు మెగావేలంలోకి వస్తే అతడిని కొనుగోలు చేసేందుకు ఇతర ఫ్రాంఛైజీలు కాచుకొని ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా మూడు ఫ్రాంఛైజీలు హిట్ మ్యాన్‌పై కోట్లు కుమ్మరించే అవకాశాలు ఉన్నాయి. గుజరాత్ టైటాన్స్ హిట్ మ్యాన్‌పై గుజరాత్ టైటాన్స్ కన్నేసినట్లు సమాచారం. 2024 సీజన్‌లో గిల్ కెప్టెన్సీలోని గుజరాత్ టైటాన్స్ విఫలమైంది. హార్దిక్ జట్టును వీడి ముంబయికి వెళ్లిపోవడం ఆ టీమ్‌ను బలహీనంగా మార్చింది. అందుకే రోహిత్ వేలంలోకి వస్తే కొనాలని ఆశిస్తోందట. అలానే జట్టుకు పూర్వవైభవం తేవాలని అనుకుంటోందట. పంజాబ్ కింగ్స్ ఐపిఎల్ 2024 సీజన్‌లో దారుణంగా విఫలమైంది పంజాబ్ కింగ్స్. దీంతో ఓ ఐకానిక్ ప్లేయర్ కోసం ఎదురుచూస్తున్న ఆ జట్టు రోహిత్‌పై కన్నేసిందని తెలుస్తోంది. 37 ఏళ్ల వయసున్న హిట్ మ్యాన్ మరో మూడేళ్లు ఐపిఎల్ ఆడినా తమ జట్టుకు కలిసొస్తుందని ఆశిస్తోంది. అలాగే ఫిట్‌నెస్ సమస్యలతో పాటు ఇంటర్నేషనల్ క్రికెట్‌కు దూరంగా ఉన్న తమ జట్టు కెప్టెన్ శిఖర్ ధావన్‌పై వేటు వేయాలని చూస్తోంది. అతడి స్థానాన్ని రోహిత్‌తో భర్తీ చేయాలని అనుకుంటోందని సమాచారం. కెకెఆర్ ఈ సీజన్ ట్రోఫీని ముద్దాడిన కెకెఆర్ కూడా రోహిత్ శర్మపై మొగ్గు చూపే అవకాశం ఉందని తెలుస్తోంది. గౌతమ్ గంభీర్‌తో ఉన్న సత్సంబంధాలు, కెకెఆర్‌కు ఆడాలనే రో హిత్ శర్మ కోరిక ఈ వాదనకు బలాన్ని చేకూరుస్తోంది. గతంలో ఓ ఇంటర్వ్యూలో ముంబయి కాకుండా ఇతర ఫ్రాంచైజీ కావాలనుకుంటే తాను కెకెఆర్‌కు ఆడుతానని రోహిత్ అన్నాడు. కాబట్టి అనుభవం కలిగి న ప్లేయర్ జట్టులో ఉంటే కలిసొస్తుందని కేకేఆర్ భావిస్తున్నట్లు సమాచారం.

## టీమ్ ఇండియాకు ఓ న్యాయం – మాకో న్యాయమా!



టి20 ప్రపంచకప్ 2024 గ్రూప్ స్టేజ్‌లో తమ జట్టు ఆడేందుకు సిద్ధం చేసిన వేదికలపై శ్రీలంక స్పిన్నర్ తీక్షణ అసహనం వ్యక్తం చేశాడు. గ్రూప్ స్టేజ్‌లో తమ జట్టు ఆడబోయే నాలుగు మ్యాచ్‌లకు భిన్నమైన నాలుగు వేదికలను ఏర్పాటు చేయడం అన్యాయమని అన్నాడు. కొన్ని జట్లకు మాత్రం అన్ని మ్యాచ్‌లు ఒకే వేదికగా ఆడేలా షెడ్యూల్ సిద్ధం చేశారని అన్నాడు. అయితే టీమ్‌ఇండియాను ఉద్దేశించి పరోక్షంగా ఇలా ప్రస్తావించాడని కొందరు అంటున్నారు. అలానే తమ జట్టు బస చేయడానికి ఇచ్చిన హోటల్ గురించి కూడా ప్రస్తావించాడు తీక్షణ. హోటల్ నుంచి మైదానానికి రావడానికి సుమారు గంట 40 నిమిషాల సమయం పడుతుందని మండిపడ్డాడు. కొన్ని జట్లకు మాత్రం 15 నిమిషాల్లోనే స్టేడియానికి చేరుకునేలా ఏర్పాట్లు చేశారని ఆరోపించాడు. దక్షిణాఫ్రికాతో మ్యాచ్ కోసం న్యూయార్క్ వచ్చేందుకు విమానాశ్రయంలోనే తమ ఆటగాళ్లంతా ఎనిమిది గంటలు వేచి చూశారని పేర్కొన్నాడు. దక్షిణాఫ్రికాతో మ్యాచ్ ముగిసిన అనంతరం తమ షెడ్యూల్ గురించి మాట్లాడుతూ ఈ కీలక వ్యాఖ్యలు చేశాడు. భవిష్యత్‌లో అయినా ఇలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరాడు. కాగా, ప్రపంచ కప్ 2024లో 20 జట్లు బరిలోకి దిగాయి. అమెరికా, వెస్టిండీస్ కలిసి ఈ మెగాటోర్నీకి ఆతిథ్యం ఇస్తున్నాయి. ఈ ఐదు జట్లను నాలుగు గ్రూప్‌లుగా విభజించారు. గ్రూప్ స్టేజ్‌లో ఒక్కో జట్టు తమ గ్రూప్‌లోని ఇతర టీమ్లతో నాలుగు మ్యాచులు ఆడాల్సి ఉంటుంది. అయితే శ్రీలంక, నెదర్లాండ్స్ జట్లు మాత్రమే నాలుగు మ్యాచ్‌లను భిన్నమైన వేదికలపై ఆడనున్నాయి. ఇకపోతే గ్రూప్ స్టేజ్‌లో టీమ్‌ఇండియా, సౌతాఫ్రికా ఒకే వేదికగా మూడు మ్యాచ్‌లు ఆడుతున్నాయి. ఒక మ్యాచ్ మాత్రమే మరో వేదికగా పోటీపడనున్నాయి. అలానే గ్రూప్‌డీలో దక్షిణాఫ్రికా, లంకతో పాటు నెదర్లాండ్స్, బంగ్లాదేశ్, నేపాల్ జట్లు ఉన్నాయి. ఇక న్యూయార్క్ నాసా కంట్రీ స్టేడియం వేదికగా జరిగిన మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా చేతిలో లంక ఆరు వికెట్ల తేడాతో ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది.



# రీల్

## 'మనమే' ప్రీ-రిలీజ్ డేట్, టైం ఫిక్స్

యంగ్ హీరో శర్వానంద్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'మనమే' జూన్ 7న రిలీజ్‌కు రెడీ అయ్యింది. ఈ సినిమాను దర్శకుడు శ్రీరామ్ ఆదిత్య డైరెక్ట్ చేస్తుండగా, అందాల భామ కృతి శెట్టి హీరోయిన్ గా నటిస్తోంది. ఈ చిత్రాన్ని అన్ని వర్గాల ప్రేక్షకులు మెచ్చే విధంగా తీర్చిదిద్దినట్లుగా చిత్ర యూనిట్ చెబుతూ వస్తోంది. ఇక ఈ చిత్ర టీజర్, ట్రైలర్లు సినిమాపై ప్రేక్షకుల్లో అంచనాలను పెంచేశాయి. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ వేడుకపై గత కొద్ది రోజులుగా డైలమా ఏర్పడింది. ఈ వేడుకను పిఠాపురంలో నిర్వహిస్తారని.. లేదు హైదరాబాద్‌లో నిర్వహిస్తారని నెట్టింట వార్తలు చక్కర్లు కొట్టాయి. అయితే, తాజాగా ఈ విషయంపై మేకర్స్ ఓ క్లారిటీ ఇచ్చారు. మనమే చిత్ర ప్రీరిలీజ్ ఈవెంట్ హైదరాబాద్ లోని పార్క్ హయత్‌లో నిర్వహిస్తున్నట్లు వారు ప్రకటించారు. జూన్ 5న సాయంత్రం 6 గంటల నుండి ఈ ఈవెంట్ మొదలవుతుందని ఓ పోస్టర్ ద్వారా మేకర్స్ వెల్లడించారు. అయితే, ఈ ఈవెంట్‌కు గెస్ట్‌గా ఎవరు వస్తారనే విషయంపై మాత్రం మేకర్స్ ఎలాంటి క్లారిటీ ఇవ్వలేదు. ఈ సినిమాలో సీరత్ కపూర్, రాహుల్ రామకృష్ణ, రాహుల్ రవీంద్రన్, అయెషా ఖాన్ తదితరులు ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

## పిఠాపురంలో రికార్డు మార్జిన్‌తో పవన్ విజయఢంకా



టాలీవుడ్ స్టార్ హీరోస్ లో ఒకరైన పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానులు ఎన్నో ఏళ్ళు నుంచి ఆసక్తిగా ఎదురు చూస్తున్న ఆ బిగ్గెస్ట్ మాస్ డే నేడు వచ్చేసింది. మంచి ఉత్కంఠభరిత పరిస్థితుల్లో పవన్ కళ్యాణ్ మొట్ట మొదటిసారిగా ఎమ్మెల్యేగా గెలుపొందారు. గత సార్వత్రిక ఎన్నికల్లో రెండు స్థానాల్లో పోటీ చేస్తే రెండిట్లో కూడా ఘోర ఓటమిని చవి చూసారు. అయితే ఈసారి మాత్రం 2024 ఎన్నికలకి సమీకరణాలు మార్చి చాలా పెద్ద మార్పులకే నాంది పలికారు. అలా ఇప్పుడు భారీ విజయాన్ని తాను పోటీ చేసిన పిఠాపురం నియోజకవర్గం నుంచి తాను సొంతం చేసుకున్నారు. ఏకంగా 70,354 మార్జిన్ తో పిఠాపురం ప్రజలు పవన్ కళ్యాణ్ ని తమ ఎమ్మెల్యేగా ఎన్నుకొన్నారు. మరి మొత్తంగా 18 రౌండ్లకు 69,169 ఓట్లు రాగా పోస్టల్ బ్యాలెట్ 1,671 పోస్టల్ బ్యాలెట్ లో పవన్ కళ్యాణ్ కి పోల్ అయ్యాయి. దీనితో 70,354 పిఠాపురం చరిత్రలోనే రికార్డు విజయంగా ఇది నమోదు అయ్యింది. అలాగే ఇది ఏపీలో కూడా హైయెస్ట్ మెజార్టీలలో ఒకటిగా నిలిచింది. మొత్తానికి అయితే పవన్ అభిమానులు, పవన్ ఎన్నో ఏళ్ల నుంచి కంటున్న కల అసెంబ్లీలో అడుగు పెట్టడం అనేది ఖాయం అయ్యిపోయింది.

## ప్రతి విద్యార్థి చూడాల్సిన చిత్రం 'ప్రేమించొద్దు'



శిరిన్ శ్రీరామ్ కేఫ్ బ్యాన్స్ అనురూప్ రెడ్డి, దేవా మలిశెట్టి, సారిక, మానస ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం ప్రేమించొద్దు. శిరిన్ శ్రీరామ్ దర్శక నిర్మాణంలో సినిమా రూపొందింది. బస్తీ నేపథ్యంలో సాగే యూత్ఫుల్ ప్రేమ కథాంశమిది. ఈ సినిమా సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుంది. పాన్ ఇండియా చిత్రంగా 5 భాషల్లో నిర్మించారు. ఈ చిత్రం తెలుగు వెర్షన్ని జూన్ 7న విడుదల చేస్తున్నారు.ఆ తర్వాత, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో రిలీజ్ చేయటానికి కూడా ప్లాన్ చేస్తున్నారు మేకర్స్. ఈ సందర్భంగా ఆదివారం నాడు మూవీ ట్రైలర్ను లాంచ్ చేశారు. ఇది వరకు రిలీజ్ చేసిన టీజర్, పోస్టర్, సాంగ్స్తో సినిమా మీద మంచి బజ్ ఏర్పడింది. తెలిసీ తెలియని వయసులో ప్రేమించొద్దు అనే కాన్సెప్ట్తో రియల్ ఇన్సిడెంట్ల ఆధారంగా ఈ మూవీని రా అండ్ రస్టిక్గా తెరకెక్కించారని అర్థం అవుతోంది. తాజాగా రిలీజ్ చేసిన ట్రైలర్ను చూస్తే పూర్తి కథను వివరించినట్టుగా తెలుస్తోంది. స్కూల్, కాలేజ్ ఏజ్ లవ్ స్టోరీలు, ప్రేమ అంటూ చదువుల్ని నిర్లక్ష్యం చేయడం, తెలిసీ తెలియని వయసులో ప్రేమిస్తే ఎదురయ్యే పరిణామాలను చూపించారు.ఇక ట్రైలర్లోని విజువల్స్, డైలాగ్స్ ఎంతో నేచురల్గా ఉన్నాయి. సమాజాన్ని తట్టిలేపేలా ఈ చిత్రం ఉంటుందని ట్రైలర్ చూస్తే అర్థం అవుతోంది.

## 1.51 లక్షల మెజారిటీతో గెలిచిన చంద్రశేఖర్ ఆజాద్

**ఉత్తర్‌ప్రదేశ్ :** భీమ్ ఆర్మీ వ్యవస్థాపకుడు చంద్రశేఖర్ ఆజాద్ లోక్‌సభలోకి అడుగుపెట్టనున్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని నగీన పార్లమెంటు నియోజకవర్గం నుండి ఆయన 1.51 లక్షల మెజారిటీతో బిజెపి అభ్యర్థి ఓం కుమార్‌పై గెలుపొందారు. ఆజాద్ సమాజ్ పార్టీ (కాన్షీరామ్) పేరుతో స్వంతంగా పార్టీ ఏర్పాటు చేసుకొని చంద్రశేఖర్ ఆజాద్ ఎన్నికల్లో పోటీ చేశారు.

## ఏడు దశల్లో పోలింగ్

**న్యూఢిల్లీ:** భారత ఎన్నికల కమిషన్ (ఇసిఐ) 18వ లోక్‌సభ ఎన్నికలను ఏడు దశల్లో పూర్తి చేసింది. 17వ లోక్‌సభ పదవీకాలం 2024 జూన్ 16వ తేదీతో ముగియనుండగా, ఈలోపే కొత్త ప్రభుత్వం కూడా ఏర్పాటవుతుంది. ఏప్రిల్ 19న మొదటి దశతో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ మొదలు కాగా, జూన్ 1వ తేదీన, చివరిదైన ఏడో విడత పోలింగ్‌తో ముగిసింది. ఎలాంటి అవాంతరాలు లేకుండా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయడానికి 55 లక్షల ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ (ఇవిఎం)లను ఉపయోగించారు. 10 లక్షల 50 వేల పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. కోటిన్నర మంది సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొన్నారు. కాగా, దేశంలో మొత్తం 97 కోట్ల ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుష ఓటర్లు 49.7 కోట్లు. మహిళా ఓటర్లు 47.1 కోట్ల మంది ఉన్నారు. మొదటిసారి ఓటు హక్కును వినియోగించుకునే అర్హత ఉన్నవారు 1.8 కోట్లు. 85 ఏళ్లు దాటిన వారు 82 లక్షల మంది, ట్రాన్స్ జెండర్స్ 48 వేల మంది, యువ ఓటర్లు 19.74 కోట్ల మంది, వందేళ్లు దాటిన వారు 2.18 లక్షల మంది, సర్వీస్ ఓటర్లు 19.1 లక్షల మంది, దివ్యాంగ ఓటర్లు 88. 4 లక్షల మంది ఉన్నారు. అధికారిక వివరాలు అందకపోయినప్పటికీ, అన్ని దశల్లోనూ కలిసి సగటున 65 నుంచి 67 శాతం పోలింగ్ జరిగిందని అంచనా. వీరంతా ఈసారి అద్భుతమైన, విలక్షణమైన తీర్పునిచ్చారు. అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య తీవ్రమైన పోరు ఉండేలా ఓటు వేశారు.

## మూల్యం చెల్లించుకున్న స్మృతీ ఇరానీ



**అమేథీ:** ఉత్తరప్రదేశ్‌లోని అమేథీ నియోజకవర్గం నుంచి వరుసగా రెండోసారి గెలుస్తానన్న ధీమాతో ఉన్న స్మృతీ ఇరానీకి చుక్కెదురైంది. నోటి దురుసును ప్రదర్శించినందుకు ఆమె భారీ మూల్యాన్నే చెల్లించుకోవాల్సి వచ్చింది. బిజెపి అభ్యర్థిగా 2019లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ఓడించిన స్మృతి ఇరానీ మరోసారి ఆ స్థానం నుంచే పోటీచేశారు. ఎన్నికల ప్రచారంలో ఆమె రాహుల్‌పై విమర్శనాస్త్రాలు గుప్పించారు. ఆయనను 'పిరికివాడు' అని అభివర్ణించారు. తనను ఎదుర్కోలేక రాయ్‌బరేలీకి పరారయ్యారంటూ నోరు పారేసుకున్నారు. కాంగ్రెస్‌ను, ప్రత్యేకించి రాహుల్, ప్రియాంక, సోనియా గాంధీలను లక్ష్యంగా చేసుకొని ఆమె చేసిన వ్యాఖ్యలు చేశారు. ఫలితంగా ఓటర్లను దూరం చేసుకున్నారు. ఆమె విమర్శలు, వ్యాఖ్యలను ప్రజలు తిరస్కరించారనడానికి అమేథీ ఫలితమే నిదర్శనం. ఇక్కడి నుంచి కాంగ్రెస్ అభ్యర్థి కిషోరీలాల్ 1,57,196 ఓట్ల తేడాతో విజయం సాధించారు. ఆయనకు 5,39,228 ఓట్లు లభించగా, స్మృతికి అనుకూలంగా 3,72,032 ఓట్లు పోలయ్యాయి.

## వరదల్లోనూ ఓట్ల లెక్కింపు

**గౌహతి:** బంగ్లాదేశ్ తీరాన్ని తాకిన రెమాల్ తుఫాను కారణంగా సంభవించిన వర్షపాతంతో, ఈశాన్య రాష్ట్రమైన అస్సాంలో వరద పరిస్థితులు నెలకొన్నాయి. అయినప్పటికీ, లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు మంగళవారం కొనసాగింది. కరీంగంజ్ కౌంటింగ్ బూత్‌లో వరద నీరు వచ్చి చేరినప్పటికీ, అధికారులు, సిబ్బంది కౌంటింగ్‌ను ఆపలేదు. వరదల కారణంగా అస్సాంలో దాదాపు 15 మంది మరణించారు. వేలాది మంది నిరాశ్రయులయ్యారు. పరిస్థితి సంక్లిష్టంగా ఉన్నప్పటికీ, కౌంటింగ్‌కు ఎలాంటి ఇబ్బంది లేకుండా అధికారులు పూర్తిచేయగలిగారు. అస్సాంలో మొత్తం 14 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి.

## మెజార్టీల్లో రికార్డుల మోత..

**న్యూఢిల్లీ:** ఈసారి సార్వత్రిక ఎన్నికల్లో గెలుపొందిన నేతల్లో.. పలువురు భారీ మెజార్టీ సాధించి రికార్డు సృష్టించారు. ఇండోర్ లోక్‌సభ స్థానం సిటింగ్ ఎంపి శంకర్ లాల్వానీ.. తన సమీప ప్రత్యర్థిపై ఏకంగా 11.72 లక్షల ఓట్ల మెజార్టీ సాధించి చరిత్ర తిరగరాశారు. మొత్తంగా ఆయనకు 12,26,751 ఓట్లు పోలవగా.. రెండో స్థానంలో నోటాకు 2,18,674 ఓట్లు వచ్చాయి. సమీప ప్రత్యర్థికి కేవలం 51వేల ఓట్లు మాత్రమే రావడం గమనార్హం. సార్వత్రిక ఎన్నికల్లో అత్యధిక మెజారిటీ సాధించిన వ్యక్తిగా బిజెపి నేత ప్రీతమ్ ముండే పేరిట రికార్డు ఉండగా.. తాజాగా ఆ రికార్డును లాల్వానీ అధిగమించారు. బీడ్ లోక్‌సభ స్థానానికి 2014లో జరిగిన ఉప ఎన్నికలో 6.96 లక్షల ఓట్ల తేడాతో ఆమె గెలుపొందారు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా, మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, గుజరాత్ భాజపా నేత సిఆర్ పాటిల్‌లు ఏడు లక్షలకు పైగా మెజార్టీ సాధించిన వారి జాబితాలో ఉన్నారు. అసోంలోని ధుబ్రీ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి రకిబుల్ హుస్సేన్ 10 లక్షలకు పైగా ఆధిక్యంతో దూసుకెళ్తున్నారు. మధ్యప్రదేశ్ మాజీ సిఎం శివరాజ్ సింగ్ చౌహాన్ విదిశ నుంచి 8.21 లక్షల ఓట్లతో విజయం దిశగా పయనిస్తున్నారు. 2019 ఎన్నికల్లో గుజరాత్‌లోని నవసరిలో బిజెపి నేత సిఆర్ పాటిల్ 6.89 లక్షల మెజార్టీ సాధించగా.. తాజా ఎన్నికల్లో 7.73 లక్షలకుపైగా మెజార్టీతో సొంత రికార్డును తిరగరాసుకున్నారు. అమిత్ షాకు మొత్తం 10.10 లక్షల ఓట్లు రాగా.. ప్రత్యర్థిపై 7.44 లక్షల మెజార్టీ సాధించారు. బెంగాల్‌లోని డైమండ్ హార్బర్ లోక్‌సభ స్థానం సిటింగ్ ఎంపి అభిషేక్ బెనర్జీ (టిఎంసి) 7.07 లక్షల మార్జిన్‌తో దూసుకెళ్తున్నారు. ఇప్పటివరకు ఆయనకు 10.43 లక్షల ఓట్లు పోలయ్యాయి. మధ్యప్రదేశ్‌లోని గుణ లోక్‌సభ స్థానం నుంచి బరిలో దిగిన కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా..5.4 లక్షల మెజార్టీతో గెలుపొందారు. వడోదర నుంచి బిజెపి అభ్యర్థి హేమంగ్ జోషి 5.82 లక్షల మెజార్టీతో విజయం సాధించారు. తెలంగాణలోని నల్గొండ లోక్‌సభ నుంచి బరిలో ఉన్న కుందూరు రఘువీర్ 5.59 లక్షల మెజార్టీతో గెలుపొందారు. ఆయనకు మొత్తంగా 7.84 లక్షలకు పైగా ఓట్లు వచ్చాయి. ఖమ్మం నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి 4.67లక్షల మెజార్టీతో ముందున్నారు. మొత్తం ఆయనకు 7.66 లక్షలకుపైగా ఓట్లు వచ్చాయి. మల్కాజిగిరి బిజెపి అభ్యర్థి ఈటల రాజేందర్.. 3.91 లక్షల ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. రాయ్‌బరేలీ నుంచి బరిలో దిగిన కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ.. 3.90 లక్షల ఓట్ల తేడాతో విజయం సాధించారు. వయనాడ్ నుంచి కూడా 3.64 లక్షల మార్జిన్‌తో గెలుపొందారు. వారణాసి నుంచి పోటీలో ఉన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ.. 1.52 లక్షల ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.

## 1,600 మందిపై మైక్రోసాఫ్ట్, గూగుల్ వేటు



**వాషింగ్టన్ :** మైక్రోసాఫ్ట్, గూగుల్ మొత్తంగా 1,600 మంది ఉద్యోగులపై వేటు వేసేందుకు రంగం సిద్ధం చేశాయి. మైక్రోసాఫ్ట్ నుండి ఈ విడతలో 1,500 మంది ఉద్యోగులను, గూగుల్ సుమారుగా 100 మంది పైన వేటు వేస్తున్నాయి. గడచిన జనవరినెలలో మైక్రోసాఫ్ట్ సంస్థ బ్లిజ్జార్డ్, గ్జిబాక్స్ సంస్థల బిజినెస్ హౌస్‌ల నుండి 1,900 మంది ఉద్యోగులకు ఉద్వాసన పలికింది. ఆర్థిక వ్యవస్థలో సుదీర్ఘంగా వస్తున్న ఒడిదొడుకులకు అనుగుణంగా ఈ విడత ఐ టి సెక్టార్ కుదింపులో భాగంగా క్లౌడ్ ఆపరేషన్స్ నుండి 1,500 మందికి ఉద్వాసన చెప్పాలని మైక్రోసాఫ్ట్ నిర్ణయించింది. సుదీర్ఘమైన ఆర్థిక అనిశ్చితి కొనసాగుతున్నప్పటికీ ఆర్థికవృద్ధిపై దృష్టి పెట్టి క్లౌడ్ ఆపరేషన్స్‌ను సంఘటితం చేయడంలో భాగంగా గూడుల్, మైక్రోసాఫ్ట్ రెండు సంస్థలు ఈ లే ఆఫ్‌లకు తెరతీశాయి. అజురే క్లౌడ్ ఆపరేషన్స్ నుండి వందలమంది ఉద్యోగులను తొలగించాలని మైక్రోసాఫ్ట్ ప్లాన్ చేసినట్లు బిజినెస్ ఇన్‌సైడర్ ఒకరు చెప్పారు. క్వాంటమ్ కంప్యూటింగ్, స్పేస్ ఎక్స్‌ప్లోరేషన్‌లో అగ్రగామిపాత్ర వహించేందుకు 2021లో ఏర్పడిన స్ట్రాటజిక్ మిషన్, టెక్నాలజీస్‌లో భాగంగా ఈ గ్రూపులలో ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఈ సంర్భంగా గూగుల్ ప్రతినిధి మాట్లాడుతూ, ఖాతాదారుల ప్రాధాన్యతలను, వ్యాపార అవకాశాలను పరిగణనలోకి తీసుకుని బిజినెస్ ప్లాన్ చేస్తామని అన్నారు.

## బిజెపి ఒంటెత్తు పోకడలు ఇక చెల్లవ్!

**న్యూఢిల్లీ:** నిన్నమొన్నటి వరకూ లోక్‌సభలో తిరుగులేని బలాన్ని అడ్డుపెట్టుకొని, ఇష్టానుసారంగా నిర్ణయాలు తీసుకున్న బిజెపి ఇకపై ఆచితూచి అడుగువేయక తప్పదు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి 303 సీట్లను సంపాదించింది. ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ 52 స్థానాలకు పరిమితమైంది. ఫలితంగా ప్రతిపక్షాలను ఏమాత్రం లక్ష్యపెట్టకుండా, సభలో సరైన రీతిలో చర్చలు జరపకుండా బిల్లులు ప్రవేశపెట్టి, ఆమోదింప చేసుకుంది. ప్రజా సమస్యలు సభలో వినిపించకుండా నియంతృత్వ పోకడలను అనుసరించింది. కానీ, ఈసారి ఎన్నికల్లో మోదీ బృందం అతి కష్టం మీద ఓటమి నుంచి బయటపడింది. వరుసగా మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నది. కానీ, ఇప్పుడు ప్రతిపక్షం బలంగా ఉంది. సార్వత్రిక ఎన్నికలకు మాత్రమే పరిమితమై పొత్తు పెట్టుకున్న తెలుగు దేశం పార్టీ (టిడిపి), జనతాదళ్ యునైటెడ్ (జెడియు) వంటి పార్టీలు సభలో ఏ విధానాన్ని అనుసరిస్తాయో తెలియని పరిస్థితి. ఇప్పటికైనా తన వైఖరిని మార్చుకోకపోతే, అధికారంలో కొనసాగడం కూడా కష్టమవుతుంది. ఇప్పటికే మిత్రపక్షాల అండతో నడవాల్సిన దుస్థితిని బిజెపి ఎదుర్కొంటున్నది. మరోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే, గతంలో మాదిరి కేవలం మతం కార్డును ఉపయోగిస్తూ, ప్రజాసమస్యలను పక్కదారి పట్టించడం మోదీకి కుదరదు. ఇప్పటికే దేశం అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నది. ప్రతిపక్ష పార్టీలను కూడా పరిగణలోకి తీసుకొని, సమస్యల పరిష్కారానికి వ్యూహాత్మక ప్రణాళికలను సిద్ధం చేసుకొని, వాటిని అమలు పరచాల్సిన అవసరం ఉంది. దేశ వ్యాప్తంగా కోట్లాది మంది యువతీయువకులు ఎదుర్కొంటున్న నిరుద్యోగ సమస్యను ఎదుర్కోవడానికి మార్గాలను అన్వేషించాలి. ఆర్థికాభివృద్ధి, స్థూల జాతీయోత్పత్తి (జిడిపి) గణాంకాలను వల్లెవేస్తూ, దేశం అభివృద్ధి పథంలో దూసుకెళ్లిందనే భ్రమల్లోనే ప్రజలను ఉంచడం బిజెపికి ఇకపై సాధ్యం కాదు. వ్యవసాయ రంగాన్ని పీడిస్తున్న సమస్యలను కూడా సత్వరమే పరిష్కరించాల్సిన అవసరం ఉంది. లేకపోతే, ప్రతిపక్షాల నుంచి గతంలో ఎన్నడూ లేని రీతిలో తీవ్రమైన ఒత్తిడి తప్పదు. ఇప్పటికే బిజెపి నైతికంగా పరాజయాన్ని ఎదుర్కొంది. కేవలం మాటల గారడీలు.. గణాంకాల చిట్టాలు... మతపరమైన అంశాలు ఓట్లు రాల్చవని ఆ పార్టీకి అర్థమై ఉంటుంది. ప్రస్తుతం బిజెపి వైపు ఉంటాయనుకుంటున్న రెండు మూడు పార్టీలు యూటర్న్ తీసుకుంటే, కాంగ్రెస్ నేతృత్వంలోని 'ఇండియా' కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశాలు లేకపోలేదు. ఈ విషయాన్ని బిజెపి గ్రహించాలి. గతంలో అనుసరించిన విధానాలను పక్కకుపెట్టి, నిజమైన అభివృద్ధి దిశగా దేశాన్ని నడిపించాలి. మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలి. ద్రవ్యోల్బణాన్ని అరికట్టడం, మెరుగైన ఆరోగ్యాన్ని అందించడం వంటి కీలక అంశాలపై దృష్టి పెట్టాలి. పర్యావరణ పరిరక్షణ అనేది ఇప్పుడు యావత్ ప్రపంచం ముందున్న అతిపెద్ద సవాలు. ఇప్పటికే దేశ రాజధాని ఢిల్లీసహా ఎన్నో నగరాలు, పట్టణాలు తీవ్రమైన కాలుష్యాన్ని ఎదుర్కొంటున్నాయి. ఈ సమస్యపై యుద్ధ ప్రాతిపదికన నిర్ణయాలు తీసుకోవాలి. దేశంలో కార్మికుల నుంచి విద్యార్థుల వరకూ అన్ని వర్గాలు సమస్యలు ఎదుర్కొంటున్నాయి. ఇంత వరకూ బిజెపి అనుసరించిన వైఖరే ఇందుకు కారణం. ఇకపై 'ఆడింది ఆట.. పాడింది పాట'గా పాలన కొనసాగించడం అసాధ్యం. బిజెపి పట్ల దేశ వ్యాప్తంగా పెరుగుతున్న అవిశ్వాసం, అసహనాన్ని గుర్తించి, ఆ పార్టీ అగ్ర నాయకత్వం ప్రజాహిత పాలన చేపట్టాలి. కాగితాల్లో కాకుండా, నిజమైన అభివృద్ధికి బాటలు వేయాలి.

## 'ఇండియా' కూటమిలోకి నితీశ్?



**న్యూఢిల్లీ:** బీహార్ ముఖ్యమంత్రి, జనతా దళ్ యునైటెడ్ (జెడియు) చీఫ్ నితీశ్ కుమార్ మళ్లీ 'ఇండియా' కూటమిలోకి వస్తారా? దేశ వ్యాప్తంగా ఈ ప్రశ్నపైనే చర్చ జరుగుతున్నది. నిజానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించే లక్ష్యంతో అన్ని ప్రతిపక్ష పార్టీలను ఒకేతాటిపైకి తీసుకొచ్చి, 'ఇండియా' కూటమిని ఏర్పాటు చేయడంలో నితీశ్ కీలక పాత్ర పోషించారు. అయితే, అనూహ్యంగా 'యూ టర్న్' తీసుకొని, బిజెపితో చేతులు కలిపారు. ఇప్పుడు ఎన్నికల ఫలితాలు వెల్లడైన తర్వాత, బిజెపితో వెళ్లడం కంటే, 'ఇండియా' కూటమితో కలవడమే మేలని ఆయన ఒక అభిప్రాయానికి వచ్చినట్టు చెప్తున్నారు. ఇందుకు సంబంధించిన ఒక పోస్టు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నది. 'న్యాయ్‌కే సాథ్... వికాస్ కా సంకల్ప్' అంటూ జెడియు తరపున విడుదల ఆ ప్రకటనపై భిన్నాభిప్రాయాలు వ్యక్త మవుతున్నాయి. తాము న్యాయం, అభివృద్ధికి అంకితమై ఉంటామని చెప్పడమే పార్టీ ఉద్దేశమని కొందరు అంటున్నారు. అయితే, 'న్యాయ్' అనేది కాంగ్రెస్ నినాదం కాబట్టి, భవిష్యత్తులో 'ఇండియా' కూటమివైపు మొగ్గు చూపించే అవకాశం ఉందని సూత్రప్రాయంగా జెడియు వెల్లడించిందని మరికొందరి వాదన. కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ చేపట్టిన రెండో యాత్రకు 'భారత్ జోడో న్యాయ్ యాత్ర' అని పేరు పెట్టిన విషయం తెలిసిందే. అదే విధంగా కాంగ్రెస్ తన మేనిఫెస్టోకు 'న్యాయ్ పాత్ర' అని పేరుపెట్టింది. ఈ కోణంలో చూస్తే, నితీశ్ 'ఇండియా'వైపు వెళ్లే అవకాశాలున్నాయన్న అభిప్రాయం బలపడుతున్నది. ఈ కూటమిని విడిచి తిరిగి బిజెపి పంచన చేరినప్పుడు, నితీశ్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు చెలరేగాయి. ఆ నష్టాన్ని భర్తీ చేసుకునే ప్రయత్నం కూడా జెడియు చేస్తుందనే వాదన కూడా వినిపిస్తున్నది. ఏదిఏమైనా టిడిపి అధినేత చంద్రబాబు నాయుడుతోపాటు నితీశ్ కూడా దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించడం ఖాయంగా కనిపిస్తున్నది.